

ఈ సంచికతోపాటు 12 పేజీల **లైఫ్** సప్లిమెంట్ అందుకోండి

ప్రభాత

వెలుగు

24.01.2019
www.v6velugu.com

గురువారం | హైదరాబాద్
సంపుటి: 4 సంచిక: 338 పేజీలు: 12+12+12 | ₹5
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | WARANGAL | JAGTIAL



రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో తలపడడానికి తనకూ బలమైన అస్త్రాలు ఉన్నాయని కాంగ్రెస్ సంకేతాలు పంపింది. కీలకమైన ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ, ఎస్పీ-బీఎస్పీ కూటమితో పాటు తామూ గట్టిగానే బరిలో ఉన్నామంటూ సంచలన నిర్ణయం ప్రకటించింది. అనూహ్యంగా కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ప్రియాంక గాంధీని నియమించింది. తూర్పు యూపీకి ఇన్‌చార్జిగా బాధ్యతలు కూడా అప్పగించింది. దీంతో ఈ నిర్ణయం కాంగ్రెస్‌కు ఎంత వరకు కలిసొస్తుందన్న చర్చ మొదలైంది. కొన్నేళ్లుగా కార్యకర్తలు కోరుతున్నా క్రియాశీల రాజకీయాలను దూరంగానే ఉండిపోయిన ప్రియాంకను ఇప్పుడే ఎందుకు తెచ్చారన్నది ఆసక్తి రేపుతోంది.

ప్రియాంక ఆగయా

అన్న రాహుల్‌కు అండగా పొలిటికల్ ఎంట్రీ

రాహుల్ ప్రూవ్ చేసుకున్నాకే కీలక నిర్ణయం
యూపీలో సవాలుకు కాంగ్రెస్ కొత్త వ్యూహం
తొలి అడుగులోనే ఆమెకు కఠిన పరీక్ష

వెలుగు బ్యూరో:
ప్రియాంకను క్రియాశీల రాజకీయాల్లోకి తేవడం ద్వారా యూపీలో ఎంతో కొంత ప్రభావం చూపించాలన్నది కాంగ్రెస్ తక్షణ వ్యూహం. ఢిల్లీకి దగ్గరి దారిగా భావించే ఉత్తరప్రదేశ్‌ను దృష్టిలో ఉంచుకొనే కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. దేశంలోనే అత్యధికంగా 80 ఎంపీ సీట్లున్న యూపీలో కొన్ని సీట్లయినా గెలుచుకోవాలని కాంగ్రెస్ ఆశిస్తోంది. అక్కడ ఇప్పటికే కాంగ్రెస్ పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిగా మారింది. ప్రధాన పార్టీలుగా ఉన్న ఎస్పీ, బీఎస్పీ పొత్తు పెట్టుకొని చెరో 38 సీట్లలో పోటీ చేస్తామని ప్రకటించాయి. కాంగ్రెస్‌ను సంప్రదించకుండానే రాహుల్ సీటు అమేథీ, సోనియాగాంధీ సీటు రాయ్‌బరేలీని మాత్రమే వదిలి మిగతా సీట్లను పంచుకున్నాయి. దీంతో ఓవైపు బలమైన బీజేపీ, ఇంకోవైపు ఎస్పీ – బీఎస్పీ కూటమి మధ్య కాంగ్రెస్ పరిస్థితి దారుణంగా మారింది. నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ ప్రాతినిధ్యం వహించిన రాష్ట్రంలో ఈ పరిస్థితి ఒకరకంగా కాంగ్రెస్‌కు అవమానకరంగా మారింది. అందుకే ప్రియాంకను తూర్పు యూపీకి ఇంచార్జిగా నియమించి అటూ బీజేపీకి, ఇటు మహాకూటమికి కాంగ్రెస్ సవాల్ విసిరినట్లు భావిస్తున్నారు. యూపీని కాంగ్రెస్ వదిలేయట్లేదనీ, రేసులో ఉన్నామని ఇతర పార్టీలకు, జనానికి సంకేతాలు పంపడం వ్యూహంగా కనిపిస్తోంది. ప్రియాంకను రంగంలోకి దించడం వల్ల యువతను, మహిళలను ఆకర్షించవచ్చని కాంగ్రెస్ నమ్ముతోంది. నాయనమ్మ ఇందిరాగాంధీని పోలి ఉండే ప్రియాంక ఆమె అభిమానులను ఆకట్టుకుంటారని భావిస్తున్నారు. ఆమె రాకతో కాంగ్రెస్ కూడా గట్టి పోటీ ఇస్తుందని భావిస్తే ఎస్పీ, బీఎస్పీ సంప్రదింపులకు ముందుకొస్తాయనే ఆలోచన కూడా రాహుల్ మాటల్లో కనిపిస్తోంది.

మిగతా 3లో



"కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ బ్యాక్‌ఫుట్‌పై ఆడదు. మేము ఫ్రంట్‌ఫుట్ పై ఆడతామని చెప్పేందుకే ప్రియాంకను, జ్యోతిరాదిత్య సింధియాను యూపీ ఇంచార్జులుగా నియమించాం. మాయావతి, అఖిలేశ్ మాకు శత్రువులు కారు. వారిని మేం గౌరవిస్తాం. బీజేపీని ఓడించడమే మా ఉమ్మడి లక్ష్యం. అయితే వారిప్పటికే పొత్తు పెట్టుకున్నారు కాబట్టి కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రియాంక ప్రచారం చేస్తారు.

- అమేథీలో రాహుల్ గాంధీ



5, 4, 3, 2, 1

నేడు నింగిలోకి పీఎస్ఎల్‌వీ సీ 44

కొత్త ఏడాది తొలి ప్రయోగానికి ఇస్రో రెడీ అయ్యింది. ఏపీలోని శ్రీహరికోట సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని మొదటి లాంచ్‌ప్యాడ్ నుంచి గురువారం రాత్రి 11:37 గంటలకు పీఎస్ఎల్‌వీసీ44ను ప్రయోగించబోతోంది. బుధవారం రాత్రి 7:37 గంటలకు కౌంట్‌డౌన్ మొదలైంది. ఈ రాకెట్ ద్వారా డీఆర్‌డీవో తయారు చేసిన 700 కేజీల మైక్రోశాట్‌ఆర్‌తో పాటు స్పేస్ కిడ్స్ ఇండియా, తమిళనాడులోని పల్లపట్టి గ్రామానికి చెందిన స్టూడెంట్లు కలిసి రూపొందించిన కలామ్‌శాట్‌ను నింగిలోకి పంపనున్నారు. మరోవైపు కమ్యూనికేషన్ శాటిలైట్ జీశాట్ 31ను ఫిబ్రవరిలో ప్రయోగించనున్నారు.

04



షమిలమిల కివిలవిల

తొలి వన్డేలో ఇండియా గ్రాండ్ విక్టరీ
8 వికెట్లతో న్యూజిలాండ్ చిత్తు

ఆస్ట్రేలియాలో మొదలైన సక్సెస్ మంత్రను న్యూజిలాండ్‌లోనూ కంటిన్యూ చేస్తోంది టీమిండియా. సొంతగడ్డపై తేలిగ్గా తలవంచదని పేరున్న న్యూజిలాండ్‌కు కోహ్లీసేన దిమ్మతిరిగేలా చేసింది. మహ్మద్ షమీ పేస్.. కుల్దీప్, చహల్ స్పిన్.. ధవన్ ధనాధన్ బ్యాటింగ్‌తో నేపియర్‌లో జరిగిన తొలి వన్డేలో గ్రాండ్ విక్టరీ కొట్టింది. ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా ఇక్కడి మెక్‌లారెన్ పార్క్‌లో బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో షమీ (3/19), కుల్దీప్ (4/39) ధాటికి కివీస్ 38 ఓవర్లలో 157 పరుగులకే కుప్పకూలింది. ఆ తర్వాత ఓపెనర్ శిఖర్ ధవన్(75 నాటౌట్) సత్తా చాటడంతో 34.5 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి టీమిండియా టార్గెట్‌ను ఛేదించింది. షమీకి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. సూర్య కిరణాల కారణంగా ఆటకు అంతరాయం కలగడం ఈ మ్యాచ్ స్పెషాలిటీ. ఇక వన్డేల్లో వేగంగా వంద వికెట్లు పడగొట్టిన ఇండియా బౌలర్‌గా షమీ రికార్డుకెక్కాడు.

11

వెన్‌కాబ్
(ఫారం గేట్ ధర)

హైదరాబాద్	వరంగల్	మహబూబ్‌నగర్
77.00	77.00	77.00
కరీంనగర్	**నిజామాబాద్**	**ఖమ్మం**
78.00	77.00	76.00

పీయూష్‌కు ఆర్థిక శాఖ

1న తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెట్టేది ఆయనే?

న్యూఢిల్లీ: రైల్వే మంత్రి పీయూష్‌గోయల్‌కు అదనంగా ఆర్థిక శాఖ బాధ్యతలను అప్పగిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెట్టాల్సిన సమయం దగ్గరపడుతున్నవేళ కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ అమెరికాలో ట్రీట్‌మెంట్ తీసుకుంటుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈమేరకు రాష్ట్రపతి భవన్ బుధవారం ఓ ప్రకటన విడుదలచేసింది. జైట్లీ తిరిగొచ్చేంత వరకూ గోయల్ ఈ బాధ్యతలు నిర్వర్తిస్తారు. కార్పొరేట్ వ్యవహారాల శాఖను పర్యవేక్షించడంతో పాటు ఫిబ్రవరి 1 న ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను మంత్రి పీయూష్ గోయల్ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. తిరిగి బాధ్యతలు స్వీకరించే వరకూ జైట్లీ ఏ పోర్ట్‌ఫోలియో లేని మంత్రిగా కొనసాగుతారని రాష్ట్రపతి భవన్ ప్రకటనలో పేర్కొంది.

ఆంధ్రా వార్తలు మనకెందుకు?



తెలంగాణ వచ్చినా
కొన్ని పత్రికల తీరు మారలే
ఏది చేసినా కరెక్టన్న
ధోరణి ఇకనైనా పోవాలె
జర్నలిస్టుల సమస్యలను
పరిష్కరించే బాధ్యత నాది
టీఆర్ఎస్ వర్కింగ్
ప్రెసిడెంట్ కేటీఆర్

02



పల్లీలతో పట్టీ

రాష్ట్రంలో వెలుగు చూసిన మరో మల్టీలెవల్ మోసం
పల్లీల నుంచి నూనె తీస్తూ సంపాదించొచ్చని వల
వేలాది మంది నుంచి వంద కోట్ల వరకూ వసూళ్లు!
పోలీసుల అదుపులో సూత్రధారి

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో మరో కొత్త తరహా మోసం వెలుగుచూపింది. పల్లీల నుంచి నూనె తీస్తూ భారీగా సంపాదించొచ్చని వల విసిరిన ఓ మల్టీలెవల్ కంపెనీ జనాన్ని నిండా ముంచింది. లక్ష పెట్టుబడి పెట్టి నెలకు 20 వేలు సంపాదించొచ్చని ఆశ పెట్టడంతో వందల మంది ఈ కంపెనీ చేతిలో మోసపోయారు. నాలుగు రాష్ట్రాల్లో వేలాది మంది నుంచి రూ.50 కోట్ల నుంచి వంద కోట్ల వరకు వసూలు చేసినట్టు సమాచారం. కంపెనీ సూత్రధారి జిన్న శ్రీకాంత్‌ను ఉప్పల్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. నిజామాబాద్‌కు చెందిన శ్రీకాంత్ కొన్నాళ్ల క్రితం హైదరాబాద్‌లోని ఉప్పల్ మెట్రోస్టేషన్ సమీపంలో గ్రీన్ గోల్డ్ బయోటెక్ పేరుతో కంపెనీ ఏర్పాటు చేశాడు. లక్ష రూపాయలు చెల్లిస్తే పల్లీల నుంచి నూనె తీసే మిషన్లు

మిగతా 2లో



సహస్ర మహా చండీయాగం సందర్భంగా ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం వేదఘోషతో ప్రతిధ్వనిస్తోంది. మూడో రోజు బుధవారం యాగ క్రతువు శాస్త్రోక్తంగా ముగిసింది. సీఎం కేసీఆర్ దంపతులు సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు.

02

ప్రతి దీపావళికి.. అడవిలో నన్ను నేను కలుసుకున్నా

జీవితం విలువ తెలుసుకున్నా

యువకుడిగా ఉన్నప్పుడు నేను ప్రతి దీపావళికి ఐదురోజులపాటు అడవిలోకి వెళ్లేవాడిని. స్వచ్ఛమైన నీళ్లుండి, మనిషనేవాడు కనిపించని చోటును ఎంచుకునేవాడిని. ఐదురోజులకు సరిపడే ఆహారాన్ని వెంట తీసుకెళ్లేవాడిని. అలా ఒంటరిగా గడిపిరావడం వల్ల జీవిత సత్యం తెలిసేది. నలుగురితో ఎలా ఉండాలో, ఎలా ముందుకు వెళ్లాలో బోధపడేది. అలా వెళ్లివచ్చినప్పుడల్లా చాలా మంది 'మీరు ఎవరిని కలవడానికి వెళ్తుంటారు' అని ప్రశ్నించేవారు. 'నన్ను నేను కలుసుకోవడానికి వెళ్తుంటాను' అని బదులిచ్చేవాడిని.

– ప్రధాని నరేంద్ర మోడీ



02

రాష్ట్రానికి రేపు వర్ష సూచన

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో శుక్రవారం పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం చెప్పింది. "27న వడగండ్ల వాన పడే అవకాశం ఉండొచ్చు. నైరుతి బంగాళాఖాతంలో 0.9 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. అక్కడి నుంచి రాయలసీమ మీదుగా తెలంగాణ వరకు ఉపరితల ద్రోణి ఏర్పడింది. దక్షిణ బంగాళాఖాతంపై అల్పపీడనం కొనసాగుతోంది" అని చెప్పింది. రాష్ట్రంలో ఇక నుంచి చలి తీవ్రత తగ్గుతుందని అధికారులు తెలిపారు.



పల్లీలతో పల్టీ

(మొదటిపేజీ తరువాయి)

ఇస్తామని, వాటితో నెలకు 20 వేలు సంపాదించొచ్చని నమ్మబలికి వందల మంది నుంచి డబ్బులు తీసుకుని యంత్రాలను సరఫరా చేశాడు. పల్లీలను తామే సరఫరా చేస్తూ వాటిలోంచి తీసిన నూనె తీసుకుంటామని చెప్పాడు. ఈ క్రమంలో మిషన్లు అప్పగించి బిజినెస్ ఇవ్వకపోవడంతో సరూర్‌నగర్‌కు చెందిన ఎన్.ఇంద్రకిరణ్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి శ్రీకాంత్‌ను అరెస్టు చేశారు. కేసు విచారణలో ఉందని, మొత్తం బాధితులు ఎంత మంది ఉన్నారన్న విషయం ఇప్పుడే చెప్పలేమని పోలీసులు తెలిపారు. జిన్న శ్రీకాంత్ గతంలోనూ మహా లైఫ్ పేరుతో మల్టీ లెవల్ మార్కెటింగ్ కంపెనీ నడిపి వేలాది మందిని మోసం చేశాడని తెలుస్తోంది.

ముగ్గురిపై వేటు

ఆదిలాబాద్ స్టాంపుల కుంభకోణంలో

ఆదిలాబాద్ టౌన్, వెలుగు: ఆదిలాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం స్టాంపుల కుంభకోణం వ్యవహారంలో మరో ముగ్గురు అధికారులపై వేటు పడింది. 2014 నుంచి 2018 వరకు అక్కడ పనిచేసిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఇమ్రాన్‌ఖాన్, బైంసా సబ్ రిజిస్ట్రార్ ఆర్.సాయినాథ్, లక్షెట్టిపేట్ సబ్ రిజిస్ట్రార్ అరుణ్‌కుమార్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఆదిలాబాద్ కార్యాలయం ఉద్యోగులు మనోహర్, చంద్రశేఖర్‌లపైనా వేటు వేశారు. అలాగే జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ జయంత్‌రావును బాధ్యతల నుంచి తప్పించి హైదరాబాద్ రిజిస్ట్రార్ రవీందర్‌కు అప్పగించారు. రూ. 78 లక్షల ఈ కుంభకోణానికి సంబంధించి ఇప్పటికే నలుగురు ఉద్యోగులపై క్రిమినల్ కేసులు నమోదైన విషయం తెలిసిందే.

కాళేశ్వరానికి రూ.7,784 కోట్ల రుణం

హైదరాబాద్, వెలుగు: కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ రూ.7,784.95 కోట్ల రుణం పొందేందుకు సర్కార్ అంగీకరించింది. బుధవారం రెండు జీవోలను జారీ చేసింది. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి అప్పు తీసుకోనున్నారు. పంపుహౌస్‌లు, ప్రెజర్ మెయిన్స్, గేట్లు, సబ్ స్టేషన్లు, ఇతర సివిల్ పనులకు రూ.5,405.39 కోట్లు, పైపులైన్లు, వాల్వ్‌లు, ట్రాస్ట్ బ్లాక్‌లకు రూ.2,379.56 కోట్లు రుణం తీసుకునేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ అప్పును 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి 2033-34 ఆర్థిక సంవత్సరం వరకు తిరిగి చెల్లించాలని నిర్ణయించారు.

మాటలు జాగ్రత్త

- టీజీ వెంకటేశ్‌పై పవన్ ఫైర్

విశాఖ, వెలుగు: జనసేన, టీడీపీ పొత్తుకు అవకాశాలున్నాయంటూ టీడీపీ నేత టీజీ వెంకటేశ్ చేసిన వ్యాఖ్యలపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ మండిపడ్డారు. తాము వద్దనుకుంటే వచ్చిన రాజ్యసభ ఎంపీ సీటుపై గెలిచిన టీజీ వెంకటేశ్ ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకోబని హెచ్చరించారు. పనికొచ్చే మాటలు మాట్లాడితే మంచిదని హితవు పలికారు. బుధవారం విశాఖ జిల్లా పాడేరులో జరిగిన బహిరంగ సభలో మాట్లాడిన పవన్ టీజీ వెంకటేశ్, ఏపీ సీఎం చంద్రబాబుపై విరుచుకుపడ్డారు. ప్రజల్ని రక్షించాల్సిన ప్రజాప్రతినిధులే దోపిడీ వ్యవస్థలో భాగస్వాములయ్యారన్నారు. రాష్ట్రంలో ఉద్యోగాల ఊసెత్తరు, గిరిజనులకు వర్సిటీలు ఏర్పాటు చేయరు, ఉన్న స్కూళ్లలో కనీసం మరుగుదొడ్లుండవు అని చంద్రబాబును ఉద్దేశించి విమర్శించారు. ప్రజల్ని మభ్యపెట్టి పేరు, డబ్బు సంపాదించాల్సిన అవసరం తనకు లేదన్నారు.



అమ్మవారికి హారతి ఇస్తున్న సీఎం దంపతులు



- రాజశ్యామల మంటపంలో సీఎం దంపతుల పూజలు
- ఉదయం నుంచి సాయంత్రం దాకా వైదిక క్రతువులు
- తరలి వచ్చిన నేతలు

చండీ పారాయణాలు.. నవార్ణ జపాలు

ఎర్రవల్లిలో కొనసాగుతున్న చండీ యాగం

హైదరాబాద్/ సిద్దిపేట, వెలుగు: ఎర్రవల్లిలోని సీఎం కేసీఆర్ ఫాంహౌస్ వేదమంత్రాలతో ప్రతిధ్వనిస్తోంది. సహస్ర మహాచండీ యాగంలో భాగంగా మూడోరోజు బుధవారం ఉదయం సీఎం దంపతులు కుటుంబ సభ్యులతో కలసి పూజలు చేశారు. మొదట రాజశ్యామల మంటపానికి చేరుకుని అమ్మవారికి తొలిపూజ చేశారు. రుత్వికులు రాజశ్యామల మూల మంత్ర జపం, మంటపార్చనలు, మూల మంత్ర హవనాలు, శరభ సాలువ మూల మంత్ర జప హవనం, మాతంగి మహా విద్య హవనం, ప్రదోషకాల మంటపార్చనలు, కుంకుమార్చన, సహస్ర నామార్చన, హారతి మంత్ర పుష్పం చతుర్వేద స్వస్తి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహాకాళి, మహా సరస్వతి, మహాలక్ష్మి పూజలు, బ్రహ్మ స్వరూపిణీ మంటపంలో పూజలు చేశారు. తర్వాత నవగ్రహ పూజలు నిర్వహించారు. రుత్వికులు చతుర్వేద పారాయణ మంటపంలో ప్రార్థనలతో పాటు సూర్య నమస్కారాలు చేశారు. ఉదయం పూజ తర్వాత రుత్వికులు 300 చండీ పారాయణాలు పూర్తి చేశారు. సాయంత్రం క్రతువులో 2 లక్షల నవార్ణ జపాలు చేశారు. మహారుద్ర మంటపంలో రుద్ర హవనం, రుద్ర పారాయణం నిర్వహించారు.

41 ఏకాదశ రుద్రాభిషేకాలు

రుత్వికులు యాగశాలలో శాంతిపాఠంతో ఆరంభించి ఆవాహిత దేవతా పూజ, 41 ఏకాదశ రుద్రాభిషేకాలు పూర్తి చేశారు. మధ్యాహ్నం 3 నుంచి 41 ఏకాదశ హోమాలు, క్రమార్చన హారతీ మంత్రపుష్పం నిర్వహించారు. బగళాముఖి పూజానంతరం పది వేల జపాలు పూర్తి చేశారు. సాయంత్రం 7 గంటలకు సీఎం కేసీఆర్ దంపతులు మహాహారతి, మంత్రపుష్పము, తీర్థ ప్రసాద వితరణతో మూడోరోజు పూజాదికలు ముగిశాయి. యాగంలో మాజీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

23 వేల రైల్వే కొలువులు

'10%' కోటాలో వచ్చే రెండేళ్లలో భర్తీ.. రైల్వే మంత్రి పీయూష్ గోయల్



న్యూఢిల్లీ: అగ్రకుల పేదలకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్న తొలి ప్రభుత్వ శాఖ రైల్వేనని ఆ శాఖ మంత్రి పియూష్‌గోయల్ బుధవారం చెప్పారు. వచ్చే రెండేళ్లలో 23 వేల ఉద్యోగాలు ఈ కోటా కింద భర్తీ అవుతాయన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల ప్రస్తుతమున్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లకు ఎలాంటి నష్టం ఉండదని చెప్పారు. మరో 6 నెలల్లో 1.31 లక్షలు, రెండేళ్లలో లక్ష ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తామన్నారు. 'రైల్వేలో 15,06, 598 ఉద్యోగాలుండగా ప్రస్తుతం 2,82,976 ఖాళీగా ఉన్నాయి. వీటిలో 1,51,548 పోస్టుల భర్తీ సాగుతోంది. మరో 1,31,428 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. 2019 20లో 53 వేలు, 202021లో 46 వేల ఉద్యోగులు పదవీవిరమణ చేస్తారు. తద్వారా మరో లక్ష పోస్టులు ఖాళీ అవుతాయి. మొత్తంగా రెండేళ్లలో 4 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తాం' అన్నారు. రెండు దశల్లో భర్తీ ప్రక్రియ చేపడతామని, తొలిదశలో 1,31,328 పోస్టులకు ఫిబ్రవరిలో నోటిఫికేషన్ ఇస్తామని గోయల్ చెప్పారు. రిజర్వేషన్ల ప్రకారం 19,715 ఉద్యోగాలు ఎస్సీలకు, 9,857 ఎస్టీలు, 35,485 ఓబీసీలకు రిజర్వ్ అవుతాయన్నారు. ఏప్రిల్, మే నెలల్లో తొలిదశ పూర్తవుతుందని, రెండోదశలో 99 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారు. ఇందులో 15 వేలు ఎస్సీలకు, 7,500 ఎస్టీ, 27 వేలు బీసీ, 10 వేలు ఈడబ్ల్యూఎస్‌కు రిజర్వ్ అవుతాయన్నారు.

మోడల్ టౌన్‌గా యాదాద్రి

- ప్రతిపాదనలు రూపొందించండి
- అధికారులతో సీఎస్ ఎస్‌కే జోషి



హైదరాబాద్/యాదాద్రి, వెలుగు: యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని ప్రపంచ స్థాయి పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దేలా పునర్ నిర్మిస్తున్నందున అందుకు తగ్గట్టే గుట్ట పట్టణాన్ని మోడల్ టౌన్‌గా మార్చేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని వివిధ శాఖల అధికారులను సీఎస్ ఎస్‌కే జోషి ఆదేశించారు. దేవాలయానికి వచ్చే భక్తులకు అనుగుణంగా మోడల్ బస్ స్టేషన్ నిర్మించాలని, దీనికి కూడా ప్రణాళిక రూపొందించాలన్నారు. దేవాలయ నిర్మాణ పనులపై వైటీడీఏ (యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ), ఇతర శాఖల అధికారులతో బుధవారం సచివాలయంలో జోషి సమావేశం నిర్వహించారు. పెద్దగుట్టలో 132/33 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణాన్ని ఏప్రిల్ 15 వరకు పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. పట్టణంలో రోడ్లు విస్తరించాలని, సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, మొక్కలు పెంచాలని, పార్కులను అభివృద్ధి చేయాలని, ఫుట్‌పాత్‌ల నిర్మాణం, డంపింగ్ యార్డుల పనులు వేగవంతం చేయాలన్నారు. జంక్షన్లను అభివృద్ధి చేయాలని, కమాండ్ కంట్రోల్ సెంటర్, ఫైర్ స్టేషన్, గండిచెరువు అభివృద్ధి, వేద పాఠశాల, లక్ష్మీనరసింహ స్వామి ఆర్కిటెక్చర్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

తెలంగాణ వచ్చినా అదే భావజాలమా ?

ఇంకా కొన్ని పత్రికల తీరు మారలె: కేటీఆర్



బుధవారం హైదరాబాద్ ఇందిరాప్రియదర్శిని హాల్‌లో జరిగిన సభలో మాట్లాడుతున్న కేటీఆర్

- చంద్రబాబువి ఆపద మొక్కులు
- మన పథకాలు కాపీ కొడుతున్నడు
- జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించే బాధ్యత తనదన్న టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

హైదరాబాద్, వెలుగు: తెలంగాణ ఏర్పడి దాదాపు ఐదేండ్లు అవుతున్నా ఇంకా కొన్ని పత్రికలు, మీడియా సంస్థలు ఆధిపత్య భావజాలాన్ని ప్రదర్శించే ప్రయత్నాలను మానడం లేదని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. "మేం ఏది చేసినా కరెక్టు.. ఏం చెబితే అదే వేదం అనే ధోరణి. తెలంగాణపై ఆధిపత్యం చెలాయించే ధోరణి సరికాదు. ఇది పోతే మంచిది. ఎవ్వరూ ఇంకొకరిపై ఆధిపత్యం చెలాయించాలని కోరుకోవడం లేదు" అని అన్నారు. బుధవారం ఇందిరాప్రియదర్శిని హాల్‌లో జర్నలిస్టు, ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్‌కు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ అభినందన సభ నిర్వహించింది. దీనికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. "పోరాటంతో తెలంగాణ తన అస్తిత్వాన్ని నిలుపుకుంది. ఇప్పుడు కూడా రోజూ తెల్లారి లేవంగనే అమరావతి వార్తలు ప్రచురిస్తే మాకు అభ్యంతరం లేదు. అలాగే అమరావతిలో కూడా తెలంగాణ వార్తలు ప్రచురించే సంస్కారం ఉండాల్నా .. లేదా? ఉంటాయా మన వార్తలు? ఢిల్లీలో మన వార్తలు కనబడవు. మన ముఖాలు కనబడవు. ఇక్కడొక నాయకుడున్నట్లు గానీ, ముఖ్యమంత్రి ఉన్నట్లు గానీ కనబడదు. ఏందని అడిగితే అవి ఆంధ్రా ఎడిషన్లు అని చెబుతారు. ఆంధ్రా ఎడిషన్ల తెలంగాణ వార్తలు రాయనప్పుడు తెలంగాణ ఎడిషన్లో ఆంధ్రా వార్తలు మాకెందుకు? అవసరమా? మొన్న ముఖ్యమంత్రికి చెప్పిన. నేను కూడా అంటావున్నా.. తెలంగాణ భావజాలాన్ని అణువణువునా నింపుకొని పనిచేస్తున్న పత్రికలను, మాధ్యమాలను తప్పకుండా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని నా భావన. అందుకు మీ అందరి సహకారం కూడా అవసరం. ఎందుకంటే అలాంటి ప్రయత్నం చేస్తే వెంటనే ఫ్రీడం ఆఫ్ ఎక్స్‌ప్రెషన్‌ను తొక్కేస్తున్నరు.. మీడియా గొంతు నొక్కుతున్నరు.. అని మీడియా మొత్తం మీద దాడిగా కొంతమంది చిత్రీకరించే ప్రయత్నం చేస్తరు. అలాంటి అరాచక ప్రచారానికి జర్నలిస్టు మిత్రులు సహకరించవద్దని కోరుతున్నా. తెలంగాణలోని కలం మేధావులు, కలం వీరులందరూ తెలంగాణ ఉనికి వైపు నిలబడాలె. తెలంగాణ వాదాన్ని, తెలంగాణ అస్తిత్వాన్ని తొక్కిపెట్టే ప్రయత్నం ఇంకా జరుగుతున్నది. ఇది పోవాల్సిన అవసరం కచ్చితంగా ఉంది. ఇది ఎవరి గురించి మాట్లాడుతున్నానో నాకంటే బాగా మీకే తెలుసు. వాళ్లు ఆలోచించుకుంటే మంచిది. ఎందుకంటే ఈ డ్రామా ఇంకా ఎక్కువ రోజులు నడవదు" అని అన్నారు.

ఇంకొన్ని సమస్యలున్నాయి : అల్లం

జర్నలిస్టులకు సంబంధించి ఇప్పటికే చాలా సమస్యలను ప్రభుత్వం పరిష్కరించిందని, మరికొన్నింటిని పరిష్కరించాల్సి ఉందని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అన్నారు. సీఎం కేసీఆర్‌కు జర్నలిస్టుల సమస్యలు తెలుసునన్నారు.

జర్నలిస్టుల బాధ్యత నాది

"నేను ప్రభుత్వంలో ఉన్నా లేకపోయినా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించే బాధ్యత నాది. వ్యక్తిగతంగా తీసుకుంటా. ఇంకా ఐదేండ్ల సమయం ఉంది మనకు. తెలంగాణలో జర్నలిస్టుల సంక్షేమానికి దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా టీఆర్ఎస్ ప్రభుత్వం కృషిచేసింది" అని కేటీఆర్ చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా జర్నలిస్టు వెల్ఫేర్ ఫండ్‌ను ఏర్పాటు చేసినట్టు వివరించారు. 2004లో దుబ్బాక నుంచి జర్నలిస్టు సోలిపేట రామలింగారెడ్డిని, మరో జర్నలిస్టు సత్యనారాయణరెడ్డిని చట్టసభలకు పంపినట్టు చెప్పారు. జర్నలిస్టు, కాలమిస్టు, ప్రొఫెసర్ గంటా చక్రపాణి స్థాయికి తగ్గట్టుగా టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా బాధ్యతలు కల్పించామన్నారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, హెల్త్‌కార్డుల విషయంలో ఇంకా సమర్థంగా పనిచేసేందుకు టీఆర్ఎస్ కృషి చేస్తుందన్నారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ భవనానికి స్థలం కేటాయించే అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఏపీలో జర్నలిస్టుల ఇండ్ల స్థలాలకు 30 ఎకరాల స్థలం కేటాయించారని కాంత్రి ఇప్పుడే చెప్పారంటూ.. చంద్రబాబువి ఆపద మొక్కులని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ పథకాలను ఏపీ సీఎం కాపీ కొడుతున్నారన్నారు. ఆంధ్రా ప్రజలు ఎన్నికల ముందు డ్రామాలను తెలుసుకోలేని వారు కాదన్నారు.

పోలింగ్‌పై పూర్తి సమాచారం ఇవ్వండి

ఈసీకి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, వెలుగు: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో శాసనసభ ఎన్నికల ఫలితాల్లో అక్రమాలు జరిగాయంటూ బీఎస్పీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి వేసిన పిటిషన్‌పై బుధవారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఓట్ల లెక్కింపునకు సంబంధించి పూర్తి వివరాలివ్వాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. జనవరి 30న విచారణ జరిగే సమయానికి ఓట్ల పోలింగ్‌పై సమగ్ర సమాచారాన్ని అందించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీ రాధాకృష్ణన్, జస్టిస్ ఎ రాజశేఖర్‌రెడ్డిల ధర్మాసనం ఆదేశించింది. మల్‌రెడ్డిపై టీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి 376 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. దీంతో ఓట్ల లెక్కింపులో అక్రమాలు జరిగాయని, అన్ని వీవీప్యాట్‌లలో స్లిప్పులను లెక్కించేలా ఈసీని ఆదేశించాలంటూ మల్‌రెడ్డి పిటిషన్ వేశారు. నియోజకవర్గంలోని 199, 221 నంబర్ పోలింగ్ కేంద్రాల్లోని వీవీ ప్యాట్ స్లిప్పులను, ఈవీఎంలను పోలిస్తే తేడా ఉందని స్పష్టమైందని, దీనిపై అభ్యంతరాన్ని ఖాతరు చేయకుండా ఫలితం ప్రకటించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ నెల 30న ఈసీ వాదనలను కోర్టు విచారించనుంది.

ఇందూ అరణ్య కేసులో ప్రతివాదిగా సీఎస్

హైదరాబాద్, వెలుగు: ఇందూ అరణ్య ప్రాజెక్టు కేసులో సీఎస్ జోషిని ప్రతివాదిని చేస్తూ హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. డబ్బులు చెల్లించినా ప్రాజెక్టు ప్లాట్లు, విల్లాలు రిజిస్ట్రేషన్ చేయకపోవడాన్ని కోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ఈ విషయంలో వెంటనే స్పందించాలని ఆదేశించినా సాకులు చెబుతూ గడువు కావాలని కోరడాన్ని క్షమించలేమని పేర్కొంది.

ప్రతి దీపావళికి అడవిలో గడిపేవాడిని



- ఐదు రోజులు అక్కడే ఒంటరిగా ఉండేవాడిని
- రెండేళ్లు హిమాలయాల్లో తిరిగాను
- సాధువులతో కలిసి ధ్యానం చేసేవాడిని
- ఉదయం 3.45 గంటల్లోపే నిద్రలేచేవాడిని
- నాన్నతో కలిసి రైల్వేస్టేషన్‌లో టీ సర్వ్ చేశా
- అలా చేయడం వల్ల జీవితం విలువ తెలిసింది
- యువత కాసేపు బిజీ లైఫ్‌ను పక్కనబెట్టాలి
- మన గురించి మనం తెలుసుకోవాలి

ఫేస్‌బుక్ పేజీ ఇంటర్వ్యూలో ప్రధాని మోడీ

ముంబై: ఏటా దీపావళికి అడవికి వెళ్లేవాడినని, ఐదు రోజులపాటు అక్కడే ఒంటరిగా గడిపేవాడినని ప్రధాని నరేంద్రమోడీ గుర్తు చేసుకున్నారు. దాని వల్ల జీవితం అంటే ఏమిటో తెలిసివచ్చేదని అన్నారు. 17ఏళ్ల వయసులో రెండేళ్లపాటు హిమాలయాల్లో సంచరించానని, సాధువులతో కలిసి ధ్యానం చేశానని తెలిపారు. బుధవారం 'హ్యూమన్స్ ఆఫ్ బాంబే' ఫేస్‌బుక్ పేజీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మోడీ పలు ఆసక్తికర అంశాలను పంచుకున్నారు. యువకుడిగా ఉన్నప్పుడు తాను వ్యక్తిత్వాన్ని ఎలా నిర్మించుకున్నానో వివరించారు. తండ్రితో కలిసి టీ అమ్మిన క్షణాలను కూడా ప్రస్తావించారు. 'ప్రతి దీపావళికి ఐదు రోజులపాటు అడవికి వెళ్లేవాడిని. మనుషులు లేని, స్వచ్ఛమైన నీళ్లు ఉన్న ప్రాంతాన్ని ఎంచుకునేవాడ్ని. ఆ ఐదురోజులకు కావాల్సినంత ఆహారాన్ని వెంట తీసుకెళ్లేవాడిని. రేడియో, న్యూస్ పేపర్స్ జోలికి వెళ్లేవాడిని కాదు. అప్పట్లో టీవీలు, ఇంటర్నెట్ లేదు. అలా ఒంటరిగా గడిపి రావడంతో జీవిత సత్యం తెలిసేది. నలుగురితో ఎలా ఉండాలో, జీవితాన్ని ఎలా ముందుకు తీసుకువెళ్లాలో బోధపడేది. పైగా మన గురించి నలుగురు ఎలా ఆలోచిస్తున్నారో అర్థమయ్యేది' అని అన్నారు. అలా వెళ్లివచ్చినప్పుడల్లా చాలా మంది 'మీరు ఎవరిని కలవడానికి వెళ్తుంటారు' అని ప్రశ్నించేవారని, 'నన్ను నేను కలుసుకోవడానికి వెళ్తుంటాను' అని వారికి బదులిచ్చేవాడినని మోడీ పేర్కొన్నారు. 'ఈ తరానిది తీరికలేని జీవితం. బిజీ లైఫ్‌కు కొంచెం విరామం ఇచ్చి.. మీతో మీరు గడపండి. అలా గడపడం ఎంతో ఉపయోగపడుతుంది. జీవితం మీద నమ్మకాన్ని పెంచుతుంది. అనుకున్నది సాధించగలుగుతాం. నిజమైన ప్రపంచంలో జీవించగలుగుతాం' అని యువతకు హితవుపలికారు. అందరిలోనూ ఏదో ఒక ప్రత్యేకత ఉంటుందని, దాన్ని నిరూపించుకోవాలి తప్ప ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురు చూడడం వృథా అని అన్నారు. ప్రతి మనిషి తనకు తాను ప్రత్యేకమైనవాడేనని, తనలోని గొప్పతనాన్ని తెలుసుకోకుండా ఇంకేదో దాని కోసం పాకులాడవద్దని ఆయన సూచించారు.

సాధువులతో కలిసి..

17 ఏళ్ల వయసులో తాను రెండేళ్లపాటు హిమాలయాల్లో ఉండివచ్చినట్లు ప్రధాని మోడీ తెలిపారు. 'హిమాలయాలకు వెళ్లక ముందు అంతా చీకటే. అగమ్యగోచరం. ఎలా ముందుకు వెళ్లాలో అర్థమయ్యేది కాదు' అని అన్నారు. 'హిమాలయాల్లో కొన్నాళ్లపాటు రామకృష్ణ మిషన్ దగ్గర ఆశ్రయం పొందాను. ఎందరో సాధువులను కలిశాను. వాళ్లతో కలిసి ధ్యానం చేసేవాడిని. వారితోపాటు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సంచరించేవాడిని' అని తెలిపారు. 'ఆ సమయంలో తెల్లవారుజామున 3 గంటల నుంచి 3.45 గంటల మధ్య నిద్రలేచేవాడిని. అది బ్రహ్మ ముహూర్తమని పెద్దలు చెప్తుంటారు. అంత పొద్దున చల్లటి నీళ్లతో స్నానం చేస్తుంటే మొదట వణుకు వచ్చేది. రానురాను దాని ప్రయోజనం తెలిసివచ్చింది. అక్కడి పరిసరాల వల్ల విశ్వంలో మనమెంత అన్నది బోధపడింది' అని మోడీ గుర్తుకు తెచ్చుకున్నారు. అలా రెండేళ్లపాటు హిమాలయాల్లో ఉండి అహ్మదాబాద్ వచ్చానని, కొన్నిరోజులు తన మామ క్యాంటీన్‌లో పనిచేశానని, ఆ తర్వాత ఆర్ఎస్ఎస్ ప్రచారకర్తగా ముందుకు సాగానన్నారు. ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో అన్ని వర్గాలకు చెందిన ప్రజలతో మాట్లాడేందుకు అవకాశం దొరికిందని, జీవితపు పరిధి ఎంత విస్తృతమైనదో తెలుసుకోగలిగానన్నారు. ఆ సమయంలో ప్రతిరోజు ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో ఊడ్చటం, టీ, ఫుడ్ సప్లై చేయడం వంటి పనులు చేసేవాడినని తెలిపారు.

నాన్నకు తోడుగా..

తన తండ్రికి తోడుగా రైల్వేస్టేషన్‌లో టీ అమ్మేవాడినని మోడీ తన బాల్య స్మృతులను కూడా గుర్తుకు తెచ్చుకున్నారు. 'నాన్నకు తోడుగా రైల్వేస్టేషన్‌లో చాయ్ దుకాణంలో పనిచేసేవాడిని. రైల్వేస్టేషన్‌లో చాయ్ సర్వ్ చేస్తూ.. అక్కడి జనం బాధలు ఆలకించేవాడిని. దేశంలోని వివిధ ప్రాంతాల వాళ్లందరూ అక్కడ కలిసేవారు. వాళ్లు హిందీలో మాట్లాడుతూ ఉంటే విని ఆ భాషను నేర్చుకున్నాను. అక్కడి వారు బొంబాయి గురించి ఎక్కువగా ముచ్చటించుకునేవారు. నేనెప్పుడైనా ఆ కలల నగరం చూడగలనా అని ఆశపడేవాడిని' అని అన్నారు.



ప్రియాంక ఆగయా

మొదటి పేజీ తరువాయి..
యూపీ టార్గెట్‌గా 2013లో నరేంద్ర మోడీ నడిపించిన వ్యూహం రాహుల్ గాంధీని ఆకర్షించినట్లు కనిపిస్తోంది. అప్పట్లో మోడీని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించగానే గుజరాత్ ఎమ్మెల్యేగా ఉన్న అమిత్ షాను యూపీ వ్యవహారాల ఇంచార్జిగా పెట్టించారు. 2009 ఎన్నికల్లో యూపీలో బీజేపీ గెలిచింది 10 ఎంపీ సీట్లే. దీంతో అక్కడ పార్టీని సంస్థాగతంగా పటిష్టం చేయడంపై అమిత్ షా దృష్టిపెట్టారు. హిందూ ఓట్లను పూర్తిస్థాయిలో ఆకర్షించడానికి అన్ని ప్రయత్నాలు చేశారు. అప్పట్లో ముజఫర్ నగర్ అల్లర్లు జరగడాన్ని కూడా బీజేపీ రాజకీయంగా ఉపయోగించుకుంది. మోడీ సొంత రాష్ట్రం గుజరాత్‌తో పాటు పుణ్యక్షేత్రమైన వారణాసి నుంచి కూడా పోటీ చేయించారు. ఈ వ్యూహం బీజేపీకి బాగా కలిసొచ్చింది. అటు అభివృద్ధి నినాదం, ఇటు హిందుత్వ నినాదాలతో యూపీలో బీజేపీ మిత్రపక్షాలతో కలిసి ఏకంగా 73 సీట్లతో ఊహించని విజయాన్ని సాధించింది.

కాంగ్రెస్ పరిస్థితి చూస్తే గతంలో యూపీని తిరుగులేకుండా ఏలినా మూడు దశాబ్దాలుగా అక్కడ ఉనికి కాపాడుకోవడానికే తంటాలు పడుతోంది. 1989లో ఇక్కడ కాంగ్రెస్ అధికారం కోల్పోయిన తర్వాత మళ్లీ పవర్ సంగతి అలా ఉంచితే కనీసం గట్టి పోటీ ఇవ్వలేకపోతోంది. ఇప్పుడు యూపీ అసెంబ్లీలో కాంగ్రెస్‌కు ఉన్నది ఏడుగురు ఎమ్మెల్యేలే. గత ఎన్నికల్లో సోనియాగాంధీ, రాహుల్ మాత్రమే కాంగ్రెస్ నుంచి ఎంపీలుగా గెలిచారు. గత 30 ఏళ్లలో 2009లో మాత్రమే కాంగ్రెస్ కాస్త బలంగా కనిపించింది. బాబ్రీ మసీదు విధ్వంసం సమయంలో సీఎంగా ఉన్న కళ్యాణ్ సింగ్ 2009 నాటికి బీజేపీని వదిలి సమాజ్ వాదీ పార్టీతో చేతులు కలిపారు. ఆ ఆగ్రహంతో ముస్లింలు కాంగ్రెస్‌కు మద్దతివ్వడంతో 21 ఎంపీ సీట్లు సాధించింది. ఈ పరిస్థితిని మార్చుకోవడానికి రాహుల్ కొత్త ఆలోచన చేసినట్లు భావిస్తున్నారు.

అన్న కోసం చెల్లి
ప్రియాంకను బరిలో దించి యూపీలోనే కాకుండా దేశవ్యాప్తంగా కూడా కాంగ్రెస్ కేడర్ లో జోష్ నింపాలన్నది రాహుల్ గాంధీ మరో ఆలోచన. ఆమెను రాజకీయాల్లోకి తీసుకురావాలన్న డిమాండ్ 2009 నుంచే ఉంది. 2009, 2014 ఎన్నికల్లో రాహుల్, సోనియా దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తే ప్రియాంక అమేథీ, రాయ్‌బరేలీల్లో ప్రచారానికి పరిమితమయ్యారు. 2014లో కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోయిన తర్వాత మళ్లీ ప్రియాంక పేరు గట్టిగా వినిపించింది. అయితే అప్పుడు తీసుకొస్తే రాహుల్ వైఫల్యం వల్లే తెచ్చారన్న ముద్ర పడుతుందని సోనియా భావించారు. పైగా పార్టీలో రెండు అధికార కేంద్రాలు తయారవ్వకూడదనీ, తామంతా ఒకే మాటపై ఉన్నామన్న సంకేతాలివ్వడానికే ప్రియాంక ఎంట్రీని ఆపినట్లు తెలుస్తోంది.

ఇటీవల జరిగిన ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయంతో రాహుల్ నాయకత్వంపై సందేహాలు తొలగిపోయాయని పార్టీ భావిస్తోంది. మోడీకి పోటీ ఇవ్వగలిగేలా రాహుల్ ఇమేజ్ పెరిగిందన్న భావనకు వచ్చింది. ఇలాంటి సమయంలో ప్రియాంకను క్రియాశీల రాజకీయాల్లోకి తీసుకొచ్చి రాహుల్‌కు ప్రత్యామ్నాయంగా కాకుండా అన్నకు తోడుగా చెల్లి వచ్చిందన్న సందేశాన్ని కేడర్‌కు పంపారని కాంగ్రెస్ వర్గాలంటున్నాయి.

తొలి అడుగే అగ్నిపరీక్ష

తూర్పు యూపీ కాంగ్రెస్ ఇంచార్జిగా ప్రియాంకను నియమించడం కాంగ్రెస్ కేడర్‌కు జోష్ ఇచ్చినా ఆమెకు మాత్రం పెద్ద పరీక్షే పెట్టబోతోంది. యూపీలో కాంగ్రెస్ పరిస్థితి దారుణంగా ఉండడమే దీనికి కారణం. గత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ 7 శాతం ఓట్లు సాధించింది. సీట్లు తగ్గినా ఎస్పీ 22 శాతం, బీఎస్పీ 19 శాతం ఓట్లు తెచ్చుకున్నాయి. అమేథీ, రాయ్‌బరేలీలో తప్ప కాంగ్రెస్ ఉనికి లేదు. రాహుల్ గాంధీ ఎంపీగా ఉన్న అమేథీ పరిధిలో కూడా కాంగ్రెస్‌కు ప్రస్తుతం ఒక్క ఎమ్మెల్యే కూడా లేరు. రాయ్ బరేలీ పరిధిలో ఇద్దరే ఉన్నారు. మిగతా నియోజకవర్గాల పరిస్థితి చెప్పనక్కర్లేదు. తూర్పు యూపీలో దాదాపు 25 ఎంపీ సీట్లున్నాయి. సెంట్రల్ యూపీని కూడా కలిపితే దాదాపు 35 అవుతాయి. మోడీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసి, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సొంత నియోజకవర్గం గోరఖ్‌పూర్ కూడా తూర్పు యూపీలోనే ఉంటాయి. ఇక్కడ కాంగ్రెస్ బలం చాలా తక్కువ. పోటీ ప్రధానంగా బీజేపీ, మహాకూటమి మధ్యే కనిపిస్తోంది. కేడర్‌ను సమాయత్తం చేయడానికి ప్రియాంకకు పెద్దగా సమయం లేదు. ఫిబ్రవరి తొలి వారంలో ఆమె బాధ్యతలు తీసుకుంటారని ఏఐసీసీ ప్రకటించింది. ఆ తర్వాత ఎన్నికలకు 3 నెలల సమయం కూడా లేదు. ఈ పరిస్థితిలో ఆమె ప్రభావం ఎలా ఉంటుందన్నది చూడాలి. ఏదేమైనా తొలి అడుగుతోనే కఠిన పరీక్షను ఎదుర్కొంటున్నారు.

ప్రియాంక నియామకంపై పీసీసీ హర్షం

హైదరాబాద్, వెలుగు: ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా ప్రియాంక గాంధీని నియమించడం పట్ల పలువురు పీసీసీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి మధు యాష్కీ, ఏఐసీసీ అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్, మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, మల్లు రవి , పీసీసీ కోశాధికారి గూడూరు నారాయణ రెడ్డి బుధవారం సంతోషం వ్యక్తం చేశారు. ప్రియాంక క్రియాశీల రాజకీయాల్లోకి రావడాన్ని స్వాగతిస్తున్నామని, దేశవ్యాప్తంగా కాంగ్రెస్ బలపడుతుందన్న విశ్వాసం ఉందన్నారు. గాంధీభవన్‌లో కార్యకర్తలు, అభిమానులు టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్నారు. ప్రియాంక రాజకీయాల్లోకి రావడం హర్షణీయమని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కుంతియా అన్నారు.

స్పీకర్ పదవికి వన్నె తెస్త

హైదరాబాద్, వెలుగు:
ప్రజల కష్టాలు, సమస్యలను ప్రజాప్రతినిధులు తీర్చాలని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శాసనసభ నిర్వహణలోనూ రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతానని ధీమా వ్యక్తం చేశారు. 'వీ 6 వెలుగు'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలను పంచుకున్నారు.

వెలుగు: రూట్ లెవల్ నుంచి స్పీకర్ దాకా వచ్చారు.. ఎలా సాధ్యమైంది?
పోచారం: ఏ పదవి ఇచ్చినా చిత్తశుద్ధితో చేసిన. నేను మంత్రిగా ఉన్నప్పుడు ఉదయం 10 గంటలకు మొదలు పెడితే రాత్రి 10 గంటల దాకా రివ్యూ మీటింగ్‌లు జరిపినం. డీప్‌గా డిస్కస్ చేసే వాళ్లం. నేను అట్లా చేశాను కాబట్టే అధికారులు కూడా అట్లనే పనిచేసిన్రు. పోచారం శీనన్న చెప్పిన పనిని చెప్పినట్టుగా చేస్తరనే సీఎం నన్ను ఈ పదవికి ఎంపిక చేసిన్రు. రాష్ట్రం అన్ని రంగాల్లో ఎట్లయితే నంబర్‌వన్‌గా ఉన్నదో.. శాసనసభ సమావేశాల్లోనూ నంబర్ వన్‌గా చేస్త. సభలో చిల్లర మల్లర మాటలు ఉండొద్దు. చర్చ ఏదైనా అందరికీ అవకాశం ఇస్త. సభ సంప్రదాయాలను గౌరవ ప్రదంగా నడిపిస్త.

స్పీకర్ పదవిని నడిపించడం కత్తిమీద సాము కాదా?
కొత్తగా ఎన్నికైన సభ్యులకు సభా వ్యవహారాలపై శిక్షణ ఇప్పిస్త. పార్టీ ఏదైనా గెలిచింది ప్రజల కోసమే. ప్రజలకు అభివృద్ధి కావాలి. పేదల సంక్షేమంపైనే సభలో మాట్లాడాలి. సభ్యులు ప్రశ్న వేసి మంత్రి నుంచి సమాధానం రాబట్టాలి.

స్పీకర్ పదవి సంతోషంగా స్వీకరించారా?
హండ్రెడ్ పర్సెంట్ సంతోషంగా స్వీకరించా. నా జీవితానికి ఇంకేం కావాలి. సొసైటీ చైర్మన్ అయిన, ఆరు సార్లు ఎమ్మెల్యే అయిన. పదేండ్లు మంత్రిగా చేసిన. దాని తర్వాత ఇంకా ఆశ ఏముంటది. మనస్ఫూర్తిగా పదవిని స్వీకరించిన. అట్లనే పనిచేస్త. ఈ పదవికి వన్నె తెస్త.



- మన స్ఫూర్తిగా పదవిని స్వీకరించా
- సభలో అందరికీ అవకాశం ఇస్తా
- 'వీ6 వెలుగు' ఇంటర్వ్యూలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

పోచారం అంటే మాస్ లీడర్, ఇప్పుడు జనానికి దూరమవుతారు కదా?
ఇప్పటికీ పోతాను అదేం లేదు. రోజూ వంద రెండు వందల మంది కార్యకర్తలు కలుస్తున్నరు. స్పీకర్ అయినంత మాత్రాన నేను జనాల్ని కలువద్దని లేదు. స్పీకర్ పదవి అంటే ఏమన్నా కరెంట్ షాకా? మధుసూదనాచారి నియోజకవర్గంలో జనంలో పడుకున్నరు. ఆయన చిన్న పిల్లలతో గోటీలాడిన్రు. నేను అట్లాగే ప్రజలతో ఉంట. సభ లేనప్పుడు నియోజకవర్గంలోనే ఉంటా. ప్రజలతో మమేకమై పనిచేస్త. వారి మనిషిగా ఇంకా దగ్గరగా సంబంధాలు కొనసాగిస్త.

స్పీకర్ అయినవారు తర్వాత చట్టసభల్లో గెలవరనే బ్యాడ్ సెంటిమెంట్ ఉంది. దాన్ని నమ్ముతారా?
అది తప్పు. ముందస్తు ఎన్నికలకు పోయిన వారు మళ్లీ గెలవరు అన్నరు. కేసీఆర్‌ను అఖండ మెజార్టీతో ప్రజలు గెలిపించిన్రు కదా. బాన్సువాడ నుంచి నేను ఆరుసార్లు గెలిచిన. మళ్లీ ఎన్నికల వరకు నాకు 75 ఏళ్లు వస్తయి. అప్పటికీ ఓపికుంటే.. పోటీ చేస్తే తప్పనిసరిగా గెలుస్త.

కొత్తగా రాజకీయాల్లోకి వచ్చేవారికి ఏం చెప్తారు?
మానవ జన్మ రావడమే గొప్ప. ఏదో పెద్ద పుణ్యం చేసుకుంటేనే మేం ఎమ్మెల్యేలం అయినం. అందరం భగవంతుడ్ని పూజిస్తాం కానీ ఆయన ప్రత్యక్షంగా కనపడడు. అందుకే శాసనసభ్యులను, సర్పంచులను, మంత్రులను, ఎంపీలను తన దూతలుగా ప్రజల వద్దకు పంపి.. కష్టాలు దూరం చేయమంటాడు. భగవంతుడి ఆదేశం ఏముంటది.. మంచి చేయాలనుడే కదా?. గెలిపించిన ప్రజలను గుండెల్లో పెట్టుకోవాలి. దానిని గుర్తించి అంచెలంచెలుగా పనిచేస్తూ పోవాలి. స్వార్థం కోసం దుర్మార్గపు పనులు చేయొద్దు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని దుర్వినియోగం చేసుకోవద్దు.

పంచాయతీల్లో ఏకగ్రీవాల జోరు

హైదరాబాద్, వెలుగు:
పంచాయతీ పోరులో మూడో విడతలోనూ ఏకగ్రీవాల జోరు కొనసాగింది. 600కుపైగా పంచాయతీలు ఏకగ్రీవమైనట్టు తెలుస్తోంది. ఇందులో టీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులే ఎక్కువ పంచాయతీల్లో పాగా వేశారు. రెండో విడతలో 788 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మూడో విడతలో 4,116 గ్రామ పంచాయతీల్లో నామినేషన్ల ఉపసంహరణ గడువు మంగళవారం సాయంత్రంతో ముగియడంతో 30న పోలింగ్ జరగనుంది. బుధవారం సాయంత్రం రెండో విడత ప్రచారానికి కూడా తెర పడింది. రెండో విడతలో 3,342 పంచాయతీలకు ఈ నెల 25న (శుక్రవారం) ఉదయం 7 నుంచి ఒంటి గంట వరకు పోలింగ్ జరుగనుంది. రెండో విడత ఎన్నికల్లో 4,135 పంచాయతీలకు షెడ్యూల్ విడుదల కాగా 5 పంచాయతీలకు వివిధ కారణాల వల్ల ఎన్నికలు జరగడంలేదు. 788 పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. దాంతో మిగతా 3,342 పంచాయతీల్లో సర్పంచ్ పదవి కోసం 10,668 అభ్యర్థులు బరిలో ఉన్నారు. అలాగే వీటిలో 36,602 వార్డులు ఉండగా 94 వార్డులకు ఎన్నికలు జరగడం లేదు. 10,317 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మిగతా 26,191 వార్డులకుగాను 63,480 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

- రెండు, మూడో విడతలో కలిపి 1,388 పైనే..
- ముగిసిన రెండో విడత ప్రచారం
- 3,342 పంచాయతీల్లో 25న పోలింగ్
- 30న మూడో విడత ఎన్నికలు

రూ.1.9 కోట్ల నగదు సీజ్
పంచాయతీ ఎన్నికల సందర్భంగా కోటి 9 లక్షల 99 వేల రూపాయలను ఎన్నికల యంత్రాంగం సీజ్ చేసింది. రూ.3.84 లక్షల విలువైన మద్యం పట్టుకున్నారు. 288 మందిపై కేసులు నమోదు అయ్యాయి.

టీచర్ ఎమ్మెల్సీకి సిట్టింగ్ లొల్లి!

- కరీంనగర్‌లో పీఆర్టీయూ అభ్యర్థిని తప్పించాలంటున్న టీఆర్ఎస్
- సిట్టింగ్‌లకే చాన్సివ్వాలనే యోచన
- పోటీకే సిద్ధమంటున్న పీఆర్టీయూ
- మార్చిలో 2 టీచర్ సెగ్మెంట్ల ఎన్నికలు

హైదరాబాద్, వెలుగు: త్వరలో జరగనున్న టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం టీఆర్ఎస్, పీఆర్టీయూ మధ్య లొల్లి మొదలైంది. అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపుగా సిట్టింగ్ ఎమ్మెల్యేలందరికీ టికెట్లు ఇచ్చి ఘన విజయం సాధించిన టీఆర్ఎస్.. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల విషయంలోనూ అదే తరహాలో వ్యవహరించాలని భావించింది. కానీ టీఆర్ఎస్‌కు సమాచారం లేకుండానే పీఆర్టీయూ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించింది. దీంతో కరీంనగర్ సెగ్మెంట్ పోటీ నుంచి తప్పుకోవాలని పీఆర్టీయూను టీఆర్ఎస్ కోరిందని.. కానీ పీఆర్టీయూ స్పందించడం లేదని సమాచారం.

రెండు సీట్లకు ఎన్నిక

'మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్' టీచర్ సెగ్మెంట్ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డితో పాటు 'వరంగల్, ఖమ్మం, నల్లగొండ' సెగ్మెంట్ ఎమ్మెల్సీ పూల రవీందర్ పదవీకాలం మార్చి నెలాఖరుతో ముగుస్తోంది. మార్చిలోనే ఈ రెండు సీట్లకు ఎన్నికలు జరుగనుండటంతో.. అధికార పార్టీ వాటిపై దృష్టి సారించింది. అయితే ప్రస్తుతం టీఆర్ఎస్‌కు అనధికార అనుబంధ సంఘంగా కొనసాగుతున్న పీఆర్టీయూ.. టీఆర్ఎస్‌కు చెప్పకుండానే రెండు టీచర్ సెగ్మెంట్లలో ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించింది. 'ఖమ్మం' సెగ్మెంట్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్సీ పూల రవీందర్‌ను, కరీంనగర్ సెగ్మెంట్‌లో రఘోత్తంరెడ్డిని పోటీలో నిలిపింది. కరీంనగర్ సిట్టింగ్ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి కాదని వేరే అభ్యర్థిని ప్రకటించడంపై టీఆర్ఎస్ నాయకత్వం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. టీచర్ ఎమ్మెల్సీలు ఇటీవల టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసినప్పుడు ఈ విషయం ప్రస్తావనకు వచ్చినట్టు సమాచారం. కరీంనగర్ సెగ్మెంట్ పోటీ నుంచి తప్పుకోవాలని పీఆర్టీయూ నేతలకు కేటీఆర్ సూచించారని.. దీనిపై సంఘం నేతలతో చర్చిస్తామని వారు చెప్పారని సమాచారం.

ప్రచారం ముమ్మరం

కరీంనగర్ టీచర్ సెగ్మెంట్‌కు పోటీ ఎక్కువైంది. ఇప్పటికే పలు ఉపాధ్యాయ సంఘాలు అభ్యర్థులను ప్రకటించాయి. పీఆర్టీయూ ప్రకటించిన అభ్యర్థి రఘోత్తంరెడ్డి స్కూళ్లలో తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ మద్దతుతో పీఆర్టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి (యూఎస్‌పీఎస్) అభ్యర్థిగా టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, ఎస్టీయూ అభ్యర్థిగా సుధాకర్‌రెడ్డి, ఇతర అభ్యర్థులు ఇప్పటికే ప్రచారాన్ని ముమ్మరం చేశారు. మరోవైపు ఈ సెగ్మెంట్‌లో పాతూరి సుధాకర్‌రెడ్డి పోటీలో ఉంటారని, ఆయనకు మద్దతిస్తున్నామని టీపీఆర్టీయూ ప్రకటించింది. సుధాకర్‌రెడ్డి కూడా పార్టీ పెద్దల అనుమతితో ప్రచారం చేస్తున్నారని, టీచర్స్ యూనియన్ల మద్దతు కూడకట్టే ప్రయత్నంలో ఉన్నారని సమాచారం. సుధాకర్‌రెడ్డిపై వ్యతిరేకత ఉందనే మరో అభ్యర్థిని నిలిపామని, మూడు నెలలుగా ప్రచారం చేస్తూ ఇప్పుడు విత్‌డ్రా కావాలంటే కష్టమని పీఆర్టీయూ ముఖ్యనేత ఒకరు పేర్కొన్నారు. అయితే టీఆర్ఎస్ పాతూరి సుధాకర్‌రెడ్డి పేరును త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తుందని, కరీంనగర్ నుంచి పీఆర్టీయూ వెనక్కి తగ్గకపోతే ఖమ్మం సెగ్మెంట్‌లో పోటీ తప్పదని ఓ ఉపాధ్యాయ సంఘం నేత చెప్పారు.



నేడు ఆకాశవాణి లైవ్‌లో సీఈవో రజత్‌కుమార్

హైదరాబాద్, వెలుగు: నేషనల్ ఓటర్స్ డే సందర్భంగా గురువారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు రాష్ట్ర ఎన్నికల అధికారి రజత్‌కుమార్ ఆల్ ఇండియా రేడియో ఆకాశవాణి చర్చాకార్యక్రమంలో పాల్గొంటారు. ఓటర్లను చైతన్యపరిచే కార్యక్రమాల్లో భాగంగా జరిగే ఈ లైవ్ ప్రొగ్రామ్‌లో పౌరులందరూ భాగస్వామ్యం కావాలని సీఈవో కోరారు. 040 23244834 , 04023244836 నంబర్లకు ఫోన్ చేసి తనతో నేరుగా మాట్లాడి ప్రజలు తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.

కన్నడ కాంగ్రెస్ ఎమ్మెల్యే గణేశ్ గాయబ్

గాలిస్తున్న మూడు పోలీసు బృందాలు

బెంగళూరు: ఈగల్టన్ రిసార్టులో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆనంద్ సింగ్ పై దాడి చేసిన ఘటనలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అదే పార్టీకి చెందిన మరో ఎమ్మెల్యే గణేశ్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ సంఘటనకు సంబంధించి గణేశ్ పై బిడది పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. గణేశ్ తో కాంటాక్ట్ చేయడానికి ప్రయత్నిస్తే ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉందని పోలీసులు చెప్పారు. నియోజకవర్గమైన కంప్లిలో కూడా ఆయన ఎక్కడా కనపడలేదన్నారు. దీంతో గణేశ్ ను గాలించడానికి మూడు పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ఆనంద్ సింగ్ పై దాడి కేసు నేపథ్యంలో గణేశ్ ను కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేశారు.

జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటుకు కేంద్రం ఓకే

న్యూఢిల్లీ : వస్తుసేవల పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్ (జీఎస్టీఏటీ) నేషనల్ బెంచ్ ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం చెప్పింది.అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు ఒక అధ్యక్షుడిని నియమిస్తారు. కేంద్రం నుంచి ఒక టెక్నికల్ మెంబర్ ను, రాష్ట్రం నుంచి మరో టెక్నికల్ మెంబర్ ను నేషనల్ బెంచ్ లోకి తీసుకుంటారు. న్యూఢిల్లీలో బెంచ్ ఏర్పాటు చేస్తామని కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ చెప్పారు. జీఎస్టీకి సంబంధించిన అన్ని వివాదాలను ఒకే వేదిక మీదకు తీసుకురావడానికి వీలుగా నేషనల్ బెంచ్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. దీని వల్ల దేశవ్యాప్తంగా జీఎస్టీ సేవలు సులభంగా ప్రజలకు అందుతాయన్నారు.

ఓయూలో సౌతిండియన్ హిస్టరీ కాంగ్రెస్



- వచ్చే నెల 8 నుంచి మూడు రోజుల పాటు సదస్సు
- 9 రాష్ట్రాల నుంచి అతిథులు
- ముమ్మరంగా సాగుతున్న ఏర్పాట్లు

హైదరాబాద్, వెలుగు: ఉస్మానియా వర్సిటీ ప్రతిష్టాత్మక సౌత్ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ (ఎస్‌హెచ్ఐసీ) 39వ వార్షికోత్సవాలకు వేదిక అవుతోంది. ఎస్‌హెచ్ఐసీ కార్యదర్శి, ఓయూ చరిత్ర విభాగాధిపతి కుతాడి అర్జున్‌రావు నేతృత్వంలో వచ్చే నెల ఎనిమిదో తేదీ నుంచి మూడు రోజుల పాటు ఈ సమావేశాలు జరగనున్నాయి. దక్షిణ భారత చరిత్రలోని విభిన్న కోణాలను వెలికి తీసి, ప్రాచుర్యంలోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో మధురైలోని కామరాజ్‌వర్సిటీ చరిత్ర విభాగం 1979లో ఎస్‌హెచ్ఐసీని ఏర్పాటు చేసింది. 1980 ఫిబ్రవరిలో అదే వర్సిటీలో తొలి సమావేశాలను నిర్వహించారు. తర్వాతి నుంచి ఏటా దక్షిణ భారతదేశంలోని వివిధ వర్సిటీల్లో సమావేశాలను నిర్వహిస్తూ వస్తున్నారు. గత (38వ) సమావేశాలు కేరళలోని కాలికట్ వర్సిటీలో జరిగాయి. ఓయూ చరిత్ర విభాగం వందేండ్లను పూర్తి చేసుకున్న సందర్భంగా 39వ సమావేశాలను ఇక్కడ నిర్వహించాలని నిర్ణయించారు. ఓయూలో 1986 జనవరిలో ఎస్‌హెచ్ఐసీ ఆరో సభలను నిర్వహించగా.. 32 ఏళ్ల తర్వాత తిరిగి అవకాశం వచ్చింది. ఈ సమావేశాలను కేంద్ర మంత్రి రామ్ దాస్‌అథవాలె ప్రారంభిస్తారు. మన రాష్ట్రంతోపాటు గోవా, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరి, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, ఒడిశాల్లోని వర్సిటీల చరిత్ర విభాగ అధిపతులు, అధ్యాపకులు, చరిత్ర పరిశోధకులు, స్కాలర్స్ 1,200 మంది వరకు హాజరుకానున్నారు.

చరిత్ర తెలుసుకోవాలె

రాష్ట్ర, దేశ, ప్రపంచ చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరముంది. ప్రతి అంశం చరిత్రతో ముడిపడే ఉంటుంది. ఎస్‌హెచ్ఐసీ సమావేశాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాం. చరిత్రకారులు, అధ్యాపకులు, స్కాలర్స్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-ఎస్.రామచంద్రం, ఉస్మానియా వర్సిటీ వీసీ

తెలంగాణ చరిత్రకు పెద్ద పీట

ఎస్‌హెచ్ఐసీ సమావేశాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. చరిత్ర పరిశోధకులు తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకుంటారు. చరిత్రను శాస్త్రీయంగా అధ్యయనం చేయడమెలాగో నేర్చుకునేందుకు వీలవుతుంది.

-కుతాడి అర్జున్‌రావు, ఓయూ చరిత్ర విభాగాధిపతి

బాల్యానికి బాసింగం

రాష్ట్రంలో ఆగని బాల్య వివాహాలు | 'చైల్డ్ లైన్ 1098'కు వస్తున్న ఫిర్యాదుల్లో ఇవే ఎక్కువ | మూడేళ్లలో 3,414 కంప్లైంట్స్ | మహబూబ్‌నగర్, వికారాబాద్ నుంచి అత్యధికం

నేడు గాళ్ చైల్డ్ డే



హైదరాబాద్, వెలుగు: "బాల్య వివాహాలు చేయకండి. ఆడపిల్లల మనసు అర్థం చేసుకోండి. రోజూ ఏడ్చుకుంటూ ఉండలేను. అందుకే వెళ్లిపోతున్నా. అందరూ నన్ను క్షమించండి. నా జీవితంలో చాలా కోల్పోయాను. నా పిల్లలను మాత్రం బాగా చదివించండి"... ఇది నాలుగు రోజుల క్రితం గీతాంజలి అనే మహిళ హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకునే ముందు రాసుకున్న సూసైడ్ నోట్. ఆమెకు పదహారేళ్ల వయసులోనే తల్లిదండ్రులు పెళ్లి చేయడంతో అర్ధాంతరంగా చదువు ఆగిపోయింది. తర్వాత ఎన్నో ఇబ్బందులు పడి డిగ్రీ పూర్తి చేసింది. ఖాకీ డ్రెస్ వేసుకుని ఎస్సై ఉద్యోగం చేయాలని కలలు కన్నది. కానీ అవేవీ నెలవేరకుండానే కానరాని లోకాలకు వెళ్లిపోయింది.

12 ఏళ్ల నుంచే

రాష్ట్రంలో గీతాంజలి మాదిరి అనేక మంది 'చిన్నారి పెళ్లి కూతుళ్లు' అయ్యారు. అవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం 'బేటీ బచావో.. బేటీ పడావో' అని నినదించినా.. రాష్ట్ర ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకం కింద పైసలిస్తున్నా కొందరు తల్లిదండ్రుల ధోరణిలో మాత్రం మార్పు రావడం లేదు. ఆడపిల్లలకు 12 నుంచి 16 ఏళ్ల మధ్యలోనే పెళ్లిళ్లు చేసేస్తున్నారు. గత మూడేళ్లలో బాలల రక్షణ కోసం ఏర్పాటు చేసిన చైల్డ్ లైన్ 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు బాల్య వివాహాలను ఆపాలని కోరుతూ 3,414 ఫోన్ కాల్స్ రావడమే ఇందుకు నిదర్శనం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12 చైల్డ్ లైన్ సెంటర్లకు 2015-16లో 878, 2016-17లో 1,321, 2017-18లో 1,215 ఫోన్ కాల్స్ వచ్చాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో 2018లో చైల్డ్ మ్యారేజెస్‌పై అత్యధికంగా 280 ఫిర్యాదులుగా రాగా, ఆ తర్వాత వికారాబాద్ జిల్లాలో 194, నల్లగొండ జిల్లా సెంటర్‌కు 175 ఫిర్యాదులు వచ్చాయి. గత ఏడాది కాలంలో బాల్య వివాహాలపై ఎలాంటి ఫిర్యాదులు రానిది ఒక్క సికింద్రాబాద్ చైల్డ్‌లైన్ సెంటర్‌కు మాత్రమే.

గుట్టుచప్పుడు కాకుండా..

ఫిర్యాదులు అందిన వెంటనే చైల్డ్ లైన్ అధికారులు.. స్థానిక ఐసీడీఎస్ సిబ్బంది, పోలీసులతో కలిసి వెళ్లి చాలా వివాహాలను ఆపగలుగుతున్నారు. అయితే కొన్ని పెళ్లిళ్లు మాత్రం గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతున్నాయి. చాలా వరకు పెళ్లిళ్లను పీటలపై ఆపివేసి, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నా.. కొద్ది రోజులకు మరో ముహూర్తంలో వివాహం చేస్తున్నారని బాలల హక్కులపై పనిచేస్తున్న ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి చెప్పారు. తమకు సమాచారం లేకపోవడంతో మళ్లీ వెళ్లి ఆపలేకపోతున్నామని చైల్డ్‌లైన్ ప్రతినిధి ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. జరిగిపోయిన పెళ్లిళ్లను రద్దు చేసే అవకాశం చట్టంలో లేకపోవడం వల్ల కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు.

బాల్య వివాహాలపై వచ్చిన ఫిర్యాదులు

సెంటర్	2015-16	2016-17	2017-18
ఆదిలాబాద్	51	38	18
హైదరాబాద్	77	34	40
కరీంనగర్	29	23	29
ఖమ్మం	142	135	152
మహబూబ్‌నగర్	151	311	280
మెదక్	116	92	67
నల్లగొండ	50	129	175
నిజామాబాద్	40	23	21
సికింద్రాబాద్	0	2	0
ఉప్పల్	19	65	88
వికారాబాద్	72	277	194
వరంగల్	131	192	151
మొత్తం	878	1,321	1,215

కారణాలివే..

- 54 శాతం బాల్య వివాహాలు ఏడు, ఎనిమిదో తరగతి వరకు చదివి మానేసిన బాలికలవే ఉంటున్నాయని ఎంవీఎఫ్ ఫౌండేషన్ చేసిన ఓ సర్వేలో వెల్లడైంది.
- ఏటా పెళ్లి ఖర్చులు, వరకట్నం పెరిగిపోవడం, తక్కువ కట్నం ఇచ్చినా చేసుకుంటామని ఏదైనా పెళ్లి సంబంధం వస్తే చేసేయడం.
- తల్లిదండ్రులు కూతురును భారంగా భావించడం
- టెన్త్ తర్వాత కాలేజీ చదువులకు అమ్మాయిలను దూరం పంపడం ఇష్టం లేని వారు, పై చదువులు చదివించే స్థోమత లేని తల్లిదండ్రులు పెళ్లి చేస్తే ఓ పనైపోతుందని భావిస్తున్నారు.
- లైంగిక దాడికి గురైన బాలికలను ఎవరూ పెళ్లి చేసుకోరనే ఉద్దేశంతో త్వరగా పెళ్లి చేసేయడం.
- బాలికల ప్రేమ వ్యవహారాలు, ఇంట్లో నుంచి వెళ్లిపోవడం వంటి ఘటనలు కూడా చిన్న పిల్లల పెళ్లికి కారణమవుతున్నాయి.



గింజలు పోసుకోని కంకిని చూపిస్తున్న రైతు

ఒక్క కంకి కూడ రాలె

రైతులను ముంచిన 904 రకం మొక్కజొన్న విత్తనం

- ఖమ్మం జిల్లాలో సరఫరా చేసిన నూజివీడ్ సీడ్స్ కంపెనీ
- దిగుబడి ఎక్కువ వస్తుందంటూ నమ్మబలికిన ప్రతినిధులు
- కంకులు కాయకుండా ఏపుగా పెరిగిన పంట
- లబోదిబోమంటున్న రైతన్నలు

ఖమ్మం టౌన్, వెలుగు: రైతన్న మరోసారి దగాపడ్డడు. దిగుబడి ఎక్కువ వస్తదన్న కంపెనీ మాయమాటలు నమ్మి మోసపోయిండు. 904 రకం మొక్కజొన్న సాగు చేసి నిండా మునిగిండు. పంట ఏపుగా పెరిగినా, కంకి కాయలేదు. ఒకటీ అర కాసినా లోన గింజలేదు. దీంతో రైతులు లబోదిబోమంటున్నరు. పెట్టుబడి ఖర్చంతా బూడిదలో పోసిన పన్నీరైందంటూ ఆవేదన చెందుతున్నారు. విత్తనం సరఫరా చేసిన కంపెనీ మాత్రం కనీసం పట్టించుకుంటలేదు.

దిగుబడి వస్తుందని..

నూజివీడ్ సీడ్స్ కంపెనీ సరఫరా చేసిన 904 రకం విత్తనాన్ని ఖమ్మం అర్బన్ మండలం రామన్నపేట, రఘునాథపాలెం మండలంలో మొత్తం50 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. తమ కంపెనీ విత్తనాలు వాడితే ఎకరానికి 35 క్వింటాళ్ల మొక్కజొన్న దిగుబడి వస్తుందని కంపెనీ ప్రతినిధులు నమ్మించారు. పెట్టుబడి పెట్టి, వచ్చిన దిగుబడిని కూడా తామే క్వింటాలుకు రూ.2 వేలు చొప్పున ఇచ్చి కొనుగోలు చేస్తామని చెప్పడంతో రైతులు విత్తనాలను తీసుకుని సాగు చేశారు. పంట ఏపుగా పెరిగినా, కంకి మాత్రం చాలా చిన్న సైజులో కాసింది. అవి కూడా అక్కడక్కడ ఒకటి, అర కనిపిస్తుండటంతో రైతులకు అనుమానం వచ్చింది. దీనిపై కంపెనీ ప్రతినిధులకు సమాచారం ఇస్తే వారి నుంచి ఎలాంటి స్పందన రాలేదని వాపోతున్నారు. పంట కొనుగోలు చేస్తామని చెప్పి, విత్తనాలు వేసిన తర్వాత కనీసం తమ వైపు తిరిగి చూడలేదని ఆందోళన చెందుతున్నారు. గతంలో సాగు చేసిన మొక్కజొన్న ఎకరానికి 30 క్వింటాలు దిగుబడి వచ్చిందని, ఇప్పుడు 5 క్వింటాలు కూడా వస్తుందన్న నమ్మకం లేదని చెబుతున్నారు.

ఎకరాకు రూ.40 వేలు

మొక్కజొన్న చేసిన వారిలో అధికంగా కౌలు రైతులు ఉన్నారు. ఇప్పటికే ఎకరానికి పురుగు మందులు, ఎరువులకు రూ.40 వేలు పెట్టుబడి పెట్టామని చెబుతున్నారు. రెక్కల పురుగు వచ్చిందని 11 సార్లు పురుగు మందు కొట్టామని అంటున్నారు. కంపెనీ ప్రతినిధులు గుంటూరులో ఓ పురుగు మందు ఉందని చెప్పడంతో అక్కడకు వెళ్లి మరీ తెచ్చి మందులు వాడామని చెబుతున్నారు. అయినా దిగుబడి రాకపోగా, అప్పులే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అప్పు తీర్చుకుందాం అనుకున్న

నూజివీడ్ కంపెనీ వాళ్ల మాటలు నమ్మి ఒకటిన్నర ఎకరంలో 904 రకం విత్తనాలు వేసిన. గతంలో వేసిన విత్తనాలు కాదని ఇవి సాగు చేసిన. పంట బాగా పండుతుందని చెప్పిండ్రు. దిగుబడి వస్తే అప్పులు తీర్చుకోవచ్చని అనుకున్న. ఎకరానికి రూ.40 వేలు పెట్టుబడి అయింది. కానీ కంకులే రాలె.

-వెంకట్రావ్, రామన్నపేట, ఖమ్మం అర్బన్



నష్ట పరిహారమియ్యాలె

మాకు వద్దన్నా అంటగట్టిండ్రు. ఎకరానికి 35 క్వింటాళ్లు వస్తయి, మాది గ్యారంటీ అన్నరు. అసలు పంటలు పండుతాయో లేదో తెలుసుకునేకి ఈ విత్తనాలు ఇచ్చి ప్రయోగం చేసినట్లున్నరు. నూజీవీడ్ సీడ్స్ కంపెనీ వాళ్లు నష్ట పరిహారం ఇవ్వాలె. కంపెనీ ఆర్గనైజర్ శివరాంను కలిసినం. తాము కంపెనీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినమని, తమ చేతుల్లో ఏమీ లేదని చెప్పిండ్రు.

-కె.వెంకటేశ్వర్లు, రామన్నపేట

ఆహారశుద్ధి కేంద్రాలపై ప్రణాళికలివ్వండి

- నివేదికలను వారంలోగా సెర్ప్, స్త్రీనిధి శాఖకు ఇవ్వండి
- అధికారులతో వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి

హైదరాబాద్, వెలుగు: ఆహార శుద్ధి కేంద్రాల ఏర్పాటుపై వారంలోగా ప్రణాళికలు తయారు చేయాలంటూ అధికారులను వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి ఆదేశించారు. ఆ నివేదికలను సెర్ప్, స్త్రీనిధి శాఖలకు అందజేయాలని సూచించారు. వాటి ఏర్పాటుకు కావాల్సిన నిధులివ్వడానికి ఆ రెండు శాఖలు అంగీకరించాయన్నారు. బుధవారం ఆయన సచివాలయంలో అన్ని జిల్లాల డీఏవో, ఏడీఏ, ఎంఏవో, ఏఈవోలు సహా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతులంతా ఒకే పంట వేస్తే తక్కువ ధర వస్తుందని, శాస్త్రీయ పద్ధతుల్లో పంట మార్పిడికి సూచనలిస్తూ సరైన గిట్టుబాటు ధర వచ్చేలా పంట కాలనీల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రైతుల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలు, మండలాలు, జిల్లాల ప్రకారం క్లస్టర్లవారీగా పంట కాలనీలను రూపొందించి రైతుకు మంచి ధర వచ్చేలా చూడాలన్నారు. రైతుల భూములు సహా వారి పూర్తి వివరాలను వ్యవసాయ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులకు సూచించారు.

యానిమేషన్ కోర్సు ఇక మూడేండ్లే!

కాలపరిమితి తగ్గించే యోచనలో సర్కార్

హైదరాబాద్, వెలుగు: గేమింగ్ అండ్ యానిమేషన్ కోర్సు వచ్చే విద్యాసంవత్సరం నుంచి మూడేండ్ల కోర్సుగా మారనుంది. ప్రస్తుతం ఇది నాలుగేండ్ల కాలపరిమితితో కొనసాగుతోంది. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న యానిమేషన్ కోర్సు రాష్ట్రంలోని 14 కాలేజీల్లో ఉంది. ఈ కాలేజీలు జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్నాయి. అయితే నాలుగేండ్ల కాలపరిమితి కోర్సులన్నింటికీ ఏఐసీటీఈ అనుమతి తప్పనిసరి. మూడేండ్ల కోర్సుగా ఉంటే యూనివర్సిటీ, ఉన్నత విద్యామండలి అనుమతి సరిపోతుంది. దీంతో గేమింగ్ అండ్ యానిమేషన్ కోర్సును మూడేండ్ల కోర్సుగా మార్చాలని ప్రభుత్వాన్ని ఉన్నత విద్యామండలి కోరింది. దీనికి ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసిందని కౌన్సిల్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. త్వరలోనే అధికారిక ఉత్తర్వులు రానున్నాయి. వచ్చే ఏడాది నుంచి మరిన్ని కాలేజీల్లో యానిమేషన్ కోర్సును తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

కౌంట్‌డౌన్ షురూ

నేడు నింగిలోకి పీఎస్ఎల్వీ సీ 44



కొత్త ఏడాదిలో తొలి ప్రయోగానికి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సిద్ధమైంది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) లోని మొదటి లాంచ్‌ప్యాడ్ నుంచి గురువారం రాత్రి 11:37 గంటలకు పీఎస్ఎల్వీసీ 44ను ప్రయోగించబోతోంది. ఇందుకు సంబంధించి బుధవారం రాత్రి 7:37 గంటలకు కౌంట్‌డౌన్ మొదలైంది. 28 గంటలయ్యాక సీ 44 నింగిలోకి దూసుకెళ్తుంది. రాకెట్ ద్వారా డీఆర్‌డీవో తయారు చేసిన 700 కేజీల మైక్రోశాట్ -ఆర్‌తో పాటు స్పేస్ కిడ్స్ ఇండియా, తమిళనాడులోని పల్లపట్టి గ్రామానికి చెందిన స్టూడెంట్లు కలిసి రూపొందించిన కలామ్‌శాట్‌ను నింగిలోకి పంపనున్నారు. సాధారణంగా పీఎస్ఎల్వీలో 6 స్ట్రాపాన్ బూస్టర్లు వాడుతారు. కానీ ఈసారి 2 బూస్టర్లతోనే ప్రయోగం చేస్తున్నారు. అందుకే ఈ ప్రయోగానికి పీఎస్ఎల్వీ 'డీఎల్' అని పేరు పెట్టారు. అలాగే బరువు తగ్గించేందుకు తొలిసారి అల్యూమినియం ట్యాంక్‌ను నాలుగో దశలో వాడుతున్నారు. సాధారణంగా పీఎస్ఎల్వీ రాకెట్‌లో 4 దశలుంటాయి. ఒకటి, మూడు దశల్లో ఘన ఇంధనం.. రెండు, నాలుగో దశల్లో ద్రవ ఇంధనం వాడుతారు. అయితే పీఎస్ఎల్వీ సీ 44కు మరో ప్రత్యేకత ఉంది. రాకెట్ చివరి దశ మరో పని కూడా చేయబోతోంది. రెండు శాటిలైట్లను కక్షలోకి ప్రవేశపెట్టాక 4వ దశ వృత్తాకార కక్షలో తిరుగుతుంది. ఇతర అంతరిక్ష ప్రయోగాలకు వేదికగా ఉపయోగపడనుంది. కలామ్‌శాట్ ఈ నాలుగో దశను వేదిక వాడుకుని ప్రయోగాలు చేయబోతోంది.

కలామ్‌శాట్ ప్రత్యేకతలు

- ఇదో కమ్యూనికేషన్ శాటిలైట్. జీవితకాలం 2 నెలలు.
- 10 సెంటీమీటర్ల క్యూబ్. ఒకటిన్నర కేజీల బరువుంటుంది.
- ప్రపంచంలో 3డీ ప్రింటింగ్ టెక్నాలజీతో రూపొందించిన తేలికైన నానో శాటిలైట్.
- తయారీ ఖర్చు రూ.12 లక్షలు
- రాకెట్ నాలుగో స్టేజ్‌ను ఆర్బిటాల్ ప్లాట్‌ఫాంగా వాడుకుంటుంది.
- భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జ్ఞాపకార్థం శాటిలైట్‌కు పేరు పెట్టారు.

- రాత్రి 11.37 గంటలకు ప్రయోగం
- స్పేస్‌లోకి మైక్రోశాట్-ఆర్, కలామ్‌శాట్
- ఈసారి రెండు స్ట్రాపాన్ బూస్టర్లే



మైక్రోశాట్ ప్రత్యేకతలు

- ఇదో ఇమేజింగ్ శాటిలైట్
- బరువు 700 కిలోలు
- 274 కిలోమీటర్ల ఎత్తు నుంచి సేవలందిస్తుంది.

ఫిబ్రవరిలో జీశాట్ 31 ప్రయోగం

కమ్యూనికేషన్ శాటిలైట్ జీశాట్ 31ను యూరప్‌కు చెందిన ఏరియన్ స్పేస్ రాకెట్ ద్వారా ఫిబ్రవరిలో ప్రయోగించనున్నారు. మూడు టన్నుల బరువున్న ఈ శాటిలైట్ ఇన్‌శాట్ 4 సీఆర్ స్థానాన్ని భర్తీ చేయనుంది. తర్వాత జీశాట్ 30ని కూడా పంపనున్నారు. ఇన్‌శాట్ 4ఏ స్థానంలో ఇది పని చేయనుంది. 2018లో ఇస్రో 17 లాంచ్ వెహికిల్ మిషన్లను, 9 స్పేస్‌క్రాఫ్ట్ మిషన్లను పూర్తి చేసింది. జీఎస్ఎల్వీ ఎంకే3ని కూడా ప్రయోగించింది. అత్యంత బరువైన జీశాట్ 11ను కూడా 2018లోనే నింగిలోకి పంపింది.

త్వరలో విక్రమ్‌శాట్: స్పేస్ కిడ్స్

స్టూడెంట్లు తయారు చేసిన శాటిలైట్‌ను నింగిలోకి పంపడం సీ 44తో తీరబోతోందని స్పేస్ కిడ్స్ వ్యవస్థాపకురాలు కేసన్ అన్నారు. స్పేస్‌లో జీవశాస్త్ర పరిశోధనలు చేసేందుకు మరో శాటిలైట్‌ను కూడా తయారు చేస్తున్నామని చెప్పారు. విద్యార్థుల్లో కళలు, సైన్స్‌ను స్పేస్ కిడ్స్ ప్రోత్సహిస్తోంది. వారికి అంతర్జాతీయ స్థాయిలో వేదికను ఏర్పాటు చేస్తోంది.

ఎవరేమన్నారంటే..



"కొన్ని పార్టీల్లో చిత్రమైన పరిస్థితి కనిపిస్తుంది. అక్కడ కుటుంబమే పార్టీగా ఉంటుంది. బీజేపీ దీనికి పూర్తిగా భిన్నం. ఇక్కడ పార్టీయే కుటుంబం" **- ప్రధాని మోడీ**

"ప్రియాంక యాక్టివ్ పాలిటిక్స్ లోకి రావడంతో పార్టీకి కొత్త శక్తి వచ్చినట్టయింది. ఇది శుభ పరిణామం.యూపీ ప్రజలకు ఆమె అంటే చాలా ఇష్టం. తన ఆశయ సాధనలో ఆమె విజయం సాధించాలని కోరుకుంటున్నా".
-షీలా దీక్షిత్, ఢిల్లీ పీసీసీ ప్రెసిడెంట్

"ప్రియాంకకు కంగ్రాట్స్. ఆమె పాలిటిక్స్ లోకి వస్తారన్న ప్రచారం చాలా రోజుల నుంచి జరుగుతోంది. చివరకు ఆమె వచ్చారు. ఆమెకు మంచి జరగాలని కోరుకుంటున్నా"
-ప్రశాంత్ కిశోర్, జేడీ(యు) సీనియర్ నేత



"కీలక సమయంలో ప్రియాంక సరైన నిర్ణయం తీసుకున్నారు. ఆమెకు నా శుభాకాంక్షలు."
హెచ్ డీ కుమారస్వామి, కర్ణాటక ముఖ్యమంత్రి


"ప్రియాంకను ఏఐసీసీ జనరల్ సెక్రెటరీగా నియమిస్తూ రాహుల్ తీసుకున్న నిర్ణయం కాంగ్రెస్‌కు తప్పకుండా మేలు చేస్తుంది. రాహుల్‌కు మంచి సపోర్ట్ దొరికింది"
-సిద్ధరామయ్య, కర్ణాటక మాజీ సీఎం

"ప్రియాంక ఎంట్రీతో కాంగ్రెస్ మరింత పటిష్టం అవుతుంది. లోక్ సభ ఎన్నికల ముందు రాహుల్ మంచి నిర్ణయం తీసుకున్నారు"
అశోక్ గెహ్లాట్, రాజస్థాన్ ముఖ్యమంత్రి

"ప్రియాంకకు పార్టీ పదవి అప్పగించడాన్ని బీజేపీకి ఓ సవాల్‌గా మేం భావించడం లేదు. అదంతా కాంగ్రెస్ కుటుంబ వ్యవహారం."
-మహేంద్ర నాథ్ పాండే, యూపీ బీజేపీ చీఫ్

"ప్రియాంక ఎంతో చరిష్మా గల వ్యక్తి. అయితే లోక్ సభ ఎన్నికలకు ఆమె కాంగ్రెస్ కు తురుపు ముక్కగా పనికొస్తారా ? వేచి చూడాల్సిందే"
-మెహబూబా ముఫ్తీ, జమ్మూ కాశ్మీర్ మాజీ సీఎం

"క్రియాశీల రాజకీయాల్లోకి ప్రియాంక ఎప్పుడో రావాల్సింది. ఆమె నాయకత్వం పార్టీకి తప్పకుండా మంచి చేస్తుంది"
-ముల్లపల్లి రామచంద్రన్, కేరళ పీసీసీ చీఫ్



రాను రానంటూనే..

క్రియాశీల రాజకీయాల్లోకి ప్రియాంక

- ఏఐసీసీ జనరల్ సెక్రెటరీగా నియామకం
- ఉత్తరప్రదేశ్ తూర్పు ప్రాంత బాధ్యతల అప్పగింత
- పార్టీ కేడర్ లో ఫుల్ జోష్

న్యూఢిల్లీ : రాను రానంటూనే ప్రియాంక గాంధీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చేశారు. నాలుగైదు నెలల్లో లోక్ సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ప్రధాన కార్యదర్శిగా ఆమె నియమితులయ్యారు. ప్రస్తుతానికి ఉత్తర ప్రదేశ్ తూర్పు ప్రాంతంలో పార్టీ వ్యవహారాలను ఆమె పర్యవేక్షిస్తారు. ఫిబ్రవరి తొలివారంలో ఆమె బాధ్యతలు స్వీకరిస్తారు. అనారోగ్య కారణాల రీత్యా సోనియా గాంధీ క్రియాశీలక రాజకీయాలకు దూరమవుతున్న సమయంలో, రాహుల్‌కు అండగా నిలవడంకోసం ప్రియాంకను యాక్టివ్ పాలిటిక్స్ లోకి తీసుకొచ్చారు.

యూపీ పరిణామాలే కారణమా ?

రాజకీయాల్లోకి రావాలన్న ఒత్తిడి ప్రియాంకపై చాలా కాలం నుంచి ఉంది. అయితే ఆమె తెరవెనుక ఉండి తల్లికి, సోదరుడికి సలహాలు ఇవ్వడానికి, అమేథీ, రాయ్ బరేలీలో ఎన్నికల ప్రచార సభలకే పరిమితం అయ్యారు. యాక్టివ్ పాలిటిక్స్ కు దూరంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ తీసుకున్న అనేక విధానపరమైన నిర్ణయాల్లో ప్రియాంక పాత్ర ఉంది. కర్ణాటకలో బీజేపీకి అధికారం దక్కకుండా చేయడం దగ్గర్నుంచి మూడు హిందీ రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల ఎంపిక వరకు ఆమె మాటకే రాహుల్ విలువ ఇచ్చారు. ఆమె సలహా మేరకే నిర్ణయాలు తీసుకున్నారు. అయితే ఉత్తరప్రదేశ్ తాజా పరిణామాలతో ప్రియాంకను క్రియాశీల రాజకీయాల్లోకి రావాలని రాహుల్ పట్టుబట్టినట్లు సమాచారం. జాతీయ రాజకీయాల్లో కీలకంగా భావించే ఉత్తరప్రదేశ్ లో తాజాగా ప్రాంతీయ పార్టీలు సమాజ్ వాది పార్టీ (ఎస్పీ),బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) కూటమిగా ఏర్పడ్డాయి. జాతీయస్థాయిలో బీజేపీని సవాల్ చేస్తున్న కాంగ్రెస్ ను ఈ కూటమి దూరంగా పెట్టింది. ఈ పరిణామం కాంగ్రెస్ పార్టీకి మింగుడు పడలేదు. అంతేకాదు కాంగ్రెస్ వల్ల యూపీలో జరిగే మేలు ఏమీ లేదు అంటూ ఒక దశలో కొంతమంది కూటమి నాయకులు మాట్లాడటాన్ని కూడా ఆ పార్టీ సీరియస్ గా తీసుకుంది. ఈ పరిణామాలతో యూపీలో పార్టీని బలోపేతం చేయడానికి ప్రియాంక అవసరం ఉందని కాంగ్రెస్ చీఫ్ రాహుల్ నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రియాంక ను పార్టీ జనరల్ సెక్రెటరీ గా నియమించారు.

యూపీపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి

80 లోక్ సభ సీట్లున్న ఉత్తరప్రదేశ్‌పై కాంగ్రెస్ ఈసారి ప్రత్యేక దృష్టి పెట్టింది. 1980 వరకు పెట్టని కోటలా ఉన్న యూపీలో కాంగ్రెస్ ఆ తర్వాత తన ప్రభావాన్ని కోల్పోయింది. బలమైన ప్రాంతీయ పార్టీలు తెరమీదకు రావడంతో కాంగ్రెస్ రాజకీయంగా తెరమరుగైంది. 2014 లోక్ సభ ఎన్నికల్లో పార్టీ ఘోరంగా ఓడిపోయింది. 66 సీట్లకు పోటీ చేసి రెండు సీట్లు(అమేథీ, రాయ్ బరేలీ) మాత్రమే గెలుచుకుంది. యూపీలో ఎక్కువ సీట్లు గెలుచుకున్న వారే ఢిల్లీలో చక్రం తిప్పే అవకాశాలెక్కువ. దీంతో యూపీలో ఈసారి ఎలాగైనా మెజారిటీ సీట్లు గెలుచుకోవాలని కాంగ్రెస్ నిర్ణయించుకుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయంగా కీలకంగా భావించే తూర్పు ప్రాంత పార్టీ వ్యవహారాలు ప్రియాంక కు అప్పగించింది.

తూర్పు యూపీ కీలకం ఎందుకంటే ?

ఉత్తరప్రదేశ్ తూర్పు ప్రాంతం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంటుంది. బాగా వెనకబడ్డ ప్రాంతం. పూర్వాంచల్ యూపీగా పేరొందిన ఈ ప్రాంతం రాజకీయంగా చాలా కీలకమైంది. రాష్ట్ర పాలిటిక్స్ ను శాసించేది పూర్వాంచల్ యూపీయే అంటారు రాజకీయ విశ్లేషకులు. కుల రాజకీయాలకు మారుపేరుగా నిలిచే ఈ ప్రాంతంలో మొత్తం 28 లోక్ సభ నియోజకవర్గాలున్నాయి. యూపీ తూర్పు ప్రాంతానికి బీజేపీ తరఫున ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్టార్ క్యాంపెయినర్ గా ఉన్నారు. ఆదిత్యనాథ్ ను దీటుగా ఎదుర్కోవడానికి ప్రియాంకను కాంగ్రెస్ రంగంలోకి దించింది.



నాకు అండగా ఉంటుంది: రాహుల్

అమేథీ: ప్రియాంక చాలా సమర్థురాలని ఆమె అన్న, కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ కొనియాడారు. ఆమె తనతో కలిసి పనిచేస్తారన్నారు. 'నా సోదరి నాకు అండగా వస్తున్నందుకు ఆనందంగా ఉంది' అని ఆయన అన్నారు. బీజేపీ విభజన రాజకీయాలతో దెబ్బతిన్న ఉత్తరప్రదేశ్ కు ప్రియాంక దశ దిశ నిర్దేశిస్తారని తాను ఆశిస్తున్నట్లు ఆయన చెప్పారు. యూపీలో తమ ప్రధాన ప్రత్యర్థి బీజేపీయేనన్నారు. ఎస్పీ,బీఎస్పీ సాయంతో బీజేపీని ఓడించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు రాహుల్ చెప్పారు.

ప్రియాంక యాక్టివ్ పాలిటిక్స్ లోకి రావడంపై కాంగ్రెస్ కేడర్ లో ఫుల్ జోష్ నెలకొంది. కాంగ్రెస్ కు మంచి రోజులు వచ్చాయని కార్యకర్తలు పేర్కొన్నారు. నరేంద్ర మోడీని దీటుగా ఎదుర్కొనే లీడర్ వచ్చారన్న కామెంట్లు కూడా వినిపించాయి.

జ్యోతిరాదిత్య సింధియాకు యూపీ వెస్ట్ బాధ్యతలు

ఉత్తరప్రదేశ్ లోని పశ్చిమ ప్రాంత బాధ్యతలు మధ్యప్రదేశ్ డిప్యూటీ సీఎం జ్యోతిరాదిత్య సింధియాకు అప్పగించారు. లోక్ సభ ఎన్నికలకు సన్నద్ధం అవడంలో భాగంగా ఏఐసీసీలో రాహుల్ కొన్ని కీలక మార్పులు చేర్పులు చేశారు. సీనియర్ నేత గులాం నబీ ఆజాద్ ను యూపీ ఇన్‌చార్జ్ గా తప్పించి హర్యానా బాధ్యతలు అప్పజెప్పారు. కేసీ వేణుగోపాల్‌ను ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శిగా నియమించారు. అలాగే కర్ణాటక ఇన్ చార్జ్ గానూ వేణుగోపాల్ కొనసాగుతారు.

ప్రియాంక నేపథ్యం

- రాజీవ్, సోనియా దంపతులకు జనవరి 12, 1972 లో పుట్టారు.
- ఢిల్లీలోని జీసస్ అండ్ మేరీ కాలేజీలో సైకాలజీలో డిగ్రీ, బుద్ధిస్ట్ స్టడీస్‌లో ఎంఏ చదివారు.
- బిజినెస్‌మాన్ రాబర్ట్ వాద్రాతో 1997లో పెళ్లయింది.
- ఇద్దరు పిల్లలు. అబ్బాయిపేరు రైహాన్, అమ్మాయి పేరు మిరియా.
- బౌద్ధమతం స్వీకరించారు.
- విపాసన మెడిటేషన్ ప్రాక్టీస్ చేస్తారు.
- రాజీవ్‌గాంధీ ఫౌండేషన్‌కు ట్రస్టీగా ఉన్నారు.
- అన్న రాహుల్‌కు నమ్మకస్తురాలు, సలహాదారు.
- మొదటిసారి 1980లో తండ్రి రాజీవ్‌గాంధీ ఎన్నికల ప్రచారంలో అన్నతో కలిసి పాల్గొన్నారు.
- భర్త రాబర్ట్ వాద్రాకు హర్యానా, రాజస్థాన్‌లో లాండ్ స్కామ్‌లతో సంబంధాలున్నట్టు ఆరోపణ లున్నాయి.

రాహుల్ ఫెయిల్యూర్ వల్లే ఆమె ఎంట్రీ : బీజేపీ

ప్రియాంక యాక్టివ్ పాలిటిక్స్ లోకి రావడంపై బీజేపీ పెదవి విరిచింది. కాంగ్రెస్ పార్టీకి మంచి నాయకత్వం అందించడంలో రాహుల్ గాంధీ విఫలమయ్యారనీ అందువల్లే ప్రియాంకను తెర మీదకు తీసుకువచ్చారని బీజేపీ ప్రతినిధి సంబిత్ పాత్రా కామెంట్ చేశారు. మహా కూటమిలోనే రాహుల్ నాయకత్వాన్ని చాలా మంది నాయకులు వ్యతిరేకిస్తున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రియాంకను ఒప్పించి, ప్రత్యక్ష రాజకీయాల్లోకి తీసుకువచ్చారని సంబిత్ పాత్రా చెప్పారు.

కంగ్రాట్స్ ప్రియాంక

ఏఐసీసీ జనరల్ సెక్రెటరీగా నియమితులైన ప్రియాంకకు ఆమె భర్త రాబర్ట్ వాద్రా కంగ్రాట్స్ చెప్పారు. జీవితంలోని ప్రతి దశలోనూ తాను అండగా ఉంటానని ఫేస్ బుక్‌లో ఆయన పోస్ట్ చేశారు. **-రాబర్ట్ వాద్రా**

వరద బాధితుల్లా క్యూలో నిలబడ్డారు
ఏంచేస్తారు, జీతాల్లేవ్ మరి!



- అమెరికా షట్‌డౌన్‌కు నెల రోజులు
- నిత్యావసరాలకోసం ఫుడ్ బ్యాంక్స్ ముందు ఉద్యోగుల క్యూ

న్యూయార్క్: న్యూయార్క్ లోని బ్రూక్లిన్ పట్టణంలో ఉంటుంది బర్క్ లేస్ సెంటర్. ఎప్పుడూ కన్సర్టులు, స్పోర్ట్స్ ఈవెంట్లు జరుగుతూ ఉంటాయి. అయితే ప్రస్తుతం మాత్రం వలంటీర్లందరూ బిజీగా ఉన్నారక్కడ. విపత్తులు, వరదలు వచ్చినప్పుడు చేసే సహాయక చర్యల కోసమా? అన్నట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏదో లిస్టులు రెడీ చేస్తున్నారు. తర్వాత ఒక్కొక్కరి పేరు పిలుస్తున్నారు. లైన్‌లో ఉన్న వారందరూ తమ పేరు వచ్చిన వెంటనే ముందుకొచ్చి ప్లాస్టిక్ సంచిలో నిత్యావసరాలు తీసుకుని వెళ్తున్నారు. వీరందరూ ఏ వరద బాధితులో కాదు.. అమెరికా ప్రభుత్వ ఉద్యోగులు. ఇందులో కస్టమ్స్, ట్యాక్స్, ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ అధికారులు కూడా ఉన్నారు. డిసెంబర్ 22 నుంచి అమెరికాలో కొనసాగుతున్న షట్‌డౌన్ ఎఫెక్ట్ ఇది. జీతాలు రాక ఇబ్బందులు పడుతున్న వందలాది మంది ఇలా నిత్యావసర సరుకుల కోసం ఫుడ్ బ్యాంకుల ముందు క్యూ కడుతున్నారు. న్యూయార్క్ లో ఫుడ్ బ్యాంక్ ఏర్పాటు చేసిన ఫ్రాన్సిస్కో టేజన్.. కార్పొరేట్ స్పాన్సర్ల సాయంతో సరుకులు సరఫరా చేస్తున్నారు.

ముందుగానే రిజిస్టర్

తమకు నిత్యావసరాలు అవసరం ఉన్న వారు, వలంటీర్ల వద్ద ముందుగానే రిజిస్టర్ చేసుకోవాలి. తర్వాత ప్లాస్టిక్ బ్యాగులతో వచ్చి నిర్ణయించిన పరిమితి మేరకు ఆలు, చికెన్, ద్రాక్ష, సబ్బులు, షాంపులు తదితరాలు తీసుకెళ్లవచ్చు. రవాణా శాఖ ఉద్యోగులు, జైలు గార్డులు, ఇతర అత్యవసర విభాగాల ఉద్యోగులు మాత్రం ఇంకా విధుల్లో అలానే కొనసాగుతున్నారు. జీతాలు లేకుండానే పని చేస్తున్నారు.

"కొన్ని సరుకులు తీసుకెళ్తున్నా. అంతో ఇంతో డబ్బు మిగులుతుందని గంట సేపు ప్రయాణించి ఇంత దూరం వచ్చా. ప్రభుత్వం త్వరగా ఓ మంచి నిర్ణయం తీసుకోవాలని, షట్‌డౌన్ ఎత్తివేయాలని ప్రార్థిస్తున్నా. ఫిబ్రవరి 1నుంచి విధుల్లోకి వెళ్తానని ఆశిస్తున్నా"
- హోంల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్ మెంట్ ఉద్యోగి ఆంటోయ్‌నెట్టె పీక్ విలియమ్స్

"ఇల్లు గడవడం చాలా కష్టంగా ఉంది. సరుకులు అయిపోయాయి. కొన్ని తీసుకెళ్దామని లంచ్ బ్రేక్‌లో ఇలా ఫుడ్ బ్యాంక్‌కు వచ్చా. పిల్లల హైస్కూల్ చదువులు పూర్తయ్యాయి. పై చదువులకు ఫీజులు కట్టేందుకు పైసా లేదు. సెల్‌ఫోన్ బిల్లు కట్టేందుకూ డబ్బుల్లేవు. ఫిబ్రవరి తర్వాత ఉద్యోగానికి కూడా వెళ్లలేను. ఎందుకంటే కారులో ప్యూయల్ నింపేదుకు నా చేతిలో ఏం మిగల్లేదు"
-బ్రూక్లిన్‌లోని ఫెడరల్ డిటెన్షన్ ఏజెన్సీ ఉద్యోగి

'షట్‌డౌన్'పై ఈరోజు యూఎస్ సెనేట్‌లో ఓటింగ్

వాషింగ్టన్: నెలరోజులుగా అమెరికాలో కొనసాగుతున్న షట్‌డౌన్‌కు ముగింపు పలికేందుకు గురు వారం సెనేట్‌లో ఓటింగ్ జరగనుంది. రిపబ్లికన్లు, డెమొక్రాట్లు చెరొక అంశాన్ని ప్రతిపాదించారు. అయితే ఈ రెండు ప్రపోజల్స్ సెనేట్‌లో గట్టెక్కేలా కనిపించడం లేదని నిపుణులు చెబుతున్నారు. అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన యూఎస్-మెక్సికో బోర్డర్ వాల్‌కు నిధులు సమకూర్చాలని, ప్రభుత్వాన్ని పునరుద్ధరించాలని కోరుతూ సెనేట్ మెజారిటీ లీడర్ మిచ్ మెక్‌కానల్ ప్రతిపాదించిన అంశంపై ఓటింగ్ జరగనుంది. దీనికి వ్యతిరేకంగా సరిహద్దు గోడకు ఎలాంటి నిధులు విడుదల చేయకుండానే ప్రభుత్వాన్ని పునరుద్ధరించాలని కోరుతూ డెమొక్రాట్లు ఇంకో ప్రతిపాదన సెనేట్ ముందుంచారు. 100 మంది సభ్యులున్న సెనేట్‌లో ఒక్కో ప్రపోజల్ పాస్ అయ్యేందుకు 60 మంది సభ్యుల మద్దతు కావాలి. అయితే 60మంది అనుకూలంగా ఓటు వేసే పరిస్థితి లేకపోవడంతో ఈ రెండు ప్రతిపాదనలు వీగిపోయే అవకాశమే ఎక్కువ.

భారీ టెర్రర్ కుట్ర భగ్నం

- మహారాష్ట్రలో 9 మంది ఐసిస్అనుమానితుల అరెస్ట్
- నిందితుల్లో ఓ మైనర్ కూడా

ముంబై: ముంబై పోలీసులు టెర్రరిస్టుల భారీ కుట్రను తిప్పికొట్టారు. ఐసిస్‌తో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న తొమ్మిది మందిని అరెస్టు చేశారు. నిఘావర్గాల నుంచి సమాచారం రావటంతో కొద్దిరోజులుగా మహారాష్ట్ర యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్(ఏటీఎస్) ఈ ముఠాపై నిఘా పెట్టింది. పూర్తి సమాచారం సేకరించిన తర్వాత మంగళవారం నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు ఏటీఎస్ సోదాలు నిర్వహించింది. థానే జిల్లాలోని ముంబ్రా టౌన్‌షిప్, అమృత్ నగర్, కౌసా, మోతి బాగ్, అల్మాస్‌కాలనీల్లో, ఔరంగాబాద్‌లోని కైసర్‌కాలనీ, రాహత్‌కాలనీ, దమిడి మహల్‌ఏరియాల్లో ఏకకాలంలో సోదాలు జరిపి తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు ఏటీఎస్ వర్గాలు చెప్పాయి. 'ఐసిస్‌తో సంబంధమున్న వీరు పలుచోట్ల దాడులు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈమేరకు ఏటీఎస్ వారి కుట్రను భగ్నం చేసింది. మొత్తం తొమ్మిది మందిని అరెస్టు చేశాం' అని ఏటీఎస్ ఉన్నతాధికారి ఒకరు మీడియాతో చెప్పారు. ఈ సోదాల్లో కెమికల్స్, యాసిడ్ బాటిళ్లు, కత్తులు, మొబైల్ ఫోన్లు, హార్డ్ డిస్కులు, సిమ్ కార్డులు స్వాధీనం చేసుకున్నామని వారు వివరించారు. అరెస్టైన తొమ్మిది మందిలో ఓ మైనర్ కూడా ఉన్నాడు. థానే నుంచి ఐదుగురు అనుమానితులను, ఔరంగాబాద్ నుంచి నలుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితులపై ఐపీసీ సెక్షన్ 120 (బీ) సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.



బుధవారం ఢిల్లీలో మ్యూజియంను ప్రారంభించి సిపాయిల తిరుగుబాటు దృశ్యాలను చూస్తున్న మోడీ

ఎర్రకోటలో బోస్ మ్యూజియం

ప్రారంభించిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ: స్వాతంత్ర సమర యోధుడు సుభాష్‌చంద్ర బోస్ 122వ జయంతిని పురస్కరించుకొని ఢిల్లీలోని ఎర్రకోటలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌మ్యూజియంను ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం ప్రారంభించారు. దీంతో పాటు యాద్ - ఈ జలియన్‌మ్యూజియం, మొదటి ప్రపంచ యుద్ధానికి సంబంధించిన మ్యూజియం, దృశ్యకళ మ్యూజియంలను కూడా ప్రారంభించారు. అంతకు ముందు నేతాజీకి ట్విటర్ ద్వారా మోడీ నివాళులర్పించారు. బోస్ ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేస్తామన్నారు. "ఇండియా చరిత్ర, కల్చర్‌కు సంబంధించిన మ్యూజియంలను ప్రారంభించినందుకు గర్వపడుతున్నాను. స్వాతంత్ర సమరయోధుల ధైర్యానికి నివాళిగా 'క్రాంతి మందిర్' (టెంపుల్ ఆఫ్ రివల్యూషన్)ను ప్రారంభించాను. ఆర్ట్ లవర్స్ కచ్చితంగా చూడాల్సిన ప్రదేశం" అని మోడీ ట్వీట్ చేశారు. బోస్, ఇండియన్ నేషనల్ ఆర్మీ మ్యూజియంలో బోస్ వాడిన వస్తువులు, ఐఎన్‌ఏకు చెందిన మెడల్స్, బ్యాడ్జిలు తదితర వస్తువులను ఉంచారు. బోస్, ఐఎన్ఏపై చేసిన ప్రత్యేక డాక్యుమెంటరీని ప్రదర్శిస్తున్నారు. 1919 ఏప్రిల్ 13న జరిగిన జలియన్ వాలా బాగ్ ఘటన, మొదటి ప్రపంచ యుద్ధంలో మన సైనికుల త్యాగాలను తెలియజేస్తూ యాద్ - ఈ జలియన్ మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. ఇండియన్ ఆర్ట్ గొప్పతనాన్ని వివరిస్తూ దృశ్యకళ అనే ఎగ్జిబిషన్‌ను కూడా ఏర్పాటు చేశారు. వీటన్నింటిని కలిపి క్రాంతి మందిర్ అని పిలుస్తున్నారు.

పార్టీ విరాళాల్లో మెజారిటీ గుప్తదానాలే

జాతీయ పార్టీల ఆదాయాలపై ఏడీఆర్

న్యూఢిల్లీ: దేశంలోని పలు జాతీయ పార్టీలకు వచ్చే ఫండ్స్‌మొత్తంలో సగాని(50%)కి పైగా అనామకుల నుంచేనని అసోసియేషన్‌ఫర్‌డెమొక్రటిక్‌రిఫామ్స్(ఏడీఆర్) వెల్లడించింది. 2017-18 కి గాను పార్టీల ఆదాయం 1293.05 కోట్లు ఉండగా దాంట్లో 689.44కోట్లు అంటే దాదాపు 53 శాతం ఆదాయం ఇలా అందుకున్నదేనని చెప్పింది. 31శాతం ఎలక్టోరల్‌బాండ్స్‌నుంచి పార్టీ ఖజానాలో చేరుతోందని తెలిపింది. బీజేపీకి వచ్చే మొత్తం ఆదాయంలో దాదాపు 80 శాతం (553.38 కోట్లు) గుప్త దానాలేనట. బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ, బీఎస్పీ, ఎన్సీపీ, టీఎంసీ పార్టీలు ఎలక్షన్‌కమిషన్‌కు సమర్పించే డొనేషన్స్‌రిపోర్టులను పరిశీలించగా ఈ వివరాలు బయటపడ్డాయని ఏడీఆర్‌పేర్కొంది.

చైనా ఖండాంతర మిస్సైల్ సక్సెస్

బీజింగ్: ఖండాంతర లక్ష్యాలను ఛేదించే ఇంటర్‌కాంటినెంటల్‌బాలిస్టిక్‌మిస్సైల్ (ఐసీబీఎం)ను చైనా స్టిములేట్ చేసింది. ఊహాజనిత టార్గెట్ ను ఛేదించింది. ఈ విషయాన్ని చైనా సెంట్రల్‌టీవీ (సీసీటీవీ) బయటపెట్టింది. అండర్‌గ్రౌండ్‌బంకర్‌నుంచి ఈ మిస్సైల్ ను ప్రయోగించవచ్చని తెలిపింది. దీనికి సంబంధించిన ఇతర వివరాలను మాత్రం సీసీటీవీ వెల్లడించలేదు. చైనా దగ్గర 12 వేల కి.మి.ల దూరంలోని టార్గెట్‌ను గురిచూసి కొట్టగల మిస్సైల్స్‌ఉన్నాయని, వీటితో చైనా తన భూభాగం నుంచే అమెరికాలోని టార్గెట్‌ను కూడా ఛేదించగలదని గ్లోబల్‌టైమ్స్‌పేర్కొంది.



అమెరికాలో డ్రోన్ల కలకలం


న్యూయార్క్: నెవార్క్ ఏయిర్‌పోర్టులో ఓ చిన్నపాటి డ్రోన్ ఏకంగా విమానాల ట్రాఫిక్‌కే ఆటంకం కలిగించింది. న్యూయార్క్‌లోని నెవార్క్ ఎయిర్‌పోర్టుకు దగ్గర్లోనే ఓ డ్రోన్ కనిపించడంతో విమానాల రాకపోకలను ఏవియేషన్ అధికారులు నిలిపివేశారు. "మంగళవారం సాయంత్రం 5గంటలకు నెవార్క్ ఎయిర్‌పోర్టుకు వద్ద 3500ఫీట్ల ఎత్తులో డ్రోన్ ఎగురుతోందని మెస్సేజ్ వచ్చింది. న్యూజెర్సీలోని మరో ఎయిర్‌పోర్టు వద్ద కూడా డ్రోన్ కనిపించినట్లు తెలియడంతో విమానాల రాకపోకలు కొద్ది సేపు నిలిపివేశాం" అని ఏవియేషన్ డిపార్ట్ మెంట్ అధికారులు తెలిపారు.



షరీఫ్ కు గుండె పోటు ముప్పు

పీఐసీ డాక్టర్ల హెచ్చరిక

లాహోర్: పాకిస్థాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌కు గుండె పోటు ముప్పు ఉందని పంజాబ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్‌కార్డియాలజీ(పీఐసీ) డాక్టర్లు హెచ్చరించారు. ఆయనకు వైద్య సహాయం అవసరమని చెప్పారు. లాహోర్‌జైలులో శిక్ష అనుభవిస్తున్న నవాజ్ షరీఫ్ ను జైలు అధికారులు మంగళవారం పీఐసీలో చేర్చారు. గుండెల్లో నొప్పిగా ఉందని చెప్పడంతో షరీఫ్‌ను ఆస్పత్రికి తరలించామని అన్నారు. వైద్య పరీక్షల అనంతరం షరీఫ్‌ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని డాక్టర్లు ప్రకటించారు.



క్విక్ బైట్స్

ప్లాస్టిక్‌ను తరిమేద్దాం

సిద్దిపేట, వెలుగు: ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గిద్దామని, ఈ మార్పును సిద్దిపేట నుంచి ప్రారంభిద్దామని మాజీ మంత్రి టీ.హరీశ్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేటలో అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన వివేకానంద మహిళా సమాఖ్య సభ్యులకు జనపనార సంచులను పంపిణీ చేశారు. జీవన విధానంలో మార్పు రావడమే నిజమైన అభివృద్ధని అన్నారు. ప్రతి పది మందిలో ఆరుగురు క్యాన్సర్‌తోచనిపోతున్నారని. క్యాన్సర్‌కు ప్లాస్టిక్ వాడకం కూడా కారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొత్త ప్రభాకరరెడ్డి, మున్సిపల్ చైర్మన్ కె.రాజనర్సు, వైస్ చైర్మన్ అక్తర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట పట్టణంలో పలు అభివృద్ధి పనులను మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. 7వ వార్డులో 25 లక్షలతో నిర్మించిన ముదిరాజ్ సంఘ భవనాన్ని, 10 లక్షలతో నిర్మించిన మహిళా సంఘ భవనాన్ని ప్రారంభించారు. 45 లక్షలతో పలు వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు.


జనపనార బ్యాగులను పంపిణీ చేస్తున్న హరీశ్‌రావు



పెద్దగట్టు జాతరకు కోటి 70 లక్షలు విడుదల

సూర్యాపేట, వెలుగు : రాష్ట్రంలో రెండో అతిపెద్ద జాతరగా పేరుగాంచిన లింగమంతుల స్వామి పెద్ద గట్టు జాతర నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. జాతర కోసం అవసరమైన ఏర్పాట్లకు నిధులు కేటాయించాలని స్థానిక ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి కోరడంతో రూ. 1.7 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జాతర నిర్వహణ తేదీలను ఆలయ కమిటీ కూడా ఫైనల్ చేసింది. ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు జాతర నిర్వహించనున్నారు.



గాలిగోపురం నిర్మాణానికి శంకుస్థాపన

యాదాద్రి, వెలుగు: యాదాద్రి లక్ష్మీ నర్సింహ్మస్వామి దేవాలయ పునర్నిర్మాణ పనుల్లో భాగంగా బుధవారం కొండ కింద గాలిగోపురం నిర్మాణ పనులకు స్తపతి సుందర్‌రాజన్ శంకుస్థాపన చేశారు. కాలినడక వెళ్లే భక్తుల కోసం కొండ కింద వైకుంఠ ద్వారం వద్ద గాలిగోపురం నిర్మాణాన్ని చేపట్టారు. సీసీ పనులు ఇటీవలే ముగియడంతో గాలిగోపురం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

భక్తులకు ఇబ్బందులు కలగొద్దు

- మేడారం మినీ జాతర ఏర్పాట్లపై సమీక్ష
- ఫిబ్రవరి 20 నుంచి మూడురోజుల జాతర

జయశంకర్ భూపాలపల్లి, వెలుగు : భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మేడారం మినీ జాతర ఏర్పాట్లు చేయాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఫిబ్రవరి 20 నుంచి 23 వరకు జరిగే ఈ జాతర ఏర్పాట్లపై ఐటీడీఏ గెస్ట్‌హౌజ్‌లో బుధవారం ఆయన అధికారులతో సమీక్షించారు. మినీ జాతరకు భారీగా జనాలు వచ్చే అవకాశం ఉందని, అందుకు తగ్గట్టు ఏర్పాట్లు ఉండాలని కలెక్టర్ సూచించారు. వాహనాల పార్కింగ్, దర్శనం క్యూలైన్ల కోసం బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులు వంటలు చేసుకోవడంవల్ల మంటలొచ్చే అవకాశముందని, అడవికి ఎలాంటి నష్టం జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. జంపన్నవాగులో రద్దీకి తగ్గట్టు షవర్లు, బట్టలు మార్చుకోవడానికి గదులను ఏర్పాటు చేయాలన్నారు. గద్దెల దగ్గర ఎప్పటికప్పుడు బెల్లం తొలగించాలని, గద్దెల ప్రాంగణంలో లైట్లు పెట్టాలన్నారు. తాగునీరు అందుబాటులో ఉంచాలని, సానిటేషన్ దెబ్బ తినకుండా చూడాలన్నారు. వీలైనంతవరకు ప్లాస్టిక్ వాడకాన్ని ఆపేయాలన్నారు. మెడికల్ క్యాంపు పెట్టాలని, 108 అంబులెన్స్‌ను సిద్దంగా ఉంచాలని ఆదేశించారు. ములుగు ఆర్డీవో రమాదేవి జాతర ఇన్‌ఛార్జిగా ఉంటారని, ఐటీడీఏ పీవో చక్రధర్‌రావు, ఏటూరునాగారం ఏఎస్పీ శరత్‌చంద్ర, ములుగు డీఎస్పీ విజయ సారధి పర్యవేక్షణ చేస్తారని చెప్పారు.


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్లు

నేటి నుంచి జానపహాడ్ ఉర్సు

హుజూర్‌నగర్, వెలుగు: సూర్యాపేట జిల్లా పాలకీడు మండలంలో జానపహాడ్ దర్గా ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజులు కనుల పండుగగా నిర్వహించే ఉత్సవాల సందర్భంగా ఇప్పటికే దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మొదటిరోజు గుసూలియే షరీఫ్ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉదయం పూజారి జానీ మొయినుద్దీన్ నుంచి గంధం తీసుకువచ్చి సైదులు బాబా సమాధులపై చల్లి కొవ్వొత్తులు వెలిగిస్తారు.అనంతరం సైదులు బాబాను పెళ్లికొడుకుగా ముస్తాబు చేస్తారు. పూలదండలు వేసి కొత్త దుస్తులు సమాధులపై వేస్తారు. దీంతో ఉత్సవాలు మొదలవుతాయి. భక్తుల సౌకర్యార్థం కోదాడ డిపో నుంచి నేరేడుచర్ల మీదుగా 15, మిర్యాలగూడ నుంచి దామరచర్ల మీదుగా 15 బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. 400 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొననున్నట్లు డీఎస్పీ సుదర్శన్ రెడ్డి తెలిపారు.

దేశ రక్షణ రంగాన్ని ప్రైవేటీకరించొద్దు

సంగారెడ్డి, వెలుగు: దేశ రక్షణ రంగాన్ని ప్రైవేటీకరించొద్దంటూ సంగారెడ్డి జిల్లా ఎద్దుమైలారం ఆయుధ కర్మాగారం(ఓడీఎఫ్) ఉద్యోగులు బుధవారం నిరసనకు దిగారు. రక్షణ రంగాన్ని ప్రైవేటుపరం చేసే యోచనలో కేంద్ర ప్రభుత్వం ఉన్నదని విమర్శిస్తూ మూడు రోజులు వరుసగా సమ్మె చేపట్టారు. ఓడీఎఫ్ జేఏసీ ఆధ్వర్యంలో తొలిరోజు ధర్నా నిర్వహించారు. దేశ రక్షణ రంగంతో పాటు దేశంలోని 41 ఆయుధ కర్మాగారాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. రక్షణ రంగాన్ని ప్రైవేట్‌పరం చేస్తే కీలకమైన సమాచారం బయటికి పోయే ప్రమాదం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు.


బాసర ట్రిపుల్ ఐటీలో ఓ భవనం




కుళ్లిన టమాటాలు, గుడ్లు

ఇట్లుంటే.. ఎట్ల తినాలె

నాసిరకం కూరగాయలు, వంట సరుకుల వినియోగం ● ట్రిపుల్ ఐటీలో ఆకలి కేకలు

పాడైన టమాటాలు, కుళ్లిన కోడిగుడ్లు, మొలకెత్తిన ఉల్లిగడ్డలు, ఆలుగడ్డలు, పురుగులు పట్టిన రవ్వ... ఇలా అన్నీ నాసిరకమైన వాటినే వినియోగిస్తుండడంతో స్టూడెంట్స్ తినలేకపోతున్నారు. అర్ధాకలితో అలమటిస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న బాసర ట్రిపుల్ ఐటీలో పరిస్థితి ఇదీ.

బాసర, వెలుగు:

బాసర ట్రిపుల్ ఐటీలో స్టూడెంట్స్ అర్ధాకలితో అలమటిస్తున్నా రు. పేద కుటుంబాలకు చెందిన గ్రామీణ ప్రాంతాల స్టూడెంట్లు ఇందులో ఎక్కువగా చదు వుతుంటారు. వారికి కార్పొరేట్ స్థాయిలో ఉచి తంగా సాంకేతిక విద్య అందించడంతోపాటు అక్కడ ఉండేందుకు తగిన భోజన, వసతి సౌకర్యాలు కల్పించాలి. ట్రిపుల్ ఐటీలో మొత్తం ఆరు వేల మందికిపైగా స్టూడెంట్లు ఉండగా వారికోసం మూడు మెస్‌లను ఏర్పాటు చేశారు. వీటిలో నిబంధనల ప్రకారం నాణ్యమైన సరుకులను, తాజా కూరగాయలను ఉపయోగించాలి. అయితే మెస్ నిర్వాహకులు నాసిరకం సరుకులు, కూరగాయలు ఉపయోగిస్తూ స్టూడెంట్ల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు.

కానరాని మెస్ కమిటీలు

స్టూడెంట్లకు పోషకాలతో కూడిన భోజనం అందించాలని అధికారులు మెస్ నిర్వాహకులకు వారానికి సరిపడా ఆహార పదార్థాల వివరాలతో మెనూ అందజేస్తుంటారు. మెస్ నిర్వాహకులు పూర్తిస్థాయిలో వాటిని పాటించకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. గతంలో స్టూడెంట్స్ ఆందోళనలు చేసినప్పుడు యాజమాన్యం మెస్ కమిటీలను నియమించింది. వీరు ప్రతిరోజు ఆహార పదార్థాలను పర్యవేక్షించి రుచి చూసి రిపోర్టును ఉన్నతాధికారులకు నివేదించాలి. ప్రస్తుతం ఈ మెస్ కమిటీల జాడ లేదు. దీంతో నిర్వాహకులు వారికి తోచినట్టుగా చేస్తున్నారు. హాకా సంస్థ రెండు మెస్‌లను టెండరు ద్వారా దక్కించుకుంది. వీటిని విడివిడిగా నిర్వహించాల్సి ఉండగా ప్రస్తుతం ఒకే దగ్గర కొనసాగిస్తున్నారు. దీంతో స్టూడెంట్లకు సరైన ఆహారం అందడం లేదు. నిర్వహణ వ్యయం తగ్గుతుందని ఈ విధంగా వ్యవహరిస్తున్నారన్న వాదన వినిపిస్తోంది.

నాణ్యత కరువు

నిబంధనల ప్రకారం నాణ్యమైన సరకులు, తాజా కూరగాయలు ఉపయోగించాల్సి ఉండగా అన్నీ నాసివే వాడుతూ స్టూడెంట్ల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. మురిగిపోయిన కూరగాయలు, కుళ్లిపోయిన గుడ్లను వంటకాలకు వినియోగిస్తున్నా అడిగేవారే కరువయ్యారు. ప్రతి విద్యార్థిపై ప్రభుత్వం రోజుకు గరిష్ఠంగా 60 రూపాయలు వెచ్చిస్తున్నా నాణ్యమైన ఆహారం అందడం లేదు. మార్కెట్లో ఏది తక్కువ ధరకు లభిస్తే వాటితోనే కూరలు వండుతున్నారు. ప్రతి ఆదివారం ఒక్కో స్టూడెంట్‌కు 170 గ్రాముల చికెన్ కర్రీ వడ్డించాలి . ఇదీ సక్రమంగా ఇవ్వడం లేదని, నాసిరకమైన చికెన్ వండుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాసిరకమైన భోజనం వల్ల గతంలో స్టూడెంట్స్ ఎంతోమంది అస్వస్థతకు గురయ్యారు. అయినా ఇక్కడ పరిస్థితుల్లో మార్పు రావడం లేదు.





పేమెంట్ కట్ చేస్తాం

“గతంలో నాణ్యత లేని వస్తువులను వినియోగించారని తెలిసినప్పుడు వారి పేమెంట్ బిల్లులో కొంచెం కట్ చేసి ఇచ్చాం. నాసిరకం కూరగాయలు, వంట సామాను ఉపయోగించారని మా దృష్టికి వస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

- వెంకటస్వామి, బాసర ట్రిపుల్ ఐటీ ఏవో

చెప్పినట్లే మళ్లీ వచ్చారు



- ప్రాజెక్టులను పరిశీలించిన స్మితాసబర్వాల్

వెలుగు నెట్‌వర్క్: ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో ఇరిగేషన్ పనులను సీఎం కార్యాలయ కార్యదర్శి స్మితా సబర్వాల్ బుధవారం పరిశీలించారు.వారం కిందటే ఆమె ప్రాజెక్టులను సందర్శించి పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు ప్రోగ్రెస్‌ను తెలుసుకుంటున్న ఆమె హెలికాప్టర్‌లో పర్యటించారు. దేవాదుల ప్రాజెక్టు 3వ ప్యాకేజీలో దేవన్నపేట దగ్గర నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ సర్జ్ పూల్ పనులను పరిశీలించారు. పనులు 2020 జూన్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. తుపాకులగూడెం దగ్గర ప్రాజెక్టును పరిశీలించి వేగంగా పనులు చేయాలన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్టు పనులను పరిశీలించిన ఆమె సీఎం ప్రతిరోజూ సమీక్షిస్తున్నారని, అధికారులు చిత్తశుద్ధితో పనులు చేయాలన్నారు. ఇరిగేషన్ ఓఎస్‌డీ దేశ్‌పాండే తదితరులు ఆమె వెంట ఉన్నారు.

ఏ పార్టీలో ఉన్నా పథకాలు అందుతయ్


వేపలసింగారంలో మాట్లాడుతున్న ఉత్తమ్ కుమార్ రెడ్డి

హుజూర్‌నగర్, వెలుగు:ఏ పార్టీలో ఉన్నా సంక్షేమ పథకాల ఫలాలు అందుతాయని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రెండో విడత గ్రామ పంచాయతీ ప్రచార ఎన్నికల చివరి రోజు బుధవారం హుజూర్ నగర్, మఠంపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ బలపరచిన అభ్యర్థుల పక్షాన ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇతర పార్టీలో ఉన్న వారికి సంక్షేమ పథకాలు అందవనే చిల్లర మాటలకు భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటామని తెలిపారు. మఠంపల్లి మండలంలోని సిమెంట్ పరిశ్రమల్లో అర్హతగల స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించి పర్మినెంట్ చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్, టీడీపీ, సీపీఐఎం బలపర్చిన అభ్యర్థులను ప్రతి గ్రామంలో భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

నెట్‌లో చూసి గన్ తయారు చేసి..

వాళ్లంతా నకిలీ నక్సలైట్లు. పార్టీ పేరుతో డబ్బు సంపాదించాలని ప్లాన్‌వేశారు. ఇందుకు గన్‌లు అవసరమని అనుకున్నారు. ఇంటర్నెట్, యూట్యూబ్ చూసి గన్‌లు తయారు చేశారు. ఈ నెల 15 జనగామ జిల్లాలో వైన్స్ నిర్వాహకులను బెదిరించి, గన్‌తో గాలిలోకి కాల్పులు జరిపి రూ. 6 లక్షలకు పైగా దోచుకున్నారు. విచారణ ప్రారంభించిన పోలీసులు వారం రోజుల్లోనే ముఠా గుట్టు రట్టు చేశారు.

- వాటితో బెదిరించి దారి దోపిడీ
- నకిలీ నక్సలైట్ల ముఠా గుట్టు రట్టు
- ఆరుగురు నిందితుల అరెస్టు
- మూడు తపంచాలు, 10 తూటాలు స్వాధీనం

వరంగల్ అర్బన్, వెలుగు:

తుపాకీతో బె దిరించి మద్యం దుకాణం సిబ్బంది నుంచి డబ్బు దోచుకున్న ఆరుగురు సభ్యుల నకిలీ నక్సలైట్ల ముఠాను బుధవారం కొడకండ్ల పోలీసులు అరెస్టు చేశారు. ముఠా సభ్యుల నుంచి 3 తపంచాలు, 10 తూటాలు, రూ. 5,56,650 నగదు, 11 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ కమిషనరేట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వరంగల్ పోలీస్ కమిషనర్ డాక్టర్ వి. రవీందర్ వివరాలు తెలియజేశారు. జనగాం జిల్లా కొడకండ్ల మండలం, చెరువు ముందు తండాకు చెందిన ఇస్లావత్ శంకర్, నల్లగొండ జిల్లా పేరేపల్లికి చెందిన గంగాపురం స్వామి అలియాస్ మల్లేశ్‌తో ఇద్దరూ 2018 సంవత్సరంలో జనశక్తి పార్టీ అనుబంధ సంస్థ రైతు సంఘం కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. జనశక్తి పేరుతో డబ్బు సంపాదించాలని ఇటీవల ప్రణాళిక రూపొందించుకున్నారు. ఇందులో భాగంగా గంగాపురం స్వామి నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామానికి చెందిన నారబోయిన మల్లేశ్, జనగాం జిల్లా పాలకుర్తి మండలం చెన్నూరు గ్రామానికి చెందిన పిట్టల శ్రీనివాస్‌ను శంకర్‌కు పరిచయం చేశాడు. వీరంతా ముఠాగా ఏర్పడి స్వామి స్వగ్రామమైన పేరేపెల్లిలో సమావేశమయ్యారు. పార్టీ పేరుతో డబ్బు సంపాదించాలంటే ఆయుధాలు అవసరమని ఒక నిర్ణయానికి వచ్చారు.


తపంచాలను చూపెడుతున్న వరంగల్ సీపీ రవీందర్, ఇతర పోలీసు అధికారులు

సొంతంగా తుపాకుల తయారీ


పిట్టల శ్రీనివాస్ ఇంటర్‌నెట్, యూట్యూబ్‌లో చూసి నాటు తుపాకులు తయారు చేసే నైపుణ్యాన్ని సంపాదించాడు. నాటు తుపాకులు, తూటాలు తయారు చేశాడు. నాలుగు 12 బోర్ తూటాలను మరో నిందితుడు స్వామి సమకూర్చాడు. తర్వాత కొడకండ్ల మండలంలోని మద్యం షాపులను లక్ష్యంగా చేసుకున్నారు. ఈ నెల 15న సంక్రాంతి రోజు రామన్నగూడెం గ్రామ శివారు ప్రాంతంలో మొండ్రాయిపాలకుర్తి రోడ్డు మార్గంలో దోపిడీ చేసేందుకు గన్‌లతో సిద్ధమయ్యారు. తిరుమల వైన్స్ నిర్వాహకులు ముగ్గురు మద్యం వ్యాపారం ఆదాయం రూ. 6 లక్షల 70 వేలు తీసుకొని ద్విచక్రవాహనంపై వస్తుండగా రోడ్డుకు అడ్డంగా తాడు పెట్టి అడ్డుకున్నారు. తుపాకీతో గాలిలో కాల్పులు జరిపి వారిని బెదిరించారు. డబ్బుల డబ్బాను గుంజుకొని చెలుకలోకి పారిపోయారు.

ప్రత్యేక బృందాలతో దర్యాప్తు

కేసు విచారణకు పదికిపైగా ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు. నిందితుల్లో ముగ్గురు శంకర్, మల్లేశం, స్వామి కొడకండ్ల మండలం చెరువుముందు తండాలో ఉన్నట్లు పోలీసులకు అందిన సమాచారం మేరకు పాలకుర్తి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ బానోత్ రమేష్, కొడకండ్ల, పాలకుర్తి ఎస్సైలు రాజు, సతీష్ సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. వారిచ్చిన సమాచారం మేరకు మరో ముగ్గురు నిందితులు శ్రీనివాస్, పరమేశ్, విప్లవ్‌ను చెన్నూరు గ్రామంలో అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఆయుధాలు, దోపిడీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. అతితక్కువ సమయంలో కేసు పరిష్కరించిన వెస్ట్‌జోన్ డీసీపీ శ్రీనివాస్ రెడ్డి, వర్ధన్నపేట ఏసీపీ మధుసూదన్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ చక్రవర్తి, పాలకుర్తి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ బానోత్ రమేష్, కొడకండ్ల, పాలకుర్తి ఎస్సైలు రాజు, సతీష్‌తో పాటు ఇతర సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

సెట్ నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష

హైదరాబాద్, వెలుగు: మే నెలలో వివిధ కోర్సులకు జరగనున్న కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(సెట్)కు ఉన్నత విద్యామండలి ఏర్పాట్లు ప్రారంభించింది. గురువారం ఎంసెట్, ఐసెట్, లాసెట్, పీజీసెట్, ఈసెట్, ఎడ్‌సెట్, పీఈసెట్ కన్వీనర్లు, పరీక్షలు నిర్వహిస్తున్న నాలుగు వర్సిటీల వైస్‌చాన్స్‌లర్లతో సమీక్ష ఏర్పాటు చేసింది. గతేడాది నిర్వహించిన పరీక్షల్లో ఎదురైన సమస్యలను విశ్లేషించుకుని, అవి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది.



ఇక కాంగ్రెస్ పూర్తిస్థాయి ఫ్యామిలీ పార్టీ

హైదరాబాద్, వెలుగు: తల్లీ, కొడుకుతోపాటు బిడ్డ ప్రియాంకకు కూడా పార్టీ పదవి ఇవ్వడంతో కాంగ్రెస్‌పార్టీ ఇక పూర్తిస్థాయి ఫ్యామిలీ పార్టీగా మారిపోయిందని బీజేపీ ఎంపీ బండారు దత్తాత్రేయ ఎద్దేవా చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ స్వతంత్రంగానే పోటీ చేస్తుందన్నారు. ఫిబ్రవరి 1న హైదరాబాద్ లోక్‌సభ క్లస్టర్ సమావేశం నిర్వహించి ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను ఖరారు చేస్తామన్నారు. ఈవీఎంలపై ఆరోపణలు చేస్తున్న కాంగ్రెస్ ఇటీవల మూడు రాష్ట్రాల్లో ట్యాంపరింగ్ చేసే గెలిచిందా.. అని ప్రశ్నించారు. కేంద్రం ప్రకటించిన 10 శాతం రిజర్వేషన్లపై తెలంగాణ ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. గవర్నర్ ప్రసంగంలో రిజర్వేషన్ల పెంపు ప్రస్తావన లేకపోవడం బాధాకరమన్నారు. బీజేపీ నిర్ణయం వల్లే చంద్రబాబు కాపులకు ఐదు శాతం రిజర్వేషన్ ఇస్తానంటున్నారని చెప్పారు.

28న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్ష

హైదరాబాద్, వెలుగు: ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు జనవరి 28న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్ష నిర్వహిస్తామని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి అశోక్ కుమార్ చెప్పారు. ఈ నెల 31న ఉదయం 10గంటలకు ఫస్టియర్ విద్యార్థులకు పర్యావరణ విద్య పరీక్ష ఉంటుందన్నారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జనవరి 30న జరగాల్సిన ఈ పరీక్షను 31కి వాయిదా వేసిన విషయం తెలిసిందే. విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇచ్చేందుకు ఎలాంటి ఫీజులు వసూలు చేయవద్దని కాలేజీ యాజమాన్యాలకు ఆయన ఆదేశాలిచ్చారు. విద్యార్థులు హాల్‌టికెట్లను నేరుగా ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ bie.telangana.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

'కమర్షియల్' ఉద్యోగులకు ఆరోగ్య పథకం: సోమేశ్

హైదరాబాద్, వెలుగు: కమర్షియల్ ట్యాక్స్ విభాగం ఉద్యోగులకు బుధవారం నుంచి ప్రత్యేక ఆరోగ్య పథకం అమలు చేస్తున్నామని ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సోమేశ్‌కుమార్ తెలిపారు. బుధవారం వాణిజ్య పన్నుల శాఖ భవన్‌లో తెలంగాణ కమర్షియల్ ట్యాక్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ డైరీని కమిషనర్ అనిల్‌కుమార్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జీఎస్టీ వసూళ్లలో రాష్ట్రం ముందుందన్నారు. పన్నుల వసూళ్లు కూడా రోజురోజుకు పెరుగుతున్నాయని, ఈ ఆర్థిక సంవత్సరం లక్ష్యాలను గడువులోగా చేరుకుంటామని చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ ఏడాది ఎవరికీ ట్రాన్స్‌ఫర్లు ఉండవని సోమేశ్‌కుమార్ స్పష్టం చేశారు.

మైనార్టీ సంక్షేమ శాఖ పథకాలపై హోంమంత్రి సమీక్ష

హైదరాబాద్, వెలుగు: మైనార్టీల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలపై రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ సంక్షేమ శాఖల అధికారులతో సచివాలయంలో బుధవారం సమీక్షించారు. మైనార్టీ విద్యార్థులకు అందిస్తున్న ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్ మెంట్, విదేశీ విద్యారుణాలతో పాటు ఇతర పథకాల అమలు తీరుపై ఆరాతీశారు. సమావేశంలో మైనార్టీ, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి మహేష్ దత్ ఎక్కా, మైనార్టీ వెల్ఫేర్ డైరెక్టర్ షాహనవాజ్ ఖాసిం, జాయింట్ డైరెక్టర్ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి పాల్గొన్నారు.



స్కూళ్లల్లో తగ్గిన డ్రాపౌట్లు

హైదరాబాద్, వెలుగు:

- రాష్ట్రంలో ఈ సంఖ్య 3.5 శాతమే
- సత్ఫలితాలిస్తున్న సర్కారు చర్యలు
- రిపిటీషన్, రిటెన్షన్ రెండూ తగ్గాయి
- 23 జిల్లాల్లో రిపిటీషన్ రేట్ 'సున్నా'
- ఎస్ఎస్ఏ 2017-18 వార్షిక నివేదిక వెల్లడి

చదువుకునే వయస్సులో బడిమానేసే స్టూడెంట్ల సంఖ్య(డ్రాపౌట్స్) ఏటా తగ్గుతోంది. తెలంగాణ సర్కారు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. దీనికితోడు రిపిటీషన్(ఒకే తరగతిని రెండుసార్లు చదవడం) రేటు కూడా తగ్గింది. హైస్కూల్ వరకూ ఒకే జిల్లాలో చదివే వారి సంఖ్య(రిటెన్షన్) కాస్త తగ్గింది. హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో మాత్రం భారీగా పెరిగింది. 2017-18 విద్యాసంవత్సరానికి సంబంధించి సమగ్ర శిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) వార్షిక నివేదిక విడుదలచేసింది. ఈ రిపోర్టు ప్రకారం.. 2016-17లో ప్రైమరీ లెవల్‌లో డ్రాపౌట్ రేట్ 18.48 శాతంగా ఉంటే, 2017-18లో అది 3.53 శాతానికి తగ్గింది. అప్పర్ ప్రైమరీలో 2016 17లో 32.46 శాతం ఉంటే 201718లో 2.62 శాతం నమోదైంది. గతేడాది లెక్కల్లో కొన్ని తప్పులు దొర్లాయని ఎస్ఎస్ఏ అధికారులు చెబుతున్నారు. బాలికల కంటే బాలురే ఎక్కువగా బడిమానేస్తున్నారని చెప్పారు. ప్రైమరీ విద్యలో బాలుర డ్రాపౌట్ రేట్ 3.95 ఉండగా, బాలికల రేట్ 3.06గా ఉంది.

ప్రమోషన్ రేటు ఎక్కువే..

రాష్ట్రంలో విద్యార్థుల ప్రమోషన్ రేట్(పై తరగతులకు వెళ్లడం) ఎక్కువే ఉంది. ప్రైమరీ స్థాయిలో 96.4 శాతం ఉంటే, అప్పర్ ప్రైమరీలో 97.36 శాతం ఉంది. బాలురకంటే బాలికల ప్రమోషన్ రేట్ ఎక్కువగా నమోదైంది. ప్రైమరీ లెవల్‌లో రంగారెడ్డిలో 104.97 శాతం ఉండగా, మేడ్చల్‌లో 103.93 శాతం, హైదరాబాద్‌లో 98.82 శాతం ఉంది. యూపీఎస్ స్థాయిలోనూ ఈ మూడు జిల్లాల్లో వందశాతం దాటడం గమనార్హం.

తగ్గిన రిటెన్షన్ రేటు

నాణ్యమైన చదువుల కోసం తల్లిదండ్రులు తమ పిల్లలను జిల్లాలు మార్చేందుకూ సిద్ధపడుతున్నారు. 2017-18 విద్యాసంవత్సరంలో ప్రైమరీ (6-11 ఏండ్లు) వరకూ ఒకే జిల్లాలో 81.65 శాతం చదువుతుండగా, హైస్కూల్(11-14ఏండ్లు) స్థాయిలో అది 69.83 శాతానికి తగ్గిపోయింది. ప్రైమరీ స్థాయిలో రిటెన్షన్ రేటు 9 జిల్లాల్లో 70% లోపు ఉంటే, హైస్కూల్ స్థాయిలో అది 18 జిల్లాల్లో నమోదైంది. ఒకే తరగతి రెండేండ్ల పాటు చదవడం(రిపిటీషన్ రేట్) చాలా పాఠశాలల్లో తగ్గింది. 2017-18 విద్యాసంవత్సరం 23 జిల్లాల్లో అలా చదివే వారే లేకపోవడం గమనార్హం.

కమలంలో 'లష్కర్' హీట్!

హైదరాబాద్, వెలుగు:

- సికింద్రాబాద్ రేసులో ఆరేడుగురు సీనియర్లు
- మురళీధర్, కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, రాజాసింగ్, రాంచందర్‌రావు, చింతల ప్రయత్నాలు
- పార్టీ నేతల తీరుపై దత్తన్న గుస్సా

లోక్‌సభ ఎన్నికలు తరుముకొస్తున్న వేళ కమలం పార్టీలో రాజకీయ వేడి మొదలైంది. ఉన్న ఒకేఒక్క సిట్టింగ్ స్థానం సికింద్రాబాద్‌ను నిలబెట్టుకునేందుకు పార్టీ అధిష్ఠానం ప్లాన్లు గీస్తుంటే.. అక్కడి నుంచి పోటీకి పార్టీలోని సీనియర్లంతా సిద్ధమైపోతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో దెబ్బతిన్న నేతలు సైతం లష్కర్ బరిలోకి దిగుతామంటున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మోడీ ఛరిష్మా, అమిత్ షా వ్యూహం పనిచేస్తాయని, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకంటే ఇక్కడ పార్టీకి బలమైన క్యాడర్ ఉండడంతో ఈజీగా గట్టెక్కవచ్చని ఆశావహులు గట్టిగా నమ్ముతున్నారు. గత అసెంబ్లీలో బీజేపీకి ఐదుగురు ఎమ్మెల్యేలుంటే, అందులో ముగ్గురు సికింద్రాబాద్ లోక్‌సభ పరిధి వారే.

లిస్టు చాంతాడంత

పార్టీ సీనియర్ నేత బండారు దత్తాత్రేయ ఇక్కడ సిట్టింగ్ ఎంపీ. వయసు, ఆరోగ్యం రీత్యా ఈసారి అవకాశం దక్కదనే ప్రచారం జరుగుతోంది. దీంతో రాష్ట్ర నేతలంతా సికింద్రాబాద్‌పై ఫోకస్ చేశారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.కే.లక్ష్మణ్, బీజేఎల్పీ మాజీ నేత కిషన్ రెడ్డి, పార్టీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు, ఆ పార్టీ ఏకైక ఎమ్మెల్యే రాజాసింగ్, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డిలతోపాటు మరికొందరు ఇక్కడి నుంచి పోటీకి ఆసక్తి చూపుతున్నారు. కిషన్ రెడ్డి ఓ అడుగు ముందుకేసి పోటీకి గ్రౌండ్ సిద్ధం చేసుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన కిషన్ రెడ్డి నియోజకవర్గం అంబర్‌పేట.. సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలోకే వస్తుంది. 2014లో దత్తాత్రేయ అభ్యర్థన మేరకే తప్పుకున్నానని, ఈసారి బరిలో ఉండడం ఖాయమని ఆయన అనుచరుల వద్ద స్పష్టం చేస్తున్నారు.

అన్నిసార్లూ దత్తన్నే విజేత

ఇక్కడ బీజేపీ నాలుగుసార్లు గెలిచింది. అన్ని సార్లూ దత్తాత్రేయే విజేత. మూడుసార్లు కేంద్ర మంత్రిగా పని చేశారు. ఈసారి పోటీకి ఆయన ఆసక్తి చూపిస్తున్నా.. టికెట్ దక్కడం కష్టమంటున్నారు. 2017 సెప్టెంబర్‌లో మంత్రి పదవి కోల్పోవడంతోనే టికెట్ విషయంలో అనుమానాలు నెలకొన్నాయంటున్నారు. తిరిగి కేంద్రంలో బీజేపీ వస్తే దత్తన్న సీనియార్టీ, పదవీ త్యాగాన్ని దృష్టిలో పెట్టుకుని ఆ స్థాయిలో గౌరవించేందుకు ఆయన్ను ఏదో ఒక రాష్ట్రానికి గవర్నర్‌గా పంపే ఆలోచన హైకమాండ్ దృష్టిలో ఉందని ఆ పార్టీ సీనియర్ ఒకరు అభిప్రాయపడ్డారు.

దత్తన్న గుస్సా

తన అభిప్రాయంతో నిమిత్తం లేకుండా ఎవరికివారు పోటీకి తయారైపోతుండడంపై దత్తన్న గుస్సా అవుతున్నట్టు తెలుస్తోంది. సిట్టింగ్‌ను కాదని ఇతరులకు సీటెలా ఇస్తారని అనుచరుల వద్ద వాపోతున్నట్టు సమాచారం. ఒకవేళ తనకు టికెట్ ఇవ్వకుంటే తన కూతురు విజయలక్ష్మికి, లేదంటే వరుసకు కుమారుడయ్యే ప్రదీప్‌కు ఇవ్వాలని కోరుతున్నట్టు ఆయన అనుచరులు చెబుతున్నారు.

విధుల్లేక వీధిపాలు

హైదరాబాద్, వెలుగు:

- కష్టాల్లో జీవీకే సంస్థ తొలగించిన 108 సిబ్బంది
- తిరిగి తీసుకోవాలని 500 మంది కార్మికుల వినతి
- రోజూ వైద్యాధికారుల చుట్టూ ప్రదక్షిణలు

పదమూడేళ్ల పాటు 108 అంబులెన్స్‌లో సేవలందించిన 500 మంది కార్మికులు రోడ్డున పడ్డారు. 8 గంటల పని విధానాన్ని డిమాండ్ చేస్తూ గత ఏడాది ఆగస్టులో కార్మికులు సమ్మె చేసిన సంగతి తెలిసిందే. దీంతో సమ్మె చేసిన వారిని అంబులెన్సుల నిర్వహణను చూస్తున్న జీవీకే సంస్థ తొలగించింది. దీంతో వాళ్లంతా తమను తిరిగి పనుల్లోకి తీసుకోవాలని కోరుతూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. జీవీకే యాజమాన్యంతో చర్చించాలంటూ రోజూ పదుల సంఖ్యలో కార్మికులు కోఠిలోని వైద్యవిభాగాధిపతుల్ని కోరుతున్నారు. 2005 ఆగస్టు 15న నాటి ఉమ్మడి ఏపీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి 108 అంబులెన్సులను ప్రారంభించారు. అప్పట్లో వాటిని ఈఎంఆర్ఐ నిర్వహించేది.

ఆ తర్వాత 2011లో ఆ బాధ్యతలను జీవీకే తీసుకుంది. ఉద్యోగుల రాజ్యాంగ హక్కుల్ని జీవీకే కాలరాస్తోందంటూ ఇప్పటికే చాలా సార్లు కార్మికులు ఆందోళన బాట పట్టారు. గత ఏడాది అది మరింత ఉధృతమైంది. దీంతో 1300 మంది కార్మికుల్ని సంస్థ తొలగించింది. ఆ ఉద్యోగులంతా కోర్టుకెక్కారు. కోర్టు కూడా అందరినీ వెంటనే విధుల్లోకి తీసుకోవాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కానీ కొంత మందినే తీసుకున్న సంస్థ, మిగతా వారిని పక్కనపెట్టేసింది. 500 మంది ఉద్యోగులను ఇంతవరకు తిరిగి చేర్చుకోలేదు. "కోర్టు తీర్పు ఇచ్చినా చాలా మందిని సంస్థ తీసుకోలేదు. దీంతో వారంతా వేరే ఉద్యోగాలు చూసుకున్నారు. బతికే దారి లేక మా ఉద్యోగాలు మాకివ్వాలంటూ తిరుగుతున్నాం. అయినా ఇప్పటిదాకా సంస్థ పట్టించుకోలేదు. మేం అందుబాటులో ఉన్నా కొత్తవారిని తీసుకుంటోంది'' అని అరుణ్ అనే మాజీ ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేశాడు. "నాకు ఇద్దరు పిల్లలున్నారు. నా జీతంతోనే కుటుంబం గడవాలి. చట్టంలో ఉన్నదానినే అమలు చేయాలని అడిగాం తప్ప మేమే తప్పూ చేయలేదు.

ప్రభుత్వంతో సంబంధం లేకుండా అంబులెన్సులను నడపడం వల్ల మేం బాధితులం అవుతున్నాం'' అని రమేశ్ గౌడ్ అనే మరో మాజీ ఉద్యోగి చెప్పారు. వినతులు తీసుకుంటూ సంస్థతో చర్చలు జరుపుతామని అధికారులు చెబుతున్నా ఆ దిశగా మాత్రం అడుగులు పడడం లేదు. ఇక, ప్రస్తుతం 108 సిబ్బంది రెండు షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటలు.. రాత్రి 8 నుంచి ఉదయం 8 గంటల షిఫ్టుల్లో 12 గంటలు పనిచేస్తున్నారు. మిగతా 4 గంటల అదనపు పనికి ఎలాంటి ఓటీలూ ఇవ్వడం లేదని 'వెలుగు'తో 108 ఉద్యోగులు చెప్పారు. జీతాలూ నెలనెలా ఇవ్వడం లేదని, జీతాలు ఇవ్వనందుకు ప్రశ్నించినా, అదనపు పనిగంటలపై అడిగినా ఉద్యోగం నుంచి తీసేస్తున్నారని ఓ 108 డ్రైవర్ చెప్పారు. జీవీకే సంస్థ ఇటు సిబ్బందిని, అటు ప్రభుత్వాన్ని మోసం చేస్తోందని 108 ఉద్యోగ సంఘం నాయకుడు పల్లె అశోక్ ఆరోపించారు.

ఇద్దరు టీచర్ల సస్పెన్షన్

గద్వాల, వెలుగు : మొదటి విడత పంచాయతీ నామినేషన్ల విత్‌డ్రా సమయం ముగిసిన తర్వాత విత్‌డ్రా చేయడానికి సహకరించారని ఇద్దరు టీచర్లను సస్పెండ్ చేస్తు జిల్లా కలెక్టర్ శశాంక బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జోగులాంబ గద్వాల జిల్లా కేటీ దొడ్డి మండలంలోని పాతపాలెం గ్రామ పంచాయతీ ఎన్నికలకు రాములమ్మ అనే మహిళ నామినేషన్ వేసింది. ఈనెల 13వ తేదీన నామినేషన్ల విత్‌డ్రాకు సాయంత్రం 3 గంటల వరకు సమయం ఉండగా, రాములమ్మ నామినేషన్ విత్‌డ్రాను సమయం దాటాకా తీసుకున్నారని విమర్శలు వచ్చాయి. అందుకు సంబంధించిన ఫిర్యాదు మేరకు గద్వాల ఆర్డీవో రాములును విచారణ చేయాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. పాతపాలెం పంచాయతీ ఏకగ్రీవం రద్దు చేసి, ఎన్నికలకు ఆదేశించారు. నామినేషన్ విత్‌డ్రాకు సంబంధించిన స్టేజ్ 1 రిటర్నింగ్ అధికారులను సస్పెండ్ చేశారు.

పని చేసేటోళ్లను గెలిపించండి: డీకే అరుణ

గద్వాల, వెలుగు : గ్రామ పంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ మద్దతుతో బరిలో నిలిచిన అభ్యర్థులను గెలిపించాలని మాజీ మంత్రి డీకే అరుణ కోరారు. బుధవారం గద్వాల నియోజకవర్గం మల్దకల్ మండలంలోని పలు గ్రామాలలో పర్యటించిన ఆమె కాంగ్రెస్ మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థుల తరపున ప్రచారం చేశారు. మల్దకల్ లోని గాంధీచౌక్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజల శ్రేయస్సు కోసం, పల్లెల బాగుకోసం, పేదల ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఆశయాలతో ఉన్న అభ్యర్థులకు ప్రజలు ఓటు వేసి మద్దతుగా నిలవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గద్వాల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గడ్డం కృష్ణారెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు పటేల్ ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ఓటర్స్ డే'లో పాల్గొనం: మర్రి

హైదరాబాద్, వెలుగు:

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని బహిష్కరిస్తున్నట్లు పీసీసీ ఎన్నికల సమన్వయ కమిటీ చైర్మన్ మర్రి శశిధర్ రెడ్డి చెప్పారు. లక్షలాది ఓట్లు గల్లంతయ్యాయని రజత్‌కుమారే చెప్పారని, లోక్‌సభ ఎన్నికలనాటికి వాటిని జాబితాలో చేర్చే పరిస్థితి కన్పించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులతో ఆయన బుధవారం గాంధీభవన్‌లో సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవానికి రావాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి నుంచి ఆహ్వానం అందిందని, కానీ వెళ్లడం లేదన్నారు. ఓట్ల గల్లంతుతోపాటు ఎన్నికల సంఘం తీరుకు నిరసనగా 24న ఇందిరా పార్క్ వద్ద ధర్నా చేస్తున్నట్టు చెప్పారు. దీనికి పార్టీ నేతలు ఉత్తమ్, భట్టి, జానారెడ్డి, రేవంత్, డీకే అరుణ, సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి, టీటీడీపీ అధ్యక్షుడు రమణ, టీజేఎస్ కన్వీనర్ కోదండరాంలను ఆహ్వానించామన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లోనూ ఎన్నికలు బ్యాలెట్ పేపర్లతోనే జరుగుతున్నాయని, ఈవీఎంలపై నమ్మకం లేకనే వీవీ ప్యాట్‌లను తీసుకొచ్చారనే విషయాన్ని మర్చిపోవద్దన్నారు. మొదటిసారి ఈవీఎంలను ప్రవేశపెట్టిన జపాన్ కూడా ఇప్పుడు బ్యాలెట్ పేపర్స్‌తోనే ఎన్నికలు జరుపుతోందన్నారు. విమానాలు ట్యాంపరింగ్ ఐతే ఎడ్లబండిలో తిరుగుతారా.. అన్న రజత్ వ్యాఖ్యలపై మర్రి ఫైర్ అయ్యారు.

నేడు హర్యానాకు వ్యవసాయ శాఖ బృందం

సోనేపట్‌లోని నిఫ్ట్ సందర్శన

హైదరాబాద్, వెలుగు: ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో కొత్త పోకడల గురించి తెలుసుకోవడానికి వ్యవసాయ శాఖ అధికారుల బృందం గురువారం హర్యానా పర్యటనకు వెళ్లనుంది. సోనేపట్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్‌ఫుడ్ టెక్నాలజీని సందర్శించి ఆహార శుద్ధి రంగంలో మార్పులను పరిశీలిస్తారు. వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సి.పార్థసారథి నేతృత్వంలో ఎనిమిది మంది అధికారులు ఈ పర్యటనలో పాల్గొంటారు. రాష్ట్ర ప్రభుత్వం ఫుడ్‌ప్రాసెసింగ్‌రంగానికి ప్రాధాన్యత ఇస్తున్న క్రమంలో ఈ టూర్ చేపట్టిన ట్లు అధికారులు తెలిపారు. ఈ బృందంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రవీణ్‌రావు, పరిశోధన విభాగం డైరెక్టర్ భగవాన్, కాలుష్య కారకాల లేబరేటరీ సైంటిస్ట్‌అనిత, ఉద్యానవన శాఖ సంచాలకులు వెంకట్రామ్‌రెడ్డి, మార్కెటింగ్‌శాఖ సంచాలకులు లక్ష్మీబాయి, ఫుడ్‌ప్రాసెసింగ్ డైరెక్టర్ అఖిల్ ఉన్నారు.

జూన్‌లో అంతర్జాతీయ విత్తన సదస్సు

రాష్ట్రంలో వారం రోజుల పాటు జరిగే అంతర్జాతీయ విత్తన సదస్సుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఇంటర్నేషనల్ సీడ్ టెస్టింగ్ ఏజెన్సీ నేతృత్వంలో హైదరాబాద్‌లో జూన్ 26 నుంచి జూలై 3 వరకు జరుగనున్న 32వ అంతర్జాతీయ సదస్సుకు 800మందికి పైగా విదేశీ ప్రతినిధులతో పాటు రాష్ట్రం నుంచి వెయ్యిమంది రైతులు హాజరుకానున్నారు. బుధవారం రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి సదస్సు ఏర్పాట్లపై శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

పల్లె పల్లెకో నర్సరీ

వనపర్తి, వెలుగు:



బూడిదపాడులో ఏర్పాటు చేసిన నర్సరీ

- అటవీ శాఖ, ఉపాధి హామీ ద్వారా ఏర్పాటు
- హరిత వనాలు కానున్న గ్రామాలు

తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా వనపర్తి జిల్లాలోని 255 గ్రామపంచాయతీల్లో నర్సరీల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల నాలుగు కోట్ల మొక్కలను పెంచుతోంది. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు ఉపాధి అవకాశాలను పెంచేందుకు నర్సరీల పెంపకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అటవీశాఖ ఆధ్వర్యంలో నర్సరీల పెంపకానికి జిల్లా అధికారులు రైతులను ఎంపిక చేశారు. వీటి పెంపకానికి అనువైన భూమితోపాటు సాగునీటి సౌకర్యం ఉన్న రైతులకు నర్సరీల బాధ్యతలను అప్పగించారు. గతంలో జిల్లాలో ఎంపిక చేసిన ప్రాంతాలలోనే నర్సరీలను పెంచేవారు దీంతో రవాణా ఖర్చులతోపాటు మొక్కలను తరలించే సమయంలో అవి దెబ్బతినేవి. ఈ అనుభవాల దృష్ట్యా జిల్లా యంత్రాంగం గ్రామాలలో నర్సరీలను ప్రోత్సహిస్తోంది. జనవరి మొదటి వారంలోనే నర్సరీల ఏర్పాటుకు చర్యలు తీసుకోగా, ఇప్పుడు అందుకు సంబంధించిన పనులు చురుగ్గా సాగుతున్నాయి. జులై, ఆగస్టులో కురిసే వర్షాలకు పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు గ్రామాలలో మొక్కలు సిద్ధం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ భూములు బంజేరు భూములు, చెరువుకట్టపై మొక్కలు నాటడం ద్వారా హరిత తెలంగాణగా మార్చాలనే సంకల్పంతో అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఒక నర్సరీలో 30 వేల నుంచి 1.5 లక్షలవరకు మొక్కలు పెంచుతున్నారు. ఒక మొక్క పెంపకంపై ప్రభుత్వం రూ.12 ఖర్చు చేస్తోంది. నర్సరీల నిర్వాహకులు ప్రభుత్వం ఎంపిక చేసిన మొక్కలను మాత్రమే పెంచాల్సి ఉంటుంది. మొక్కల పెంపకంతోపాటు నర్సరీ నుంచి క్షేత్రస్థాయికి వెళ్లేంతవరకు దానికి సంబంధించిన అన్ని జాగ్రత్తలు నర్సరీ నిర్వాహకులు తీసుకోవాల్సి ఉంటుంది.

మహిళా సంఘాలకు బాధ్యతలు అప్పగింత

వనపర్తి జిల్లాలో మొక్కల పెంపకం బాధ్యతను మహిళా సంఘాలకు అప్పజెప్పారు. మహిళా సంఘాల సభ్యులు రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలతోపాటు వివిధ ప్రాంతాల్లో నాటిన వాటిని చనిపోకుండా జాగ్రత్తగా చూసుకుంటున్నారు. వాటికి అవసరమైన నీరు అందించడంతోపాటు జంతువుల నుంచి మొక్కలను కాపాడుతున్నారు. ఈ సంవత్సరం కూడా మహిళా సంఘాలను హరిత హారంలో భాగస్వాములను చేసేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. జిల్లాలోని వేలాది మంది మహిళా సంఘాలను ఈసారి హరితహారంలో భాగస్వాములను చేసేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశారు. తూతూ మంత్రంగా కాకుండా మొక్కల పెంపకాన్ని సీరియస్‌గా తీసుకునేందుకు కలెక్టర్ జిల్లా యంత్రాంగాన్ని సంసిద్ధం చేస్తున్నారు. జిల్లాలో ఎప్పటికప్పుడు నర్సరీల ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇప్పటి నుంచే నర్సరీల పెంపకంపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. గత ఏడాది నాటిన మొక్కలు ఎండిపోయిన సందర్భంలో పలువురు కిందిస్థాయి సిబ్బందిపై చర్యలు తీసుకున్నారు. ఎక్కడా నిర్లక్ష్యానికి తావులేకుండా కలెక్టర్ వ్యవహరిస్తుండటంతో హరితహారం కార్యక్రమం ఈ సారి మరింత విజయవంతంగా సాగుతుందని చెబుతున్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

హైదరాబాద్, వెలుగు: రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహిస్తున్న టీచర్లు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని పీఆర్‌టీయూ డిమాండ్ చేసింది. బుధవారం పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సరోత్తంరెడ్డి తదితరులు రాష్ట్ర ఎన్నికల అధికారి అశోక్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందించారు. పోలింగ్‌రోజు విధులు ముగిసిన తర్వాత ఉద్యోగులందరికీ రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. అన్ని జిల్లాల్లో టీఏ, డీఏలు ఒకే విధంగా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. సంగారెడ్డి, గద్వాల, రంగారెడ్డి, మరికొన్ని జిల్లాల్లో టీచర్లకు మూడు విడతల్లో ఎన్నికల డ్యూటీలు వేయడం సరికాదన్నారు. వంద కిలోమీటర్లు దాటి డ్యూటీ చేసి మరుసటి రోజు విధులకు హాజరయ్యేవారికి ఒకపూట ఓడీ ఇవ్వాలని పీఆర్‌టీయూ నేతలు కోరారు.

'భగీరథ' క్యాలెండర్ ఆవిష్కరణ

హైదరాబాద్, వెలుగు: మిషన్ భగీరథ డైరీ, క్యాలెండర్‌ను ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని భగీరథ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఇంజినీర్ల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. ప్రతి ఇంటికి మంచినీరు అందించేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్లు జగన్మోహన్‌రెడ్డి, విజయపాల్‌రెడ్డి, విజయ్ ప్రకాశ్, వినోభా దేవి, చక్రవర్తి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



'సింగిల్ హ్యాండ్' పవరెంత?

రానున్న లోక్సభ సంగ్రామంలో సింగిల్ హ్యాండ్ పోటీకి సయ్యంటోంది గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్. పొత్తుల విషయంలో ఎలాంటి త్యాగానికైనా వెనుకాడబోమన్నా, ప్రాక్టికల్గా కర్ణాటక సీఎం పీఠాన్ని జేడీఎస్కు ఇచ్చి చూపించినా ఆ స్నేహ 'హస్తాన్ని' మిగతా పార్టీలు స్వీకరించట్లేదు. ప్రతిపక్షాల ఐక్యత మోడీని వ్యతిరేకించడం వరకే గానీ రాహుల్ ప్రధాని అభ్యర్థిత్వాన్ని సమర్థించడంలో లేదు. ఒంటిచేతి ఈత కాంగ్రెస్ను విజయతీరానికి చేరుస్తుందా? సింగిల్ హ్యాండ్ పోటీ సాహసమా, వ్యూహమా?



ఢిల్లీ గద్దెనెక్కడానికి కీలకంగా భావించే ఉత్తరప్రదేశ్లో కాంగ్రెస్.. సరైన కమ్యూనికేషన్ స్ట్రాటజీ లేక మాయావతి–అఖిలేశ్ల మహాకూటమిలో చేరే అవకాశాన్ని వదులుకుంది. కూటమిలో చేరకున్నా పెద్ద ఫరక్ పడదని, ఇది రాహుల్కు మొదటి నుంచీ ఇష్టం లేదని కాంగ్రెస్ నేతలు గంభీర ప్రకటనలు చేస్తున్నారు. నిజమే, అనివార్య పరిస్థితుల్లో ఒంటరిపోరే ఉత్తమం కావచ్చు. ఈ దెబ్బతో యూపీలో కాంగ్రెస్ బలమేంటో తేలుతుంది.

అసలు ప్రాంతీయంగా పార్టీల మధ్య పొత్తులంటేనే విచిత్రంగా ఉంటాయి. శివసేన–బీజేపీ మైత్రిని చూడండి. సందు దొరికినప్పుడల్లా మోడీని తిట్టిపోసే ఉద్ధవ్ ఠాక్రే.. ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరణ దగ్గరికొచ్చేసరికి మెత్తబడిపోతారు. రాహుల్ అర్థం చేసుకుంటున్నది, చేసుకోవాల్సింది ఇలాంటి రాజకీయాలనే. యూపీలో ఏర్పడ్డ మహా కూటమి.. రెండు పార్టీల కలయిక వల్ల తలెత్తే వైరుధ్యాలు, డబుల్ స్టాండర్డ్స్ కలది. అదే సమయంలో అధికార పార్టీ.. తన విజయావకాశాలను దెబ్బతీసే ప్రయత్నాలను అడ్డుకుంటుంది. అధికార బలాన్ని ప్రయోగించడం ద్వారానో, కుతంత్రాలు చేసో కాబోయే మిత్రులను అణగదొక్కడానికి సకల ప్రయత్నాలు చేస్తుంది. ఈ మధ్య ఏఎన్ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని మోడీ ఒక మాట చెప్పారు. 'బీఎస్పీతో భవిష్యత్ సంబంధాలు' జాతీయ మీడియాతో చర్చించ దగ్గ అంశం కాదని అన్నారు. ప్రాంతీయ సర్దుబాట్లలో భాగంగా ఎన్నికల తర్వాత రాష్ట్రీయ లోక్ దళ్ (ఆర్ఎల్డీ) లాంటి పార్టీలు ఎన్డీఏలో చేరినా ఆశ్చర్యంలేదు. బహుశా ఆర్ఎల్డీ అధినేత అజిత్ సింగ్ మౌనం కూడా ఒక సంకేతమే కావచ్చు. మాయ–అఖిలేశ్ల కూటమిలో చేరేదీ, లేనిదీ ఖరారుచేయలేదు. అజిత్ సింగ్ ఎటో ఒక దిక్కు మొగ్గితే పరిస్థితులు మరింత గమ్మత్తుగా తయారవుతాయి.

ఢిల్లీని చేజిక్కించుకోవాలంటే యూపీతోపాటు బీజేపీని ముఖాముఖి ఢీకొట్టే ఇతర రాష్ట్రాలూ కాంగ్రెస్కు కీలకమవుతాయి. కర్ణాటక, కేరళ, అస్సాం, జార్ఖండ్, గుజరాత్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్గఢ్, ఈశాన్య రాష్ట్రాలు, మహారాష్ట్రల్లో బీజేపీని కాంగ్రెస్ నేరుగా ఢీకొంటుంది. కాంగ్రెస్ యాక్టివ్గా లేని తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఏపీ, బిహార్, ఒడిశా, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో కొన్నింట ఇప్పటికే పొత్తులు ఖరారు కాగా, ఎన్నికల నాటికి ఇంకొందరు కలిసొస్తారని గ్రాండ్ ఓల్డ్ పార్టీ ఆశిస్తోంది. ఈ లెక్కన యూపీలో కాంగ్రెస్ గెలవబోయే సీట్లు మెజారిటీని పెంచబోయేవిగా చూడొచ్చు. ఎన్డీఏ కూటమికి మినిమమ్ 225 సీట్లొస్తే తప్ప, రాయ్సీనా హిల్స్ నుంచి రాజ్యం చేయబోయేది కూటమి సర్కారే కావచ్చు.

సోలో ఫైటే సో బెటరు!

వాస్తవం చెప్పాలంటే, యూపీలో గత నాలుగు దఫాల లోక్సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఒంటరిగానే పోటీచేసింది. మోడీ ప్రభంజనంలోనూ ఎస్పీ, బీఎస్పీల స్థాయిలోనే సీట్లు దక్కించుకుంది. ఈసారి కాంగ్రెస్ ఓటు బ్యాంకు ఎఫెక్ట్.. బీఎస్పీ, ఎస్పీల కంటే బీజేపీపైనే ఉంటుందని అంచనా.

	1999	2004	2009	2014
కాంగ్రెస్	10	9	21	2
బీఎస్పీ	14	19	20	0
ఎస్పీ	26	35	23	5
బీజేపీ	29	10	10	73




సిస్టర్ సెంటిమెంట్ తోడైతే..

ప్రియాంకా గాంధీ పొలిటికల్ ఎంట్రీతో కాంగ్రెస్ అభిమానుల సుదీర్ఘ డిమాండ్ నెరవేరినట్లైంది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో ఆమె.. 'తూర్పు ఉత్తరప్రదేశ్'కు ఎన్నికల ఇన్చార్జిగా వ్యవహరిస్తారు. రాహుల్ సింగిల్ హ్యాండ్ పోరాటానికి తోడు సిస్టర్ సెంటిమెంట్ కూడా వర్క్అవుట్ అయితే ఆ ప్రభావం యూపీతోపాటు దేశమంతటా ఉంటుందని కాంగ్రెస్ నేతల ఆశ. ప్రకటన వెలువడినప్పటి నుంచి ఆన్లైన్, ఆఫ్లైన్లో ప్రియాంక పేరే ట్రెండ్ అవుతోంది. మరి ప్రియాంక ఎంట్రీ కాంగ్రెస్కు కలిసొచ్చి యూపీలో కొన్ని సీట్లయినా గెలిచే అవకాశముంటుందా? దీనికి జవాబు కోసం లాంగ్ వెయిట్ తప్పదు.

మినిమమ్ 136 సీట్లు గెలవాలి

కాంగ్రెస్ను కూటమిలో కలవనీయకుండా చేసిన మరో అంశం సీట్ల సర్దుబాటు. బీఎస్పీ–ఎస్పీతో పొత్తు పెట్టుకుంటే యూపీలో కలిగే లాభం కంటే మిగతా రాష్ట్రాల్లో జరిగే నష్టమే ఎక్కువని కాంగ్రెస్ భావించి ఉండొచ్చు. యూపీ కూటమిలో చేరితే కాంగ్రెస్కు దక్కేవి మహా అనుకుంటే ఏ ఐదో, పదో సీట్లు. వాటికి బదులుగా మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్గఢ్లాంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్.. ఎస్పీ, బీఎస్పీల కోసం కొన్ని టికెట్లైనా వదులుకోవాల్సి వస్తుంది. బీజేపీతో ముఖాముఖి తలపడే స్థానాలను కాంగ్రెస్ త్యాగం చేయాల్సి ఉంటుందన్నమాట. కాబట్టే యూపీలో ఒంటరి పోరుకు రాహుల్ సిద్ధమయ్యారు. ఫలితాల తర్వాత బీజేపీయేతర పార్టీలు రాహుల్ ప్రధాని అభ్యర్థిత్వాన్ని సమర్థించాలంటే కాంగ్రెస్.. మ్యాజిక్ ఫిగర్లో సగం సీట్లైనా గెలుచుకుని తీరాలి. 543 సీట్లున్న లోక్సభలో మ్యాజిక్ ఫిగర్ 272. దాంట్లో సగం అంటే, 136 ఎంపీ స్థానాల్లో గెలిస్తే తప్ప మిగతా పార్టీలు రాహుల్వైపు చూడవు. ప్రస్తుతం 48 మంది ఎంపీలున్న కాంగ్రెస్కు అది పెద్ద టార్గెట్ కిందే లెక్క.



పక్షులు కాదు..

పార్లమెంట్ భవనం మీద నుంచి పక్కనున్న చెట్టు పైన వాలటానికి ఎగిరిన వాటిని చూస్తే పక్షులేమో అనిపిస్తోంది. కానీ, కాదు. అవి విమానాలు. రిపబ్లిక్ డే పరేడ్కి ఫుల్ డ్రెస్ రిహార్సల్స్లో భాగంగా బుధవారం ఫాస్ట్గా దూసుకెళుతున్న ఇండియన్ ఎయిర్ఫోర్స్ ప్లేన్లు.

సాహితీ ప్రియులకు.. సిసలైన పండుగ..



HYDERABAD LITERARY FESTIVAL
25-27 January 2019

మన రాష్ట్రంలోని సాహిత్యాభిమానులకు ఏటా రెండు జాతరలొస్తాయి. ఒకటి.. డిసెంబర్లో జరిగే బుక్ ఫెయిర్. రెండు.. జనవరిలో జరిగే లిటరరీ ఫెస్టివల్. దేశంలో మూడో అతి పెద్ద సాహితీ జాతర హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ (హెచ్ఎల్ఎఫ్). దేశం నలుమూలల నుంచి వచ్చే రచయితలు, కళాకారులు, చిత్రకారులు, పాఠకులు ఓ చోట చేరి మూడు రోజుల పాటు కొత్త ఆలోచనలను, రచనలను కలబోసుకుంటారు. వాటికి అక్షర రూపం ఇస్తారు.

దేశంలో సాహిత్యాభిమానులు ఈ హెచ్ఎల్ఎఫ్ను ముఖ్య క్యాలెండర్ పండుగల లిస్టులో చేర్చుకుంటారు. ఈ జాతరను 2010 నుంచి ఏటా నిర్వహిస్తున్నారు. హైదరాబాద్కి చెందిన బీఎస్పీ రావు, విజయ్ కుమార్, అంబికా అనంత్, భార్గవీ రావు సాహితీ ప్రియులు. మంచి రచనలను ఓ చోట చేర్చేందుకు 1995లో ఆన్లైన్ మ్యాగజైన్ 'మ్యూజ్ ఇండియా'ని మొదలుపెట్టారు. దేశవిదేశాల నుంచి రైటర్లు తమ రచనలను పంపేవారు.

వాళ్లంతా ప్రతి ఏడాది హైదరాబాద్లో 'మ్యూజ్ మీట్'లో కలుసుకొని సాహితీ ముచ్చట్లు సాగించేవారు. ఇది 15 ఏళ్లపాటు ఒక్కోసారి ఒక్కో చోట జరిగేది. ఈ సమావేశాలను సంబరంగా మార్చాలన్న ఆలోచన నుంచి హెచ్ఎల్ఎఫ్ పుట్టింది. తొలిసారిగా 2010 డిసెంబర్లో ఉస్మానియా యూనివర్సిటీలో జరిపారు. క్రియేటివిటీ ఉన్నవారందరికీ అవకాశం కల్పించారు. కవులు, కళాకారులు, చిత్రకారులు మూడు రోజుల పాటు ఆసక్తికర చర్చలు, ఉత్తేజపరిచే ప్రదర్శనలు, వర్క్షాపులు చేపట్టారు.

అప్పటి నుంచి ఏటా జనవరి వచ్చిందంటే సాహిత్యాభిమానులంతా హెచ్ఎల్ఎఫ్ కోసం ఎదురు చూస్తారు. ఈ వేడుక గత ఐదేళ్లుగా హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో జరుగుతోంది. ఈ సాహితీ జాతరకు ఎన్నో విశేషాలు ఉన్నాయి. అన్ని వయసుల వాళ్లూ జ్ఞానాన్ని పంచుకునే, పెంచుకునే కార్యక్రమాలు ఉంటాయి. ఒక్కో ఏడాది ఒక్కో రాష్ట్ర భాషను ఎంచుకొని అందులోని ఉత్తమ రచనలపై చర్చిస్తారు. ఈసారి గుజరాతీని ఎంపిక చేశారు. పాపులర్, ఫేమస్ రైటర్ల రచనలు, నేపథ్యాలపై మాటామంతీ, ముచ్చట్లు చేస్తారు. సామాజిక సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపైనా సమాలోచనలు జరుపుతారు. భిన్న కళల ప్రదర్శనలకు ఈ సదస్సు అద్దం పడుతుంది. అలాగే ఏటా ఒక్కో దేశం నుంచి క్రియేటివ్ రైటర్స్ని ఆహ్వానిస్తారు. ఈసారి చైనా బృందం వస్తోంది.

అక్కడి రైటింగ్స్, సామాజిక అంశాలు, కళలపై చర్చిస్తారు. చైనా సినిమాలతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఎంపిక చేసిన వివిధ భాషల చిత్రాలను ప్రదర్శిస్తారు. చర్చలు రెండు ప్రధాన వేదికలపై జరుగుతాయి. ఈసారి కావ్యధార పేరుతో మూడో వేదికనూ ఏర్పాటు చేశారు. దానిపై కవిత్వాన్ని చదివి వినిపించడంతో పాటు ప్రదర్శనలకూ అవకాశం ఉంటుంది. మూడు రోజుల్లో సుమారు 30 వర్క్షాపులు జరుగుతాయి.

దేశంలో చాలా నగరాల్లో జరిగే సాహితీ ఉత్సవాలకు జైపూర్ ఇంటర్నేషనల్ లిటరరీ ఫెస్టివలే మాతృక. దేశవిదేశాల నుంచి 15 లక్షల మంది పాల్గొనే ఈ వేడుకను 'సాహితీ కుంభమేళా'గా వర్ణిస్తారు. కోల్కతా లిటరరీ ఫెస్టివల్నూ వైభవంగా నిర్వహిస్తారు. వీటి తర్వాత చెప్పుకోదగ్గ లిటరరీ ఫెస్టివల్ హెచ్ఎల్ఎఫ్.

ఫెస్టివల్లో పాల్గొనేవారికి ఎంట్రీ ఫీజు లేదు. ఈసారి షబానా ఆజ్మీ, షషీ దేశ్ పాండే, సాహిత్య అకాడమీ అవార్డు విజేతలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతిని చాటే కొమ్ము, కోయ, డప్పు నృత్యాలు అలరించనున్నాయి. 200 అతిథులు తరలివస్తున్న ఈ వేడుకల్లో 15 వేల మంది పాల్గొనేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

(జనవరి 25, 26, 27 తేదీల్లో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో హెచ్ఎల్ఎఫ్ జరగనున్న సందర్భంగా..)

తప్పక వెళ్లాల్సిందే

ఇతర భాషల, ఇతర రాష్ట్రాల సాహిత్యాల గురించి తెలుసుకునేందుకు ఇదో గొప్ప అవకాశం. వివిధ రాష్ట్రాల రచయితలు తమ అభిప్రాయాలను, అనుభవాలను ఇక్కడి వారితో పంచుకుంటారు. యంగ్ రైటర్స్కి ఈ ఉత్సవం ఒక అద్భుతమైన వేదిక. మూడు రోజుల పాటు జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొనటం ద్వారా ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవచ్చు. నేను హైదరాబాద్లో ఉంటే తప్పకుండా హాజరయ్యే వేడుక ఇది.

– ఓల్గా, ప్రముఖ రచయిత్రి,
(కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత)



యూదుల మనసంతా.. యమహానగరిపైనే..

'సిటీ ఆఫ్ జాయ్'గా ముద్దుగా పిలుచుకునే కోల్కతాలో ఒకప్పుడు యూదు కల్చర్ ఉండేది. దాదాపు 200 ఏళ్లకు పైగా ఉన్న యూదులు అక్కడి సామాజిక సాంస్కృతిక వారసత్వంతో బంధం పెంచుకున్నారు. కొన్నేళ్ల క్రితం వీళ్లంతా అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, ఇజ్రాయెల్ తదితర దేశాలకు వలస వెళ్లిపోయారు. ఆ నగరంలో యూదు వారసత్వం నేడు దాదాపు కనుమరుగయ్యే స్థితికి వచ్చింది. ప్రస్తుతం విదేశాల్లో ఉంటున్నవారు తమ తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్నారు.



మాగెన్ డేవిడ్ చర్చ్



సారా సిలాస్ బ్రౌన్

రహేల్ ముస్లీహ్ అనే మహిళ తన చిన్నతనంలో (11 ఏళ్ల వయసులో) కోల్కతాలోని బౌబజార్ స్ట్రీట్లో ఉండేవారు. ఆ కుటుంబం కొన్నాళ్ల తర్వాత న్యూయార్క్కి వెళ్లి స్థిరపడింది. అక్కడి ఇండియన్ గ్రాసరీ స్టోర్ని సందర్శించినప్పుడల్లా ఆమెను జ్ఞాపకాలు చుట్టుముడతాయి. ఎమోషనల్ అయిపోతుంది. కోల్కతాలో ఉన్నప్పుడు రోజూ ఉదయం 'గుడ్ డే' బిస్కెట్లు, వెజిటబుల్ సమోసా, చింతకాయ పచ్చడి తినేవారు. న్యూయార్క్ వెళ్లాక కూడా మన దేశంపై మమ'కారం' తగ్గలేదు. ఇప్పటికీ ఇదే మెనూని కంటిన్యూ చేస్తున్నారు

'వృత్తిలో భాగంగా నిత్యం కమ్యూనిటీస్ గురించే మాట్లాడుతుంటా. చివరికి అదే నా ఐడెంటిటీలో ఓ పార్ట్గా మారింది' అని రహేల్ అన్నారు. ఇండియాకి ఏటా టూర్లు నిర్వహిస్తూ.. మన దేశంలో యూదు సంస్కృతి మరుగున పడకుండా తన వంతు పాత్ర పోషిస్తున్నారు. బాగ్దాద్ నుంచి కోల్కతాకు వలస వచ్చిన యూదుల్లో ఇప్పుడు 20 మందైనా లేరంటే అతిశయోక్తి కాదు. పైగా, వాళ్ల వయసు 70 ఏళ్లు పైమాటే. ఈ కొద్ది మందీ కాలం చేస్తే, ఇక వాళ్ల వారసత్వం గత చరిత్రే అవుతుంది. యూదులు చాలా దేశాల్లో చాలా వివక్షను ఎదుర్కొన్నారు. కానీ, వాళ్లను మన దేశం సగౌరవంగా స్వాగతించింది. రెండు శతాబ్దాలకు పైగా ఆతిథ్యం ఇచ్చింది. ఇండియాలో ఒకప్పుడు ఇంత గొప్పగా బతికిన యూదు సమాజానికి పూర్వ వైభవం (ముఖ్యంగా కోల్కతాలో) రావాలని రహేల్ ముస్లీహ్ కోరుకుంటున్నారు.

17 ఏళ్ల వయసు వరకు కోల్కతాలోని మొయిరా స్ట్రీట్లో గడిపిన లహావా సిల్లిమాన్ హెర్మన్ అనే మహిళ ఆ తర్వాత తన ఫ్యామిలీతో కలిసి ఇజ్రాయెల్లోని వెస్ట్ జెరూసలేంకి శాశ్వతంగా వెళ్లాల్సి వచ్చింది. అక్కడ రెస్టారెంట్ నడుపుతూ షెఫ్గా కూడా పనిచేస్తున్నారు. కోల్కతా ఫుడ్ కల్చర్ని పూర్తిగా మిస్సయ్యానన్న బాధ ఆమెలో ఉంది. కోల్కతా.. ఫుడ్కి పెట్టింది పేరు. కొన్ని ఐటమ్స్ అక్కడ మాత్రమే దొరుకుతాయి. వెస్ట్ జెరూసలేంలో బెస్ట్ చట్నీలకు కేరాఫ్ అడ్రస్గా హెర్మన్ రెస్టారెంట్ నిలుస్తున్నా గానీ, ఆమె కోల్కతా కిచెన్ టేస్ట్ను మాత్రం పొందలేకపోతోంది.

కోల్కతాలోని పార్క్స్ట్రీట్ ఏరియాలో జ్యూయిష్ గర్ల్స్ అండ్ బోర్డింగ్ స్కూల్లో చదివి ఇప్పుడు కెనడాలో సెటిలైన సారా సిలాస్ బ్రౌన్ అనే మహిళ కూడా వెనకటి రోజులను గుర్తు చేసుకున్నారు. 'మా చుట్టుపక్కల ఉండే వేర్వేరు మతాల వాళ్లు మా ఇంట్లోకి స్వతంత్రంగా ఎప్పుడు పడితే అప్పుడు వచ్చేవాళ్లు. ఇరుగుపొరుగుని నవ్వుతూ ఆహ్వానించి వాళ్లకు తినటానికి, తాగటానికి ఏదైనా పెట్టకుండా పంపించే వాళ్లం కాదు. అందరం కలిసి అన్ని పండుగలూ జరుపుకునేవాళ్లం. మనుషుల మధ్య బంధం ఏర్పడటానికి అందరి మతం ఒక్కటే కావాల్సిన అవసరం లేదు. మన మనసెక్కడ ఉంటుందో అక్కడే మన అసలైన ఇల్లు. నేను కెనడాలో ఉంటున్నానేగానీ నా మనసంతా కోల్కతాలోనే ఉంది' అని బ్రౌన్ వివరించారు.

కోల్కతాలోని సెయింట్ జేవియర్ కాలేజీలో ఉత్పల్ దత్తా క్లాస్మేట్ సాలమన్ బెఖార్ ప్రస్తుతం ఇంగ్లండ్లో ఉంటున్నారు. ఉత్పల్ దత్తాను మన దేశంలో ఆధునిక నాటక రంగానికి గైడ్గా గుర్తిస్తారు. దత్తాతో కలిసి బెఖార్ చాలా ఏళ్లు పని చేశారు. కోల్కతా నుంచి వెళ్లిపోవటంతో ఎంతో మంది ఫ్రెండ్స్ దూరమయ్యారని ఆవేదన వెలిబుచ్చారు. 'కోల్కతాకి చివరిసారి 1984-85లో వచ్చాను. ఇప్పుడు ఆ సిటీ ఎంతో మారిపోయి ఉంటుంది. మారని స్నేహితులను, మారిన నగరాన్ని చూడాలనుంది. వయసు సహకరిస్తుందో లేదో మరి' అన్నారు.

కోల్కతాలో ప్రస్తుతం యూదులను చూద్దామని వెళ్లినవారికి మనసు బరువెక్కుతుంది. అక్కడ గతంలో వాళ్లు నిర్మించిన అందమైన ప్రార్థనా మందిరాలు, భవనాలు, స్కూళ్లు, ఇళ్లు, స్మశాన వాటికలే మిగిలాయి. అందులో మనుషులెవరూ లేరు. వాళ్ల జ్ఞాపకాలే ఉన్నాయి. వాళ్ల గురుతులు మాత్రమే కనిపిస్తున్నాయి. అవే యూదుల ఘనమైన వారసత్వాన్ని చాటుతున్నాయి.

– శ్రీజితా దత్తా, ఫ్రీలాన్సర్

ఎక్కడ స్థిరపడినా.. అనుబంధం ఇక్కడే!



బాగ్దాద్, యూరోపియన్ యూదులు కోల్కతాని సొంతిల్లులా భావించారు. అక్కడి సంప్రదాయాలను మనస్ఫూర్తిగా పాటించారు. మతాచారాలతో మమేకమయ్యారు. కమర్షియల్, కల్చరల్, ఓవరాల్ యాక్టివిటీస్లో కీలక పాత్ర పోషించారు. తమ మాతృ భాష హిబ్రూ అయినా, మతం యూదు అయినా, ఇండియా నుంచి వేరే దేశానికి వెళ్లిపోయినా.. ఇప్పటికీ కోల్కతాను మర్చిపోరు. తమ పిల్లలకు నేటికీ మన జాతీయ గీతాన్నే నేర్పుతున్నారు.



యూదుల సమాధి



ప్లేబోయ్ టు లవర్‌బోయ్

అక్కినేని ఫ్యామిలీకి అచ్చొచ్చిన టైటిల్‌తో 'మిస్టర్ మజ్ను'గా ప్రేక్షకుల ముందుకొస్తున్నాడు అఖిల్. 'తొలిప్రేమ' ఫేం వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నిధి అగర్వాల్ కథానాయిక. రిపబ్లిక్ డే సందర్భంగా జనవరి 25న విడుదల కానున్న ఈ సినిమా గురించి అఖిల్ ఇలా పాత్రికేయులతో ముచ్చటించాడు.

> **మజ్ను అంటే ఒక ట్రాజెడీ అనే ట్యాగ్ వచ్చింది. అందుకే ఒక యంగ్ మజ్నుని చూపిద్దామని మిస్టర్ మజ్ను అని టైటిల్ పెట్టాము. అతను తన చుట్టూ ఉన్న అమ్మాయిలను ప్రేమిస్తాడు. అలాగే అమ్మాయిలూ అతనిని ప్రేమిస్తారు. ఒక ప్లే బోయ్ లవర్ బోయ్‌గా ఎలా మారాడో మీరు తెరపై చూస్తారు. పర్సనల్‌గా అయితే ప్రస్తుతానికి నేను సింగల్.**

- నా మొదటి సినిమాకంటే ముందే ఈ స్క్రిప్ట్ నాకు చెప్పాడు వెంకీ. నాన్నకు ఈ కథ నచ్చేదో, లేదో నాకు తెలియదు. కానీ అప్పటికే నేను మొదటి సినిమా కమిట్ అయ్యాను. అది పూర్తవడానికి ఏడాదిన్నర పడుతుంది. ఆలోపు మరేదైనా సినిమా చేసుకోమని చెప్పాను. తను కూడా ఓకే అన్నాడు. అయితే ఈ స్క్రిప్ట్ మాత్రం నా కోసం పక్కన పెట్టాడు. స్క్రిప్ట్ లో ఎలాంటి మార్పులు చేయలేదు. ఒక్క లొకేషన్ మాత్రం అమెరికా నుంచి లండన్ మారిందంతే.
- క్యారెక్టర్ బేస్డ్ కథ కావడంతో వినగానే నచ్చేసింది. నటుడిగానూ ఛాలెంజింగ్‌గా అనిపించింది. సినిమాలో మొదటిభాగం అంతా నా క్యారెక్టర్ పైనే ఆధారపడి ఉంటుంది. విక్కీని ఒక ప్లే బోయ్‌గా రిజిస్టర్ చేయడానికే ఎక్కువ టైం పడుతుంది. ప్రేమకథ కొంత ఆలస్యంగా మొదలవుతుంది. ఫ్యామిలీ ఎమోషన్స్ ఉన్నాయి. నా నటన పూర్తిగా కొత్తగా ఉంటుంది.
- ఓవర్ ఎక్స్ పెక్టేషన్స్, ప్రెజర్ ఇవి రెండు నన్ను భయపెట్టే నా మొదటి శత్రువులు. మొదటి రెండు చిత్రాల విషయంలో ఈ అనుభవం ఎదురైంది. దాన్నుంచి చాలా నేర్చుకున్నా. అందుకే అంచనాలను రీచ్ కావడానికి ప్రయత్నించడం లేదు. నచ్చిన సినిమాలు చేయడానికి ప్రాధాన్యతను ఇస్తున్నాను. దానికోసం ఒక్కో మెట్టూ ఎదుగుతూ ప్రయత్నిస్తున్నాను.
- ఇది మంచి ఎంటర్టైన్మెంట్ సినిమా. ప్రేక్షకులు ఇలాంటి సినిమాలను ఆదరిస్తున్నారు. ఎంజాయ్ చేస్తున్నారు. హ్యూమర్, ఫ్యామిలీ ఎమోషన్స్ ఇవి మన తెలుగు సినిమాకి మూలాలు. వెంకీ క్లాసిక్ తెలుగు సినిమా కథను తీసుకుని మోడర్న్‌గా తెరకెక్కించాడు. నిన్నే పెళ్లాడుతా, మన్మథుడు లాంటి సినిమాలు, త్రివిక్రమ్ గారి సినిమాలు చూసిన స్ఫూర్తితో వెంకీ ఈ సినిమా తీశాడు. అలాగని కాపీ కొట్టలేదు.
- వెంకీ హార్డ్‌కోర్ అక్కినేని ఫ్యాన్. 'ప్రేమనగర్' సినిమాలోని డైలాగ్‌ను ఇన్‌స్పిరేషన్‌గా తీసుకుని వెంకీ ఈ కథను తయారు చేశాడు. ఇది లవ్ స్టోరీ అయినా మూడు ఫైట్స్ పెట్టాడు. ఫ్యామిలీ ట్రాక్ పెట్టి రిలేషన్స్ కూడా చూపించాడు. ఒక సకుటుంబ సమేత చిత్రంగా తీర్చిదిద్దాడు.
- నాన్నగారు స్క్రిప్ట్ వింటారు, అప్పుడే ఇన్ పుట్స్ కూడా ఇస్తారు. సినిమా చూసిన తరువాత కూడా ఫీడ్ బ్యాక్ ఇస్తారు. ఓ సీన్ విషయంలో మాకు ఓ అనుమానం ఉంది. నాన్నగారికి కూడా అలాగే అనిపించడంతో ఆ సీన్‌ను రీ షూట్ చేశాము.
- ఇప్పటివరకు మజ్ను అనే టైటిల్ మా ఫ్యామిలీకి బాగా కలిసొచ్చింది. నేను కూడా దానిని కొనసాగిస్తాను. ఇది ఖచ్చితంగా ట్రావెల్ ఉన్న సినిమా. అబ్రాడ్ లో సుమారు నలభై రోజులు షూట్ చేశాము. ఈ స్క్రిప్ట్ నాకు కరెక్ట్ అనిపించింది, నా నమ్మకం ప్రకారం ప్రేక్షకులకూ నచ్చుతుంది.
- ఓ పాట కోసం 8 ప్యాక్ చేశాను. అందుకు శేఖర్ మాస్టర్ కారణం. ఎందుకంటే మొదటి పాట నా క్యారెక్టర్ ఇంట్రడక్షన్ సాంగ్. దీనిని రొటీన్ గా కాకుండా కొత్తగా చెయ్యాలనుకున్నాము. నంబర్ ఆఫ్ కట్స్, నంబర్ ఆఫ్ చేంజెస్, నంబర్ ఆఫ్ టేక్స్ తీసుకుని సేమ్ స్టెప్స్ నే కట్ కట్ కట్ గా చేసి ఏదన్నా వెరైటీగా చేద్దామనుకున్నాము. దాంతో గెటప్, డ్రెస్సింగ్ స్టైల్ అన్ని కూడా మారిపోయాయి.
- ప్రొడ్యూసర్ ప్రసాద్ గారి గురించి చెప్పాలంటే ..ఆయన చుట్టూ ఒక సంతోషకరమైన, ప్రశాంతమైన వాతావరణం ఉంటుంది. మా తాత గారితో సినిమా చేశారు మళ్ళీ నాతో కూడా చేశారు. అది నాకొక బహుమతి అని గర్వంగా ఫీలవుతాను.
- అత్తారింటికి దారేది సినిమా నాకు చాలా ఇష్టమైన సినిమా. మూడు సార్లు చూశాను. పవన్ కళ్యాణ్ గారి సినిమాల్లో త్రివిక్రమ్ గారి సినిమాల్లో నాకు బాగా నచ్చే సినిమా అది.
- క్రికెట్ బ్యాక్ డ్రాప్ తో ప్రస్తుతం సినిమా చేయను. ఎమ్మెస్ ధోని సినిమా చేశారంటే .. అక్కడి ప్రేక్షకులు దానికి కనెక్ట్ అయ్యారు. కానీ అవి ప్రస్తుతం నా కెరీర్ కి సరిపోదు. ఎందుకంటే నా ఒక్కడికి ఇంటరెస్ట్ ఉంటే కాదు, తీసే డైరెక్టర్ కి కూడా క్రికెట్ నాలెడ్జ్, ఫ్యాషన్ ఉండాలి. కొన్ని టెక్నికల్ ప్రాబ్లమ్స్ ఉన్నాయి. పైగా అలాంటి స్క్రిప్ట్ నా దగ్గరకి రాలేదు. ఒకవేళ వస్తే భవిష్యత్‌లో చేస్తా.
- మల్టీస్టారర్ సబ్జెక్ట్ లు ఒకటి రెండు నా దగ్గరకు వచ్చాయి, కానీ నాకు అప్పుడు కరెక్ట్ గా అనిపించలేదు. ఒప్పుకోలేదు. కానీ ఒక యాక్టర్ గా మల్టీస్టారర్ చేయడానికి నేను ఇంట్రస్ట్ గానే ఉన్నాను. 'ఎక్స్‌పాండబుల్స్' తరహా మల్టీస్టారర్స్ నాకు ఇష్టం. ఆరేడు మంది స్టార్స్ కలిసి నటిస్తుంటే ఆ ఎన్విరాన్‌మెంట్ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది.
- 'సవ్యసాచి' రషెష్ చూసి నిధి అగర్వాల్‌ను వెంకీ ఈ సినిమాకు తీసుకున్నాడు. చాలా అద్భుతంగా చేసింది. మంగళూరు అమ్మాయి కాబట్టి ఎక్కడో సౌత్ టచ్ ఉంది. అందువల్ల తెలుగును అర్థం చేసుకునేది. చాలా హార్డ్ వర్కర్.
- ఓ పాట చిత్రీకరణ సమయంలో చరణ్ మా సెట్‌కు వచ్చారు. ఆయనకు డ్యాన్స్ అంటే ఇష్టం. కాబట్టి తన సినిమా షూటింగ్ జరుగుతుంటే పక్కనే ఉన్న మా సినిమా సెట్‌కు వచ్చి సాంగ్ చూసి అప్రిషియేట్ చేశారు. ప్రి రిలీజ్ వేడుకలో ఫైనెస్ట్ యాక్టర్ అంటూ తారక్ నన్నంతలా పొగుడుతారు అనుకోలేదు. కొంచెం ఎక్కువగానే పొగిడారు. కానీ రియల్ లైఫ్‌లో నాతో ఆయనలా ఉండరు.
- ఇకపై సినిమాల వేగం పెంచబోతున్నాను. రెండు, మూడు కథలు చర్చల దశలో ఉన్నాయి. ఫిబ్రవరి లో సినిమా ప్రకటించి మార్చిలో షూటింగ్ మొదలుపెడతాం. దసరాకు సినిమాను విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నాం.



లవర్స్ డే..

నాకెంతో ఇష్టమైన రోజు

::: అల్లు అర్జున్

కన్ను కొట్టి యువత మనసులను కొల్లగొట్టిన ప్రియా ప్రకాష్ వారియర్ నటించిన మలయాళ చిత్రం 'ఒరు ఆడార్ లవ్' . ఒమర్ లులు దర్శకుడు. షాన్ రెహ్మాన్ సంగీతం అందించాడు. రోషన్ అబ్దుల్, నూరిన్ షరీఫ్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. 'లవర్స్ డే' పేరుతో ఈ సినిమా ఫిబ్రవరి 14న తెలుగులోనూ విడుదల కానుంది. సుఖీభవ సినిమాస్ బ్యానర్‌పై గురురాజ్, సి.హెచ్.వినోద్ రెడ్డి విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలుగు వెర్షన్ ఆడియో విడుదల హైదరాబాద్ జె.ఆర్.సి కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. అల్లు అర్జున్ ముఖ్య అతిథిగా హాజరై ఆడియో సీడీని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'నాకు పర్సనల్‌గా సౌత్ ఇండియానే ఇష్టం. నా ప్రొఫైల్‌లో కూడా సౌత్ ఇండియన్ యాక్టర్ అనే రాసుకుంటాను. అలా చెప్పుకోడానికే గర్వపడతాను. నన్ను మలయాళంలో బాగా ఆదరించారు. అక్కడి నుంచి వస్తోన్న ఈ సినిమాను ప్రోత్సహించాలని వచ్చాను. ఈ సినిమాకు ఇంత బజ్ చేసిన హీరో రోషన్‌కు, ప్రియా వారియర్‌కు కంగ్రాట్స్. సినిమాకు దేశవ్యాప్తంగా క్రేజ్ క్రియేట్ చేసిన క్రెడిట్ దర్శకుడిదే. 'నా పేరు సూర్య' సమయంలో వినోద్ రెడ్డి నాకు పెద్ద ఫ్యాన్ అంటూ బన్నీ వాసు పరిచయం చేశారు. ఆయన ఆ సినిమాను పంపిణీ చేశాడు. సినిమా ఫెయిల్ అయినప్పటికీ నాపై ఆయన చూపించే అభిమానంలో ఎలాంటి మార్పు లేదు. అలాంటి వ్యక్తికి ఏదో ఒకటి చేయాలని అప్పుడే అనుకున్నాను. అందుకే ఈ వేడుకకు ఆహ్వానించగానే అంగీకరించాను. నాకు పద్నాలుగేళ్ల వయసు ఉన్నప్పటి నుంచి లవర్స్ డే సెలబ్రేట్ చేసుకుంటున్నాను. నా బర్త్ డేకు ఎంత ఎక్సైటింగ్‌గా ఉంటానో లవర్స్ డేకు అంతే. నాకు ఎంతో ఇష్టమైన రోజు ఈ సినిమా వస్తోంది. సినిమా టీమ్ అందరికీ ఆల్ ద బెస్ట్' అన్నారు. మారుతి మాట్లాడుతూ 'ఈ రోజుల్లో' చిత్రానికి వచ్చి బన్నీ బ్లెస్సింగ్స్ ఇవ్వగా పెద్ద విజయం సాధించి నా కెరీర్ స్టార్ట్ అయింది. ఈ సినిమాకు వచ్చాడు కనుక చిత్రంలోని అందరి కెరీర్స్ మారిపోతాయి' అన్నారు. హీరోయిన్ ప్రియా ప్రకాష్ వారియర్ మాట్లాడుతూ 'అల్లు అర్జున్ గారంటే చాలా ఇష్టం. ఆయనతో ఇలా స్టేజ్ షేర్ చేసుకోవడం అతిపెద్ద అవకాశంగా భావిస్తున్నాను. నా కలలో కూడా ఇది ఊహించలేదు. ఈ అవకాశం ఇచ్చిన అందరికీ థ్యాంక్స్. ఈ సినిమా విడుదలకు ముందే నన్ను యాక్సప్ట్ చేసిన తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు. మీ ఆదరణ ఇలాగే కొనసాగాలి' అని చెప్పింది. మరో హీరోయిన్ నూరిన్ మాట్లాడుతూ 'ప్రేమ, ప్రోత్సాహం చూపిస్తోన్న తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు' తెలిపింది. హీరో రోషన్ మాట్లాడుతూ 'అల్లు అర్జున్ గారికి థ్యాంక్స్. నేను ఆయన అభిమానిని. మా కేరళలో చాలామందికి ఆయన స్ఫూర్తి. ఇది నా తొలిచిత్రం. ఆడిషన్ ద్వారా ఎంపిక చేశారు. నాకీ అవకాశం ఇచ్చిన దర్శకనిర్మాతలకు థ్యాంక్స్' అన్నాడు. నిర్మాతలు వినోద్ రెడ్డి, గురురాజ్, నటుడు శివాజీ రాజా, 'లవర్స్ డే' చిత్ర బృందం పాల్గొన్నారు.





రెండు జంటల ప్రేమకథ



ట్రెండ్ కు తగ్గట్టుగా అప్డేట్ అవుతూ తీస్తే ప్రేమకథలు ఎన్నిసార్లు తీసినా బోర్ కొట్టవు. అలాంటి న్యూ ఏజ్ లవ్‌స్టోరీనే తమ సినిమా అంటున్నారు 'నీ కోసం' చిత్ర దర్శకుడు అవినాష్ కోకటి. ఆయన దర్శకత్వంలో తీర్థసాయి ప్రొడక్షన్స్ బ్యానర్ పై అల్లూరమ్మ(భారతి) ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని 'తొలి తొలిగా' అనే పాటను ప్రముఖ దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ విడుదల చేశారు. పాట బాగుందని, సినిమా మంచి విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

ప్రేమలో కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తూ రెండు జంటల మధ్య ప్రేమకథను ఈ తరానికి నచ్చేలా తెరకెక్కించామన్నారు నిర్మాత. అరవింద్ రెడ్డి, శుభాంగి పంత్, అజిత్ రాధారామ్, దీక్షిత జంటలుగా నటిస్తుండగా సుదర్శన్, 'ఈ రోజుల్లో' సాయి, కేధార్ శంకర్, పూర్ణిమ, ఇతర పాత్రలు పోషిస్తున్నారు. టాకీ పార్ట్ పూర్తి కాగా ఫిబ్రవరి నెలలో విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు.

మళ్లీ మాస్ డైరెక్టర్‌తో..



సూర్య నుంచి సినిమా వచ్చి సంవత్సరం దాటింది. గత ఏడాది సంక్రాంతికి 'గ్యాంగ్' వచ్చింది. ఆ తర్వాత రెండు కొత్త సినిమాలకు అంగీకరించిన సూర్య.. ఆ సినిమాలతో బిజీ అయ్యాడు. సెల్వరాఘవన్ దర్శకత్వంలో రూపొందుతోన్న 'ఎన్.జి.కె.' ఇటీవల షూటింగ్ పూర్తవగా, కేవీ ఆనంద్ సినిమా 'కాప్పాన్' షూటింగ్ దశలో ఉంది. ఈ కమిట్‌మెంట్ ఇంకా పూర్తవకముందే మరో సినిమాకు సూర్య అంగీకరించినట్టు తెలుస్తోంది. మాస్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్ అయిన హరి దర్శకత్వంలో ఈ చిత్రం ఉండనుందట. ప్రముఖ నిర్మాణ సంస్థ ఏవీఎమ్ ప్రొడక్షన్స్ ఈ చిత్రం నిర్మించనుంది. ఈ బ్యానర్‌లో సూర్యకు ఇది మూడో చిత్రం. ఈ సినిమాకు 'యానై' అనే టైటిల్‌ను కూడా ఎంపిక చేశారు.

ఇస్మార్ట్ శంకర్ షూటింగ్ షురూ



రామ్ పోతినేని హీరోగా పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఇస్మార్ట్ శంకర్'. బుధవారం ఈ సినిమా ప్రారంభమైంది. పూరీ జగన్నాథ్ టూరింగ్ టాకీస్ , పూరీ కనెక్ట్స్ పతాకాలపై పూరీ జగన్నాథ్ , ఛార్మి కౌర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తొలి షాట్ ని రామ్ పై చిత్రీకరించగా ఛార్మి క్లాప్ కొట్టింది, స్రవంతి రవికిశోర్ కెమెరా స్విచాన్ చేశారు. ఈ రోజు నుంచి రెగ్యులర్ షూటింగ్‌కు వెళ్తోంది. పునీత్ ఇస్సార్, సత్య దేవ్, మిలింద్ గునాజి, ఆశిష్ విద్యార్థి మరియు గెటప్ శ్రీను ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ కోసం రామ్ సరికొత్త లుక్‌లోకి మేకోవర్ అయ్యాడు. మణిశర్మ సంగీతం సమకూరుస్తున్న ఈ సినిమాకు రాజ్ తోట సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. కేవలం మూడు నెలల్లో షూటింగ్ పూర్తి చేసి, మే లో సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. హీరో రామ్‌తో పాటు పూరి జగన్నాథ్ విజయాన్ని అందుకుని చాలా కాలమైంది. ఈ క్రమంలో వీరిద్దరి కలయికలో వస్తోన్న ఈ చిత్రం విజయం సాధించడం కీలకంగా మారింది. రామ్ న్యూ లుక్, పూరి మార్క్ టైటిల్ చూస్తుంటే హిట్ కొట్టే సూచనలు కనిపిస్తున్నాయి.

హాట్ టాపిక్‌గా హన్సిక



వరుస తమిళ చిత్రాలతో కోలీవుడ్‌లో కుదురుకున్న హన్సిక కెరీర్‌లో 50వ సినిమాకు చేరుకుంది. 'మహా' పేరుతో రూపొందుతోన్న ఈ చిత్రంలో వైవిధ్యమైన పాత్రను పోషిస్తోంది హన్సిక. ఈ సినిమా పోస్టర్స్ కొంత వివాదాస్పదం అయ్యాయి. అది మరువకముందే హన్సిక మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయింది. ప్రస్తుతం అమెరికా ట్రిప్‌లో ఉన్న హన్సిక అక్కడి మియామీలో ఎంజాయ్ చేస్తోంది. అక్కడి నుంచి ఆమె బికినీ ఫొటోలతో పాటు ప్రైవేట్ ఫొటోలు కొన్ని సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. ఇందులో కొన్ని హన్సిక సొంతంగా తీసుకున్నట్టుగా ఉన్న సెల్ఫీ ఫొటోస్ కూడా ఉన్నాయి. ఆమధ్య అక్షరహాసన్ పర్సనల్ ఫొటోస్ కూడా ఇలాగే సోషల్ మీడియాలో లీకయ్యాయి. అప్పట్లో ఆ విషయంపై పోలీసులకు పిర్యాదు చేసింది అక్షర. కొన్ని గంటల తర్వాత హన్సిక కూడా ఈ విషయంపై స్పందించింది. తన ఫోన్‌తో పాటు ట్విట్టర్ అకౌంట్ హ్యాక్ అయ్యిందని, దాన్ని పరిష్కరించడానికి తన టీమ్ వర్క్ చేస్తోందని ట్విట్టర్ ద్వారానే వెల్లడించింది.




ఫిబ్రవరి 8న యాత్ర



వై.ఎస్. రాజశేఖరరెడ్డి రాజకీయ జీవితంలో కీలక ఘట్టం పాదయాత్ర. అప్పట్లో జరిగిన ముఖ్య సంఘటనల ఆధారంగా 'యాత్ర' సినిమా రూపొందుతోంది. వైఎస్సార్ పాత్రను మమ్ముట్టి పోషించగా మహి వి రాఘవ్ దర్శకత్వం వహించాడు. 70 ఎం ఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తోన్న ఈ చిత్రం త్వరలో రానున్న ఆంధ్రప్రదేశ్ ఎన్నికలు లక్ష్యంగా ఫిబ్రవరి 8న విడుదల కానుంది. తెలుగుతో పాటు తమిళ, మలయాళ భాషల్లోనూ ఈ సినిమా విడుదల కానుండగా, తాజాగా తెలుగు వెర్షన్ సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. క్లీన్ యు సర్టిఫికెట్ లభించింది. ఈ సందర్భంగా నిర్మాతలు విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి మాట్లాడుతూ "చిత్రంలో ఆద్యంతం ఎమోషన్ తో కూడిన పాత్రలు, పాత్ర చిత్రణ కనిపిస్తాయి. మంచి ఎమోషనల్ చిత్రాన్ని నిర్మించినందుకు సెన్సారు సభ్యులు అభినందించారు. తెలుగు ప్రేక్షకులు తప్పకుండా చూడవలసిన చిత్రం ఇది' అన్నారు. రావు రమేష్, జగపతిబాబు, సుహాసిని, అనసూయ, పోసాని, సచిన్ ఖేడ్కర్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.

నేతాజీ అదృశ్యం వెనుక..



గత కొన్నాళ్లుగా ప్రముఖుల జీవితాల ఆధారంగా విరివిగా సినిమాలు వస్తున్నాయి. ఈ క్రమంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితంపై కూడా ఓ సినిమా రూపొందుతోంది. 'గుమ్నామీ' అనే టైటిల్‌తో రూపొందుతోన్న ఈ బాలీవుడ్ సినిమాకు 'ది గ్రేటెస్ట్ స్టోరీ నెవర్ టోల్డ్' అనేది క్యాప్షన్. శ్రీజిత్ ముఖర్జీ దర్శకుడు. నేతాజీ జయంతి సందర్భంగా ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. దేశ స్వాతంత్ర్యానికి ముందు జరిగిన సుభాష్ చంద్రబోస్ అదృశ్యంపై రకరకాల కథనాలు ప్రచారంలో ఉన్నాయి. విమాన ప్రమాదంలో ఆయన మరణించారని కొందరంటే, కాదు హిమాలయాల్లో బాబాగా అజ్ఞాత జీవితం గడిపారని మరికొందరంటారు. ఈ విషయంపై సరైన స్పష్టత మాత్రం లేదు. సరిగ్గా ఇదే అంశాన్ని ఈ సినిమాలో హైలెట్ చేయబోతున్నట్టు తెలుస్తోంది. ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో ఒక వృద్ధుడు గోడవైపు చూస్తున్నాడు. అక్కడ నేతాజీ మిస్సింగ్, విమాన ప్రమాదంలో మృతి వంటి పలు పేపర్ క్లిప్పింగ్స్ అతికించి ఉన్నాయి. అనూజ్ ధర్, చంద్రచూడ్ ఘోస్‌లు రచించిన 'కోనండ్రమ్' అనే పుస్తకం ఆధారంగా రూపొందిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరిలో విడుదల చేయనున్నట్టు ప్రకటించారు.

మైనస్ 2 డిగ్రీల చలిలో..

'గీత గోవిందం' విజయంతో తెలుగులో క్రేజ్ తెచ్చుకున్న రష్మిక వరుస చిత్రాలతో బిజీ అయింది. మరోవైపు సొంతగడ్డ కన్నడలోనూ ఆ జోరు కొనసాగిస్తోంది. దర్శన్‌కు జంటగా ఆమె నటిస్తోన్న చిత్రం 'యజమాన'. ఇటీవల ఈ సినిమా కోసం ఓ పాటను చిత్రీకరించారు. స్వీడన్‌లో మైనస్ 2 డిగ్రీల చలిలో ఈ పాట షూటింగ్ జరుగగా, అంత చలిలోనూ రష్మిక ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్స్ కు యూనిట్ ఫిదా అయ్యారట. ఈ విషయాన్ని తానే ఇంటర్వ్యూలలో చెపుతోంది రష్మిక. శ్రేయ ఘోషల్, సోను నిగమ్ పాడిన ఈ మెలోడి సాంగ్ సినిమాకు హైలెట్ అంటున్నారు. అందుకు తగ్గట్టే లిరికల్ సాంగ్‌కు రెండు రోజుల్లో నాలుగు మిలియన్ల వ్యూస్ రావడం విశేషం.

నెక్ గుడ్ల ధరలు (100కు)	ఫామ్‌గేట్	రిటెయిల్
హైదరాబాద్	రూ.400	రూ.4.60
వరంగల్	రూ.402	రూ.4.60


మార్కెట్

సెన్సెక్స్ 336 ↓ 36,108

నిఫ్టీ 91 ↓ 10,831

ఐటీసీ లాభం 4% అప్

మార్జిన్ల అంచనాలు మిస్



ముంబై: ఎఫ్‌ఎంసీజీ, హోటల్స్, సిగరెట్ల వ్యాపారాలకు పేరుపడ్డ ఐటీసీ నికరలాభం.. గత నెలతో ముగిసిన మూడో క్వార్టర్‌లో నాలుగుశాతం పెరిగి రూ.3,209 కోట్లకు చేరుకుంది. ఈ కంపెనీ 2017 డిసెంబరుతో ముగిసిన క్వార్టర్‌లో రూ.3,090 కోట్ల లాభాలు సాధించింది. లాభాలు బాగానే ఉన్నా మార్జిన్లు మాత్రం ఆశించినస్థాయిలో పెరగలేదు. వార్షిక ప్రాతిపదికన ఇతర ఆదాయాలు పెరగడం వల్లే లాభం భారీగా నమోదయింది. అన్ని సెగ్మెంట్లలో మంచి వృద్ధి కనిపించడంతో నిర్వహణాపరమైన ఆదాయం 15 శాతం పెరిగి రూ.11,227 కోట్లకు చేరింది. మొత్తం వ్యయం గత ఏడాది రూ.6,377 కోట్లు కాగా, ఈ ఏడాది ఇవి 16.75 శాతం పెరిగి రూ.7,446 కోట్లు చేరుకుంది. మొత్తం ఆదాయంలో సిగరెట్ అమ్మకాల వాటా 40 శాతం నమోదయింది. వీటి అమ్మకాలు 9.6 శాతం పెరగడంతో రూ.5,074 కోట్లు వచ్చాయి. సిగరెట్ వ్యాపారంలో అనేక సవాళ్లు ఎదురైనా అద్భుత వృద్ధి కనబర్చామని, ఎఫ్‌ఎంసీజీ విభాగం గోధుమపిండి, స్నాక్స్, క్రీమ్ బిస్కెట్లు, నూడుల్స్, హ్యాండ్‌వాష్, బాడీవాష్, క్లాస్‌మేట్ నోట్‌బుక్స్ బాగా అమ్ముడయ్యాయని కంపెనీ తెలిపింది.

అన్ని విభాగాల్లో వృద్ధి

వార్షిక ప్రాతిపదికన ఈబీఐటీ (వడ్డీ, పన్ను చెల్లింపునకు ముందున్న ఆదాయం) 8.8 శాతం పెరిగింది. మార్జిన్లు మాత్రం 70.6 శాతం నుంచి 70.1 శాతానికి తగ్గాయి. ఈబీఐటీడీ (వడ్డీ, పన్ను, తరుగుదల, రుణాల చెల్లింపునకు ముందున్న ఆదాయం) 11.2 శాతం పెరిగి రూ.4,352 కోట్లుగా నమోదయింది. మార్జిన్ మాత్రం 39.8 శాతం నుంచి 38.5 శాతానికి క్షీణించింది. మార్జిన్ 40 శాతం వరకు నమోదవుతుందని మార్కెట్ వర్గాలు అంచనా వేశాయి. ఎఫ్‌ఎంసీజీ (ఫాస్ట్ మూవబుల్ కన్జూమర్ గూడ్స్) వ్యాపారం 10.3 శాతం పెరిగి రూ.8,274 కోట్లుగా నమోదయింది. ఈబీఐటీ 9.6 శాతం పెరిగినా, మార్జిన్ 44.2 శాతం నుంచి 43.9 శాతానికి తగ్గింది. ప్యాకేజ్డ్ ఫుడ్స్, దుస్తులు, స్టేషనరీ, పర్సనల్ కేర్ వస్తువుల అమ్మకాలు పెరిగాయి. హోటల్ వ్యాపారం వార్షిక ప్రాతిపదికన 11.7 శాతం వృద్ధి సాధించడంతో రూ.452 కోట్ల రాబడి వచ్చింది. ఈబీఐటీ 10 శాతం పెరిగిన మార్జిన్ 30 బేస్ పాయింట్లు తగ్గి 13.3 శాతానికి చేరింది. మిగతా విభాగాల కంటే అగ్రి సెగ్మెంట్ ఏకంగా 25.7 శాతం పెరుగుదల సాధించడంతో రూ.1,925 కోట్ల రాబడి వచ్చింది. ఈబీఐటీ మాత్రం ఏకంగా 14.8 శాతం తగ్గింది. కాగితం వ్యాపారం కూడా నిరాశపర్చలేదు. ఇది వార్షిక ప్రాతిపదికన 20.5 శాతం వృద్ధి చెందడంతో రూ.1,543 కోట్ల ఆదాయం కనిపించింది. నిర్వహణాపరమైన ఆదాయాలు కూడా బాగుతున్నాయి. ఈబీఐటీ 23.8 శాతం పెరిగి రూ.332 కోట్లకు చేరుకుంది. మార్జిన్ 50 బేసిస్ పాయింట్లు పెరిగాయి. ఫలితాల నేపథ్యంలో ఐటీసీ షేరు రూ.7.75 నష్టపోయి రూ.282 వద్ద ముగిసింది. పేపర్‌బోర్డ్స్, పేపర్, ప్యాకేజింగ్ సెగ్మెంట్ ఆదాయం గత ఏడాదితో పోలిస్తే 20.54 శాతం పెరిగి రూ.1,524 కోట్లకు చేరుకుంది. పేపర్ మిల్స్ సామర్థ్యం, డిమాండ్ పెరగడం వల్లే ఈ వృద్ధి సాధ్యపడిందని కంపెనీ తెలిపింది.

క్యూ3 నికరలాభం	రూ.3,209 కోట్లు
గత క్యూ3లో నికరలాభం	రూ.3,090 కోట్లు
మొత్తం వ్యయాలు	రూ.7,446 కోట్లు
సిగరెట్ల అమ్మకాల ద్వారా ఆదాయం	రూ.5,074 కోట్లు
ఎఫ్‌ఎంసీజీ ఆదాయం	రూ.8,274 కోట్లు
కాగితం వ్యాపార ఆదాయం	రూ.1,524 కోట్లు



నిస్సాన్ కిక్స్ తెచ్చింది

హైదరాబాద్, వెలుగు: జపాన్ కార్ల కంపెనీ నిస్సాన్ తన కొత్త ఎస్‌యూవీ 'కిక్స్'ను హైదరాబాద్‌లో బుధవారం ఆవిష్కరించింది. రూ.9.55 లక్షల నుంచి దీని ధర ప్రారంభమవుతుంది. ఇందులో ఎక్స్‌ఎల్, ఎక్స్‌వీ, ఎక్స్‌వీ ప్రీమియం, ఎక్స్‌వీ ప్రీమియం డీజిల్ వెర్షన్లు 11 రంగుల్లో అందుబాటులో ఉంటాయి. కిక్స్ 1.5 హెచ్ 4కే పెట్రోల్ వేరియంట్‌కు 5-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌ను, 1.5కే 9కే డీసీఐ డీజిల్ వేరియంట్‌కు 6-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌ను అమర్చారు. పెట్రోల్ వేరియంట్ 14.23 కిలోమీటర్లు, డీజిల్ వేరియంట్ 20.45 కిలోమీటర్ల మైలేజీని ఇస్తాయి. నెలసరి చందా విధానంలో జీరో డౌన్‌పేమెంట్ విధానంలోనూ కిక్స్‌ను సొంతం చేసుకోవచ్చని కంపెనీ ఉన్నతాధికారి అతుల్ సహానీ తెలిపారు. ఈ చందాలోనే బీమా, మెయింటెనెన్స్, 24 అవర్ రోడ్‌సైడ్ అసిస్టెన్స్ కూడా అందిస్తామని తెలిపారు. వినియోగదారులు కిక్స్‌ను తమకు నచ్చినట్టు మార్చుకోవడానికి 27 రకాల ఆక్సెసరీలను అందుబాటులో ఉంచామని చెప్పారు. మొదటి 10 వేల మంది కొనుగోలుదారులకు మూడేళ్ల వారంటీ, మెయింటెనెన్స్ ప్యాకేజీ, 24 అవర్స్ రోడ్‌సైడ్ అసిస్టెన్స్‌ను పూర్తి ఉచితంగా అందిస్తారు. నామమాత్రపు ఫీజు చెల్లించి దీనిని ఐదేళ్ల దాకా పొడగించుకోవచ్చు. కిక్స్‌లో ఎరౌండ్ వ్యూ మానిటర్, ఎనిమిది ఇంచుల ఫ్లోటింగ్ ఇన్ఫోటేన్‌మెంట్ సిస్టమ్, లెదర్ రాప్డ్ సాఫ్ట్ డ్యాష్‌బోర్డ్, డోర్ ట్రీమ్స్, ఏబీఎస్, బ్రేక్ అసిస్ట్, డ్యూయల్ ఎయిర్‌బ్యాగ్స్, నిస్సాన్ కనెక్ట్ వంటి ఫీచర్లు ఉన్నాయని కంపెనీ తెలిపింది.

పెరిగిన రేమండ్ లాభం

న్యూఢిల్లీ : టెక్స్‌టైల్స్ సహా వివిధ రంగాలలో కార్యకలాపాలున్న రేమండ్ గ్రూప్ నికరలాభం డిసెంబర్ 2018 తో ముగిసిన మూడో క్వార్టర్‌లో 30 శాతం పెరిగి రూ. 39.95 కోట్లకు చేరింది. అంతకు ముందు ఏడాది ఇదే క్వార్టర్‌కు నికరలాభం రూ. 30.71 కోట్లు. డిసెంబర్ క్వార్టర్‌లో ఆదాయం 12.69 శాతం వృద్ధితో రూ.1,705.68 కోట్లకు చేరినట్లు రేమండ్ గ్రూప్ తెలిపింది. టెక్స్‌టైల్ విభాగం ఆదాయం రూ. 768.38 కోట్ల నుంచి 10.32 శాతం పెరిగి రూ. 847.73 కోట్లయిందని, షర్టింగ్ విభాగపు ఆదాయం రూ. 159.25 కోట్లకు చేరిందని పేర్కొంది. అపారెల్ విభాగం ఆదాయం 19.62 శాతం వృద్ధితో 396.94 కోట్లకు, గార్మెంటింగ్ ఆదాయం రూ. 184.66 కోట్లకు చేరినట్లు కంపెనీ వివరించింది. టూల్స్ అండ్ హార్డ్‌వేర్ విభాగం ఆదాయం రూ. 99.94 కోట్లకు, ఆటో కాంపోనెంట్స్ విభాగం ఆదాయం రూ. 64.04 కోట్లకు చేరాయి.

బీమా పాలసీ కొనుగోలుదారుల్లో 40 ఏళ్లలోపు వాళ్లే ఎక్కువ



హైదరాబాద్, వెలుగు: తెలుగు రాష్ట్రాల్లో 30-40 ఏళ్ల మధ్య వయసున్న వాళ్లు ఆరోగ్య, జీవిత బీమా పాలసీలను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారని పాలసీబజార్‌డాట్‌కామ్ తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరంలో గత నెల వరకు ఆంధ్రప్రదేశ్‌లో 1.58 లక్షల జీవిత బీమా పాలసీలు ఇచ్చామని, బీమా కవరేజీ సగటున రూ.కోటి వరకు ఉంటున్నదని పేర్కొంది. తెలంగాణలో నెలకు 6,400 పాలసీలు అమ్ముడవుతున్నాయని, హైదరాబాద్‌లో వీటి సంఖ్య 3,600లని ప్రకటించింది. ఇక ఆంధ్రాలో ఇదే కాలంలో 7.34 లక్షలు, తెలంగాణలో 9.18 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలను విక్రయించినట్టు తెలిపింది. పాలసీ కొనుగోలుదారుల్లో 80 శాతం మంది పురుషులే ఉన్నారని కంపెనీ కమ్యూనికేషన్స్ హెడ్ అనిల్ ధాల్ తెలిపారు. హైదరాబాద్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో రూ.3,600 కోట్ల విలువైన ప్రీమియంలు వసూలు చేశామని, ఈ ఏడాది దీనిని రూ.3,200 కోట్లకు చేర్చాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్టు తెలిపారు. తమ వెబ్‌సైట్‌లో 300లకుపైగా ఇన్సూరెన్స్ ప్రొడక్టులను అమ్ముతున్నామని చెప్పారు. నెలకు సగటున 30 లక్షల ఆరోగ్య, జీవిత బీమా పాలసీలను అమ్ముతున్నట్టు చెప్పారు. గత ఏడాది నాటికి తమ కస్టమర్ల సంఖ్య 60 లక్షలు కాగా, ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి వీరి సంఖ్య కోటి మందికి పెరుగుతుందని అంచనా వేస్తున్నామన్నారు. పాలసీబజార్ వెబ్‌సైట్‌ను ఏటా పది కోట్ల మంది సందర్శిస్తున్నారని అనిల్ వివరించారు. మనదేశంలో ఇప్పటికీ బీమాపై తగిన అవగాహన లేదని, ప్రజలను చైతన్యవంతులను చేయడానికి ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

75 శాతం తగ్గిన ఇండిగో లాభం

న్యూఢిల్లీ: అధిక ఇంధన ధరలు, రూపాయి విలువ తగ్గుదల ఇండిగో ఎయిర్‌లైన్స్ లాభాలకు ఎసరుపెట్టాయి. గత నెలతో ముగిసిన క్వార్టర్‌లో ఈ కంపెనీ లాభం ఏకంగా 75 శాతం తగ్గి రూ.190.9 కోట్లుగా నమోదయింది. 2017 డిసెంబరు క్వార్టర్‌లో ఇది రూ.762 కోట్లు నమోదయింది. అయితే తాజా క్వార్టర్‌లో సంస్థ ఆదాయం 28 శాతం పెరిగి రూ.8,229 కోట్లు చేరింది. విమానయానరంగం ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ లాభాలు సాధించామని, విమానాల సంఖ్యను పెంచామని సీఈఓ రాహుల్ భాటియా అన్నారు.


వోడాఫోన్ ఐడియా రైట్స్ ఇష్యూ

రూ. 25 వేల కోట్లకు..



- రూ. 18, 250 కోట్లు తేనున్న ప్రమోటర్లు
- సబ్‌స్క్రయిబ్ కాకపోతే ఆ మొత్తాన్నీ తెచ్చేందుకు సంసిద్ధత
- జియో రాకతో తీరు మారిన టెలికం

న్యూఢిల్లీ : సబ్‌స్క్రయిబర్లపరంగా దేశంలోనే మొదటి ప్లేస్‌లో ఉన్న టెలికం ఆపరేటర్ వోడాఫోన్ ఐడియా రూ. 25 వేల కోట్ల రైట్స్ ఇష్యూకు రానుంది. నిధుల సమీకరణ వ్యూహం కోసం గత నవంబర్‌లో ఏర్పాటు చేసిన కమిటీ సలహా మీద ఈ రైట్స్ ఇష్యూను బుధవారం డైరెక్టర్ల బోర్డు ఆమోదించినట్లు వోడాఫోన్ ఐడియా తెలిపింది. రిలయన్స్ జియో రాకతో టెలికం రంగంలో పోటీ తీవ్రమైంది. దీంతో టారిఫ్‌లు విపరీతంగా తగ్గిపోయాయి. ఫలితంగా ఆపరేటర్ల ఆదాయానికి గండి పడింది. పోటీ తట్టుకునేందుకు వోడాఫోన్, ఐడియా విలీన బాట పట్టాయి. విలీనం పూర్తయిన తర్వాత భవిష్యత్ అవసరాలకు సరిపడా మరిన్ని ఆర్థిక వనరులు తెచ్చుకునేందుకు ఇప్పుడు కంపెనీ ఈ రైట్స్ ఇష్యూ తలపెడుతోంది. సెప్టెంబర్ 2018 తో అంతమైన రెండో క్వార్టర్‌కు వోడాఫోన్ ఐడియా లిమిటెడ్ రూ. 4,970 కోట్ల భారీ నష్టం ప్రకటించింది. ప్రభుత్వానికి చెల్లించాల్సిన స్పెక్ట్రమ్ ఫీజులతోపాటు, 4 జీ నెట్‌వర్క్ విస్తరణ కోసమూ కంపెనీకి నిధులు అవసరమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత వాటాదారులకు రైట్స్ ప్రాతిపదికన, ఈక్విటీ షేర్లు లేదా కన్వర్టిబుల్ డిబెంచర్ల జారీ ద్వారా నిధులు సమీకరించాలనేది కంపెనీ ఆలోచన. రైట్స్ ఇష్యూలో తమ వంతుగా ప్రమోటర్లయిన వోడాఫోన్ రూ. 11 వేల కోట్లు, ఆదిత్యా బిర్లా గ్రూప్ రూ. 7,250 కోట్లు సమకూర్చనున్నాయి. ఒకవేళ రైట్స్ ఇష్యూకు పూర్తి సబ్‌స్క్రిప్షన్ రాకపోతే, ఆ మిగిలిన మొత్తాన్ని నిబంధనలకు అనుగుణంగా తామే సమకూరుస్తామని కూడా ప్రమోటర్లు ప్రకటించారు. బ్యాలెన్స్ షీట్‌ను మరింత పటిష్టపరిచే ఉద్దేశంతో వోడాఫోన్ ఐడియా తన ఫైబర్ నెట్‌వర్క్‌ను అమ్మాలని కూడా చూస్తోంది. 1.56 లక్షల కిమీ మేర ఈ ఫైబర్ నెట్‌వర్క్ కంపెనీకి ఉంది. పెండింగ్ స్పెక్ట్రమ్ ఫీజు చెల్లింపుల గురించి చర్చించేందుకు వోడాఫోన్ ఐడియా ఛైర్మన్ కుమార మంగళం బిర్లా ఇటీవలే కేంద్ర టెలికం, ఆర్థిక శాఖలలోని ఉన్నతాధికారులను కలిశారు. మార్చి 2019 లో రూ. 3 వేల కోట్లు, రాబోయే ఆర్థిక సంవత్సరం మధ్యలో మరో రూ. 12 వేల కోట్ల స్పెక్ట్రమ్ ఫీజును కంపెనీ చెల్లించాల్సి వస్తుందని క్రెడిట్ సూయిజ్ తన నవంబర్ నివేదికలో వెల్లడించింది.



సెన్సెక్స్ 336 పాయింట్లు డౌన్

ముంబై : మార్కెట్లు రెండో రోజూ నష్టాల్లోనే ముగిశాయి. ప్రారంభంలో లాభాలను ఆర్జించినా చివర్లో నష్టాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అంతర్జాతీయంగా వృద్ధి రేటు నెమ్మదిస్తోందనే సూచనలతో పాటు చైనా-యుఎస్ వాణిజ్య యుద్ధ భయాలు వంటివి మార్కెట్ లో సెంటిమెంట్ ను బలహీనపరిచాయి. అంతర్జాతీయంగా చోటుచేసుకున్న పరిణామాల దృష్ట్యా ఇన్వెస్టర్లు జాగ్రత్తతో వ్యవహరిస్తున్నట్లు ట్రేడర్లు విశ్లేషిస్తున్నారు. యూరోపియన్ మార్కెట్లు నెగెటివ్ జోన్ లో ప్రారంభం కావడంతో మార్కెట్లో అమ్మకాల ఒత్తిడి తలెత్తింది. 30 షేర్ సెన్సెక్స్ ఫ్లాట్ గా మొదలై అంతర్జాతీయంగా క్రూడ్ ధరలు తగ్గుముఖం పట్టడం, డాలర్ తో పోలిస్తే రూపాయి మారకపు విలువ పుంజుకోవడం వంటి పరిణామాలతో సెన్సెక్స్ ఒకానొక సందర్భంలో 36,521 పాయింట్లను తాకింది. ఆ తరువాత వెల్లువెత్తిన అమ్మకాల ఒత్తిడితో మార్కెట్ ముగిసే సమయానికి 336.17 పాయింట్లు క్షీణించి 36.108.75 వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 91.25 పాయింట్లు నష్టపోయి 10,831.50 వద్ద స్థిరపడింది. ఆటోమొబైల్, బ్యాంక్స్, ఇన్ఫ్రా, ఐటీ వంటి సెక్టోరియల్ సూచీలు నష్టాల్లో ముగియగా, ఫార్మా, మెటల్ రంగాలు లాభాల్లో ముగిశాయి. ట్రేడింగ్ లో సన్ ఫార్మా, యస్ బ్యాంక టాప్ గెయినర్స్‌గా నిలవగా, ఐటిసి, ఎమ్&ఎమ్ భారీగా నష్టపోయాయి.

విజీ తో డెలివరీ ఈజీ



హైదరాబాద్, వెలుగు : లాజిస్టిక్స్ టెక్నాలజీ కంపెనీ 'విజీ' హైదరాబాద్ లో తమ సేవలను ప్రారంభించింది. బిజీ లైఫ్ లో రోజూవారి అవసరాల కోసం ట్రాఫిక్ లో తిప్పలు పడకుండా కేవలం డెలివరీ సేవలే కాకుండా మరింత అడ్వాన్స్డ్ సేవలను అందిస్తున్నట్లు విజీ తెలిపింది. విజీ యాప్ ద్వారా బట్టలు డ్రై వాష్ కు ఇవ్వడం, మందులు కొనుక్కురావడం, కావల్సిన సరుకులు, స్వీట్లు, ఫ్లవర్స్ తేవడం వంటి వాటితో పాటుగా ఇంటి వద్ద మర్చిపోయిన వస్తువులను తెచ్చివ్వడం ఇలా అన్ని రకాల సేవలను అందిస్తున్నామని విజీ ప్రమోటర్ రవి గొల్లపూడి తెలిపారు. యాప్ తో పాటు వాట్సాప్, ఫోన్, విజీ వెబ్ వంటి ప్లాట్ ఫాంల ద్వారా కూడా సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. దూరం ఆధారంగా చార్జీలు నిర్ణయించామని, 3 కి.మీ ల వరకు రూ.20 చెల్లించాల్సి ఉంటుందని, ఆ తరువాత ప్రతీ కి.మీ కి రూ.10 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ లో 1300 మంది యాప్ ను డౌన్ లోడ్ చేసుకున్నారని, 2 నెలల్లో 3 వేలకు పైగా డెలివరీలు జరిగాయని తెలిపారు. ఉదయం 9 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ఈ సేవలను వినియోగించుకోవచ్చని చెప్పారు. మొత్తం డెలివరీల్లో 50 శాతం కొనుగోళ్లతో కూడినవి కాగా, 45 శాతం పిక్&డ్రాప్ సేవలు నమోదయ్యాయని రవి వెల్లడించారు. ఈ యేడాది చివరి నాటికల్లా వెయ్యి మంది డెలివరీ బాయ్స్ ను నియమించుకుంటామని చెప్పారు. హైదరాబాద్ లో పలు మార్కెటింగ్ కార్యకలాపాల ద్వారా ఈ యేడాది చివరి కల్లా రోజుకు 15 వేల సర్వీస్ రిక్వెస్టులు సొంతం చేసుకోవడంతో పాటు ఇతర నగరాలకు విజీ సేవలను విస్తరించడం తమ లక్ష్యమని తెలిపారు. ఇప్పటికే రూ. కోటి పెట్టుబడి పెట్టామని, మరో రూ.కోటి పెట్టుబడి పెట్టేందుకు ఇన్వెస్టర్లతో చర్చలు జరుగుతున్నాయని అన్నారు.

వట్టినాగులపల్లిలో స్థలం అమ్మిన భాగ్యనగర్ ప్రాపర్టీస్

హైదరాబాద్, వెలుగు : సురానా గ్రూప్‌లోని రియల్‌ఎస్టేట్ కంపెనీ భాగ్యనగర్ ప్రాపర్టీస్ లిమిటెడ్ తనకు వట్టినాగులపల్లి (హైదరాబాద్) వద్ద ఉన్న 15.36 ఎకరాలలో 4,434 గజాలను విక్రయించింది. హైదరాబాద్ నగరానికే చెందిన సాయి సూర్య డెవలపర్స్‌తో ఈ విక్రయం కోసం ఒప్పందం కుదుర్చుకున్నామని భాగ్యనగర్ ప్రోపర్టీస్ లిమిటెడ్ తెలిపింది. గజం రూ. 12 వేల చొప్పున ధర నిర్ణయమయిందని, దీంతో రూ. 5.32 కోట్ల ఆదాయం లభించిందని కంపెనీ బుధవారం వెల్లడించింది. సేల్‌డీడ్ కూడా పూర్తయినట్టు తెలిపింది. ఐటీ కంపెనీ ఏర్పాటుకు చాలా కాలం కిందట ఈ స్థలాన్ని రాష్ట్రప్రభుత్వం ఒక కంపెనీకి ఇవ్వగా, ఆ తర్వాత అది చేతులు మారి భాగ్యనగర్ ప్రోపర్టీస్‌కు వచ్చింది.

యుఎస్ నుంచి లోసర్టాన్ వెనక్కి

ఏపీఐలో మలినాలున్నాయ్....

దీనిని హెటెరో తయారు చేసింది

టోరెంట్ ఫార్మా వెల్లడి



హైదరాబాద్ : హైపర్‌టెన్సివ్ డ్రగ్ లోసర్టాన్ (16 బ్యాచ్‌ల)ను అమెరికా మార్కెట్ నుంచి స్వచ్ఛందంగా ఉపసంహరించుకుంటున్నట్లు టోరెంట్ ఫార్మాస్యూటికల్స్ ప్రకటించింది. ఈ ఔషధపు ఏపీఐ (యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రీడియెంట్)లో మలినాలు ఉన్న కారణంగా ఆ 16 బ్యాచ్‌లను వెనక్కి రప్పిస్తున్నట్లు తెలిపింది. ఔషధపు ఏపీఐని హైదరాబాద్‌కు చెందిన హెటెరో ల్యాబ్స్ లిమిటెడ్ తయారు చేసిందని పేర్కొంది. లోసర్టాన్ డ్రగ్‌లో ఎన్‌నైట్రోసోడియిథిలమైన్ (ఎన్‌డీఈఏ) అనే మలినాన్ని కనుగొన్నట్లు వివరించింది.

కొన్ని ఆహారోత్పత్తులు, నీరు, ఇండస్ట్రియల్ ప్రాసెస్‌లలో సహజంగానే ఈ ఎన్‌డీఈఏ రూపొందుతుందని టోరెంట్ ఫార్మా తెలిపింది. మనుషులలో క్యాన్సర్‌కు ఎన్‌డీఈఏ కారణమయ్యే అవకాశాలనున్నాయని ఇంటర్‌నేషనల్ ఏజన్సీ ఫర్ రిసెర్చ్ ఆన్ క్యాన్సర్ (ఐఏఆర్‌సీ) గుర్తించడం వల్లే, ఔషధాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు పేర్కొంది. ఎఫ్‌డీఏ సూచించిన దాని కంటే ఎక్కువ ఎన్‌డీఈఏ ఉన్న ఔషధాలను మాత్రమే వెనక్కు రప్పిస్తున్నట్లు టోరెంట్ ఫార్మా స్పష్టం చేసింది. ఔషధ వినియోగం మీద ఎలాంటి ప్రతికూల రిపోర్టులూ ఇప్పటిదాకా రాలేదని కూడా తెలిపింది. హైపర్‌టెన్షన్ చికిత్సకు ఈ లోసర్టాన్ ఔషధాన్ని ఉపయోగిస్తారు. టైప్ 2 డయాబెటిక్ పేషెంట్లలో నెఫ్రోపతీ ట్రీట్‌మెంట్‌కు కూడా వినియోగిస్తారని కంపెనీ వివరించింది. ఐతే, ప్రత్యామ్నాయ ట్రీట్‌మెంట్ లేకుండా, లోసర్టాన్ వినియోగాన్ని హఠాత్తుగా నిలిపివేస్తే, పేషెంట్లకు ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తొచ్చని టోరెంట్ ఫార్మా ప్రకటన వెల్లడించింది.

ఎదగకపోవచ్చునేమో..

న్యూఢిల్లీ: దేశీయంగా డిమాండ్ తక్కువగా ఉండటం, అంతర్జాతీయంగా సానుకూల పరిస్థితులు లేకపోవడం, లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై అనిశ్చితి నెలకొనడం వల్ల సమీప భవిష్యత్‌లో పారిశ్రామిక కార్యకలాపాల్లో పెద్దగా పురోగతి ఉండకపోవచ్చని డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ అధ్యయన నివేదిక పేర్కొంది. దీని ప్రకారం.. పన్నుల రాబడి లక్ష్యాలను సాధించలేకపోవడంతో ప్రభుత్వం తన పెట్టుబడి లక్ష్యాలను తగ్గించుకోవడం పారిశ్రామిక ప్రగతికి ప్రతికూలంగా మారుతుంది. గత ఏడాది డిసెంబరులో పారిశ్రామి ఉత్పత్తి సూచీ (ఐఐపీ) పెరుగుదల 1.5-2 శాతం

పరిశ్రమలపై డీఅండ్‌బీ అంచనా

మధ్య ఉండొచ్చు. అయితే నవంబరులో ఇది 17 నెలల కనిష్టం 0.5 శాతానికి తగ్గినట్టు కేంద్రం ప్రభుత్వం ప్రకటించింది. ఉత్పత్తిరంగం మందగించడమే ఇందుకు కారణమని తెలిపింది. అనుకోకుండా వచ్చిన ఇబ్బందులు, ప్రతికూలతల వల్ల ఈ ఆర్థిక సంవత్సరంలో ఆర్థికవృద్ధి తగ్గిందని డీ అండ్ బీ ఎకనమిస్ట్ అరుణ్ సింగ్ అన్నారు. వచ్చే నెల ప్రవేశ పెట్టబోయే బడ్జెట్ ఆర్థిక వ్యవస్థకు మార్గదర్శకంగా ఉంటుందని వ్యాఖ్యానించారు.

వార్ వన్‌సైడే..! సమ ఉజ్జీల సమరం అనుకున్న పోరు ఏకపక్షంగా మారింది..! బలాబలాల్లో కోహ్లీసేనకు దీటుగా కనిపించి.. సొంతగడ్డపై అంత తేలిగ్గా తలవంచదని పేరున్న న్యూజిలాండ్.. కోహ్లీసేన దెబ్బకు బిత్తరపోయింది..! మహ్మద్ షమీ పేస్.. కుల్దీప్–చహల్ ద్వయం స్పిన్ ధాటికి విలవిల్లాడిపోయింది..! బంతితో బెంబేలెత్తించి బ్లాక్‌క్యాప్స్ టీమ్‌ను తక్కువ స్కోరుకే కూల్చేసిన టీమిండియా చిన్న టార్గెట్‌ను ఇట్టే కరిగించి ఐదు వన్డేల సిరీస్‌లో ఘనమైన బోణీ కొట్టింది..! కివీస్ గడ్డలో ఐదు వన్డేల సిరీస్‌ను విజయంతో ఆరంభించడం పదేళ్ల తర్వాత ఇదే తొలిసారి కాగా, వన్డేల్లో వేగంగా వంద వికెట్లు పడగొట్టిన ఇండియా బౌలర్‌గా షమీ రికార్డుకెక్కడం విశేషం..!



షమీ (6–2–19–3)

షమిలమిల.. కివిలవిల

చెలరేగిన షమీ, కుల్దీప్ | రాణించిన ధవన్, విరాట్ | తొలి వన్డేలో గ్రాండ్ విక్టరీ | 8 వికెట్లతో న్యూజిలాండ్ చిత్తు

01

వన్డేల్లో అత్యంత వేగంగా వంద వికెట్లు పడగొట్టిన ఇండియా బౌలర్ షమీ. 55 మ్యాచ్‌ల్లోనే ఈ రికార్డును అందుకున్న అతను.. ఇర్ఫాన్ పఠాన్ (59 వన్డేలు)ను అధిగమించాడు.

02

వన్డేల్లో వేగంగా ఐదు వేల రన్స్ చేసిన ఇండియా రెండో ప్లేయర్ ధవన్. అతను 118 ఇన్నింగ్స్‌ల్లో ఈ ఘనత సాధించాడు. కోహ్లీ (114 ఇన్నింగ్స్) టాప్ ప్లేస్‌లో ఉన్నాడు.

10

వన్డేల్లో అత్యధిక రన్స్ చేసిన క్రికెటర్ల లిస్ట్‌లో కోహ్లీ స్థానం. 10430 రన్స్‌తో విండీస్ గ్రేట్ బ్రియాన్ లారా (10405)ను దాటి టాప్–10లోకి అడుగుపెట్టాడు.


నేపియర్: ఆస్ట్రేలియాను రెండు ఫార్మాట్లలో మట్టి కరిపించిన ఉత్సాహంలో ఉన్న కోహ్లీసేన.. న్యూజిలాండ్ టూర్‌నూ అదిరిపోయే విజయంతో ఆరంభించింది. ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా ఇక్కడి మెక్‌లారెన్ పార్క్‌లో బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో ఎనిమిది వికెట్లతో (డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో) గ్రాండ్ విక్టరీ కొట్టింది. సూర్య కిరణాల కారణంగా ఆటకు అంతరాయం కలిగిన అరుదైన ఘటన జరిగిన ఈ పోరులో మహ్మద్ షమీ (6-2-19-3), కుల్దీప్ యాదవ్ (4/39) బౌలింగ్ ధాటికి కివీస్ తొలుత 38 ఓవర్లలో 157 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ కేన్ విలియమ్సన్ (81 బంతుల్లో 7 ఫోర్లతో 64) మినహా హోమ్‌టీమ్‌లో ఎవ్వరూ రాణించలేకపోయారు. కుల్దీప్ నాలుగు, షమీ మూడు వికెట్లతో రెచ్చిపోగా.. చహల్ రెండు వికెట్లు తీసి ప్రత్యర్థిని దెబ్బకొట్టాడు. అనంతరం శిఖర్ ధవన్ (103 బంతుల్లో 6 ఫోర్లతో 75 నాటౌట్), విరాట్ కోహ్లీ (59 బంతుల్లో 3 ఫోర్లతో 45) సత్తా చాటడంతో 49 ఓవర్లలో 156 పరుగులకు కుదించిన టార్గెట్‌ను ఇండియా 34.5 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి అలవోకగా ఛేదించింది. షమీకి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

ధవన్ మెరుపులు

నాణ్యమైన బౌలింగ్‌తో కివీస్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేసిన కోహ్లీసేన బ్యాటింగ్‌లో కూడా రాణించింది. ముఖ్యంగా గత తొమ్మిది మ్యాచ్‌ల్లో ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయని ఓపెనర్ శిఖర్ ధవన్ మళ్లీ ఫామ్‌లోకి వచ్చాడు. కివీస్ త్వరగా ఆలౌటవడంతో డిన్నర్ (ఇన్నింగ్స్) బ్రేక్ ముందే ఇండియా ఛేజింగ్‌కు రాగా.. రోహిత్ శర్మ (11)తో కలిసి తొలి వికెట్‌కు 41 రన్స్ జోడించిన శిఖర్ మంచి ఆరంభం అందించాడు. కానీ, విరామం నుంచి వచ్చిన వెంటనే బ్రేస్‌వెల్ సంధించిన షార్ట్ లెంగ్త్ బాల్‌ను వెంటాడిన రోహిత్ స్లిప్‌లో గప్టిల్‌కు క్యాచ్ ఇచ్చాడు. 11వ ఓవర్లో సన్ లైట్‌తో ధవన్ ఇబ్బంది పడడంతో ఆటకు అరగంట పాటు అంతరాయం కలిగింది. తర్వాత ఒక ఓవర్ తగ్గించి ఇండియా టార్గెట్‌ను 156 రన్స్‌కు కుదించారు. తిరిగి ఆట మొదలైన తర్వాత ధవన్ కాస్త నెమ్మదించినా వన్‌డౌన్‌లో వచ్చిన కోహ్లీ స్వేచ్ఛగా బ్యాటింగ్ చేశాడు. ముచ్చటైన షాట్లతో ఫెర్గూసన్ బౌలింగ్‌లో రెండు, శాంట్నర్ ఓవర్లో ఒక ఫోర్ కొట్టాడు. మరోవైపు సౌథీ బౌలింగ్‌లో డబుల్ తీసి ధవన్ (69 బంతుల్లో) హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. విజయానికి మరో 24 రన్స్ అవసరమైన దశలో ఫెర్గూసన్ బౌలింగ్‌లో కోహ్లీ అవుటైనా రాయుడు (13 నాటౌట్)తో కలిసి ధవన్ లాంఛనం పూర్తి చేశాడు.

బౌలర్ల పంజా

వరల్డ్‌కప్ తుది జట్టులో చోటే లక్ష్యంగా పేసర్ మహ్మద్ షమీ మరోసారి అదిరిపోయే బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. కుల్దీప్ యాదవ్ నాలుగు వికెట్లు తీసినా.. ధవన్ హాఫ్ సెంచరీతో అకట్టుకున్నా ఈ మ్యాచ్ హీరో షమీనే. తన తొలి స్పెల్ (4-2-13-2)లోనే షమీ ప్రత్యర్థి టాపార్డర్‌ను దెబ్బకొట్టగా.. ఆసియా కప్ ఫైనల్ తర్వాత మొదటిసారి జంటగా బరిలోకి దిగిన లెగ్ స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, చాహల్ మిగతా వారి పని పట్టారు. విలియమ్సన్ బాగానే పోరాడినా అతడికి సహకారం కరువైంది. కొత్త బంతితో పిచ్‌పై సీమ్ రాబట్టిన షమీ...వరుస ఓవర్లలో ఓపెనర్లు మార్టిన్ గప్టిల్ (5), కొలిన్ మన్రో (8)ను అవుట్ చేసి ప్రత్యర్థికి షాకిచ్చాడు. 18 రన్స్‌కే రెండు వికెట్లు కోల్పోయిన ఈ దశలో కెప్టెన్ కేన్, వెటరన్ ప్లేయర్ రాస్ టేలర్ (24) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఎలాంటి రిస్క్ తీసుకోకుండా జాగ్రత్తగా ఆడాల్సిన దశలో టేలర్ ఎదురుదాడికి దిగాడు. ఈ క్రమంలో క్రీజు ముందుకొచ్చి షాట్ ఆడే ప్రయత్నం చేయగా చహల్ చాకచక్యంగా స్లో బాల్ వేసి రిటర్న్ క్యాచ్‌తో అతడిని అవుట్ చేశాడు. కాసేపటికే ఇదే ట్రిక్‌తో టామ్ లాథమ్ (11)ను కూడా చహల్ రిటర్న్ క్యాచ్‌తో పెవిలియన్‌కు పంపడంతో కివీస్ 74/4తో పీకల్లోతు కష్టాల్లో పడింది. అంతకుముందే విజయ్ శంకర్ బౌలింగ్‌లో కేదార్ జాదవ్ క్యాచ్ వదిలేయడంతో 20 పరుగుల వద్ద కేన్ అవుటయ్యే ప్రమాదం తప్పించుకున్నాడు. దీన్ని సద్వినియోగం చేసుకొని కెప్టెన్ ఓపిగ్గా ఆడుతున్నా.. మరో ఎండ్‌లో అతనికి సహకారం కరువైంది. కెప్టెన్‌కు తోడుగా హెన్రీ నికోల్స్ (12), శాంట్నర్ (14) కాసేపు ప్రతిఘటించే ప్రయత్నం చేశారు. కానీ, ఇండియా స్పిన్నర్లు వారిని కుదురుకోనివ్వలేదు. టీమ్ స్కోరు 100 దాటిన వెంటనే హెన్రీని పార్ట్‌టైమర్ కేదార్ వెనక్కు పంపగా.. శాంట్నర్‌ను షమీ వెనక్కు పంపారు. అప్పటికే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న కేన్.. కుల్దీప్ బౌలింగ్‌లో పేలవ షాట్ ఆడి శంకర్‌కు చిక్కాడు. ఆపై, తన వరుస ఓవర్లో డగ్ బ్రేస్‌వెల్ (7), లుకీ ఫెర్గూసన్ (0), ట్రెంట్ బౌల్ట్ (1)లను అవుట్ చేసిన కుల్దీప్ కివీస్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు.



కుల్దీప్ (10–1–39–4)

స్కోరు బోర్డు

న్యూజిలాండ్: గప్టిల్ (బి) షమీ 5, మన్రో (బి) షమీ 8, విలియమ్సన్ (సి) విజయ్ శంకర్ (బి) కుల్దీప్ 64, రాస్ టేలర్ (సి అండ్ బి) చహల్ 24, లాథమ్ (సి అండ్ బి) చహల్ 11, నికోల్స్ (సి) కుల్దీప్ (బి) కేదార్ 12, శాంట్నర్ (ఎల్బీ) షమీ 14, బ్రేస్‌వెల్ (బి) కుల్దీప్ 7, టిమ్ సౌథీ (నాటౌట్) 9, ఫెర్గూసన్ (స్టంప్డ్) ధోనీ (బి) కుల్దీప్ 0, ట్రెంట్ బౌల్ట్ (సి) రోహిత్ (బి) కుల్దీప్ 1; **ఎక్స్‌ట్రాలు:** 2; **మొత్తం:** 38 ఓవర్లలో 157 ఆలౌట్; **వికెట్ల పతనం:** 1-5, 2-18, 3-52, 4-76, 5-107, 6-133, 7-146, 8-146, 9-148, 10-157; **బౌలింగ్:** భువనేశ్వర్ 5-0-20-0, షమీ 6-2-19-3, శంకర్ 4-0-19-0, చహల్ 10-0-43-2, కుల్దీప్ 10-1-39-4, కేదార్ 3-0-17-1;

ఇండియా (టార్గెట్ 49 ఓవర్లలో 156): రోహిత్ (సి) గప్టిల్ (బి) బ్రేస్‌వెల్ 11, ధవన్ (నాటౌట్ 75), కోహ్లీ (సి) లాథమ్ (బి) ఫెర్గూసన్ 45, రాయుడు (నాటౌట్) 13; **ఎక్స్‌ట్రాలు:** 12; **మొత్తం:** 34.5 ఓవర్లలో 156/2; **వికెట్ల పతనం:** 1-41, 2-132; **బౌలింగ్:** ట్రెంట్ బౌల్ట్ 6-1-19-0, టిమ్ సౌథీ 6.5-0-36-0, ఫెర్గూసన్ 8-0-41-1, బ్రేస్‌వెల్ 7-0-23-1, శాంట్నర్ 7-0-32-0.



ఆట నిలవడంతో గ్రౌండ్ నుంచి బయటకు వెళ్తున్న కోహ్లీ, ధవన్

ఆటపై సన్‌స్ట్రైక్..

వర్షం కారణంగా ఆట ఆగడం తెలుసు. ప్రతికూల వాతావరణంలోనో, ఈదురు గాలులు వీచినప్పుడో.. వెలుతురు సరిగ్గా లేనప్పుడో.. అభిమానులు హద్దు మీరినప్పుడో మ్యాచ్ నిలవడం చూశాం. భారీగా ఎండకాస్తే ఆటకు బ్రేక్ ఇవ్వాలని ఆస్ట్రేలియన్ ఓపెన్ టెన్నిస్ నిర్వాహకులు నిర్ణయించినట్టు విన్నాం. కానీ, అస్తమిస్తున్న సూర్యుని కిరణాలు ఒక అంతర్జాతీయ మ్యాచ్‌కు అడ్డొస్తాయని ఊహించామా! ఇండియా-న్యూజిలాండ్ తొలి వన్డే ఈ అరుదైన ఘటనకు వేదికైంది. మెక్‌లారెన్ పార్క్ నార్త్ స్టాండ్ నుంచి వస్తున్న సూర్య కిరణాలు ముఖం మీద పడడంతో 11వ ఓవర్లో ధవన్ ఇబ్బంది పడ్డాడు. ఈ ఓవర్లో ఫెర్గూసన్ వైడ్‌గా వేసిన తొలి బంతిని ధవన్ అసలు చూడలేకపోయాడు. సన్ లైట్ నేరుగా కండ్ల మీదకు రావడంతో బంతిని గుర్తించలేకపోతున్నట్టు అంపైర్లకు విషయం చెప్పాడు. పరిస్థితిని గమనించిన ఫీల్డ్ అంపైర్లు షాన్ హైగ్, షాన్ జార్జ్ ఆట నిలిపివేయడంతో ఇరు జట్ల ప్లేయర్లు డ్రెస్సింగ్ రూమ్ బాట పట్టారు. సన్‌లైట్ పూర్తిగా తొలగిన తర్వాతే మళ్లీ ఆట ప్రారంభించారు. వర్షం రాకుండా డక్‌వర్త్ లూయిస్ పద్ధతిని వాడిన తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఇదే కావడం గమనార్హం.

వారం కిందటా ఆగింది

సన్‌లైట్ కారణంగా క్రికెట్ మ్యాచ్ నిలిచిపోవడం ఇదే తొలిసారి కాదు. రెండేళ్ల కిందట ఇదే మైదానంలో కివీస్-బంగ్లాదేశ్ మధ్య టీ20 పోరు ఇదే కారణంతో ఆగింది. కానీ, అప్పుడు ఓవర్లు కుదించి డక్‌వర్త్‌ను ఆశ్రయించాల్సిన అవసరం రాలేదు. వారం రోజుల కిందట ఒక దేశవాళీ మ్యాచ్ కూడా సన్‌లైట్ కారణంగా కొద్దిసేపు నిలిచింది. మెక్‌లారెన్ పార్క్‌లో ఇలాంటి ఘటనలు సాధారణమే అని స్థానికులు అంటున్నారు. సూర్య కిరణాలతో ఆట ఆగడాన్ని వాళ్లు ‘ సన్ స్ట్రైక్’గా పిలుస్తున్నారు. దీనికి ప్రధాన కారణం మెక్‌లారెన్ పార్క్‌లో పిచ్‌ను తూర్పు-పడమర దిశల్లో ఏర్పాటు చేయడమే. దాదాపు అన్ని క్రికెట్ గ్రౌండ్లలో పిచ్‌లు నార్త్-సౌత్ డైరెక్షన్‌లో ఉంటాయి. మెక్‌లారెన్ పిచ్ అందుకు విరుద్ధమైన దిశలో ఉండడంతో సూర్యాస్తమయ సమయంలో కిరణాలు మైదానంలో తూర్పు వైపు ఉన్న ఆటగాళ్లను ఇబ్బంది పెడతాయి. ఈ విషయం నిర్వాహకులకు తెలుసు. అయితే, బుధవారం సాయంత్రం ఆకాశం మేఘావృతం అవుతుందని భావించారు. కానీ, అలా కాకపోవడం.. పైగా, వేసవి కావడంతో ఎక్కువసేపు ఎండ ఉండడంతో ఈ మ్యాచ్‌కూ ఆటంకం తప్పలేదు.

ఆట ఆపొచ్చు

సూర్య కిరణాలు కళ్లలోకి చొచ్చుకురావడంతో ఆటగాళ్లు ఇబ్బంది పడడం గుర్తించామని, ప్లేయర్ల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఐసీసీ నిబంధన 2.7.1 ప్రకారం తామే ఆటను నిలిపివేసినట్టు అంపైర్ షాన్ జార్జ్ చెప్పాడు. తన 14 ఏళ్ల కెరీర్‌లో ఇలాంటి కారణంతో ఆట ఆగడాన్ని చూడలేదన్నాడు. సన్‌లైట్ తమను ఇబ్బంది పెడితే ఆటగాళ్లు కూడా ఫిర్యాదు చేయొచ్చని తెలిపాడు. కొందరు ప్లేయర్లకు ఈ నిబంధన గురించి తెలిసినా వాళ్లు అప్పీల్ చేయడం లేదన్నాడు. ఇక, ఇలాంటి ఘటనను తానెప్పుడూ చూడలేదని ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ అంటున్నాడు. 2014లో ఒకసారి సన్‌లైట్ కళ్లపై పడడంతో అవుటయ్యానని చెప్పాడు. అయితే, అప్పుడు ఈ రూల్ లేదన్నాడు.

కోహ్లీకి రెస్ట్.. రోహిత్‌కు కెప్టెన్సీ

నేపియర్: న్యూజిలాండ్‌తో ఐదు మ్యాచుల వన్డే సిరీస్‌లో చివరి రెండు వన్డేలతోపాటు ఆ తర్వాత జరిగే టీ 20 సిరీస్ నుంచి టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీకి బీసీసీఐ విశ్రాంతినిచ్చింది. రెండు వన్డేలతో పాటు టీ20 లకు రోహిత్ శర్మ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడని బీసీసీఐ బుధవారం ప్రకటించింది. కొద్ది నెలలుగా విరామం లేకుండా క్రికెట్ ఆడుతున్న కోహ్లీకి విశ్రాంతి ఇవ్వాలనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. కాగా, కోహ్లీ స్థానంలో మరో ఆటగాడిని జట్టులోకి తీసుకోలేదు.

“ ఎలాంటి బ్యాటింగ్ లైనప్‌నైనా అడ్డుకోగలమనే నమ్మకం మా బౌలర్లకు ఉంది. షమీ గతంలో ఎప్పుడూ లేనంత ఫిట్‌గా ఉన్నాడు. ఆసీస్ సిరీస్ ఫామ్‌ను కివీస్‌లో కూడా కొనసాగించాడు. టాస్ ఓడిన వెంటనే టార్గెట్ 300కి పైగా ఉంటుందని అనుకున్నా, కానీ మా బౌలర్ల వల్ల అది సగానికే పరిమితమైంది. ధవన్ చాలా ప్రమాదకర ఆటగాడు. మ్యాచ్‌ను ముగించి ఫామ్‌లోకి రమ్మని శిఖర్‌కు బ్రేక్ టైమ్‌లో చెప్పాం.

– విరాట్ కోహ్లీ

మిథాలీకి టెస్టింగ్ టైమ్



నేపియర్ : కోహ్లీ అండ్‌కో తొలి వన్డేలో గెలిచి కివీస్ గడ్డపై అదరగొట్టే ఆరంభాన్నిస్తే మరో వైపు ఇండియా విమెన్స్ టీమ్ కూడా అదే రీతిలో న్యూజిలాండ్‌ను ఓడించేందుకు రెడీ అవుతుంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా న్యూజిలాండ్‌తో గురువారం తొలి వన్డే ఆడుతుంది. టీ20 వరల్డ్ కప్ సెమీస్ నుంచి అనూహ్యంగా నిష్క్రమించిన విమెన్స్ టీమ్ ఆ తర్వాత జరిగిన వివాదాన్ని మరచిపోయి ఈ సిరీస్‌కు రెడీ అయింది. ఈ నేపథ్యంలో కెప్టెన్ మిథాలీ రాజ్‌తో పాటు, కొత్త కోచ్ రామన్‌కు కూడా ఈ సిరీస్ పరీక్షగామారింది.

సింధు, సైనా, శ్రీకాంత్ బోణీ

జకార్తా : ఇండియన్ స్టార్ ప్లేయర్లు పీవీ సింధు, సైనా నెహ్వాల్, కిడాంబి శ్రీకాంత్ ఇండోనేషియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో రెండో రౌండ్‌కు చేరారు. కశ్యప్, సాయిప్రణీత్, శుభాంకర్ డే తొలి రౌండ్ దాటలేకపోయారు. మహిళల సింగిల్స్‌లో తొలి రౌండ్‌లో సింధు 22-24, 21-8, 21-17 తేడాతో లీ జురుయ్(చైనా)పై గెలిచింది. రెండో రౌండ్‌లో జార్జియా మరిస్కా(ఇండోనేసియా)తో తలపడుతుంది. మరో మ్యాచ్‌లో సైనా 7-21, 21-16, 21-11తో ఆయుస్టైన్ (ఇండోనేసియా)పై గెలిచింది. రెండో రౌండ్‌లో ఇండోనేసియాకి చెందిన ఫిత్రియానితో తలపడుతుంది. పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్ 21-12, 21-8తో వీ ఫెంగ్‌చాంగ్ (మలేసియా)పై వరుస గేముల్లో గెలిచి రెండో రౌండ్‌కు చేరాడు.

సంజితకు గ్రేట్ రిలీఫ్



న్యూఢిల్లీ: డ్రగ్స్ ఆరోపణలతో ఇండియా వెయిట్‌లిఫ్టర్ సంజిత చానుపై అంతర్జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ సమాఖ్య (ఐడబ్ల్యుఎఫ్) విధించిన తాత్కాలిక నిషేధాన్ని తొలగించింది. ప్రస్తుతం ఉన్న సమాచారం అధారంగా సంజితపై ఉన్న నిషేధాన్ని తొలగిస్తున్నామని వెయిట్‌లిఫ్టింగ్ సమాఖ్య లీగల్ సెల్ ఈ మెయిల్ ద్వారా భారత వెయిట్‌లిఫ్టింగ్ సమాఖ్యకు తెలిపింది. అయితే ఐడబ్ల్యుఎఫ్ హియరింగ్ ప్యానెల్ ఈ విషయంపై తుది నిర్ణయం వెల్లడించాల్సి ఉందని వివరించింది. 2018 గోల్డ్‌కోస్ట్ కామన్వెల్త్ క్రీడల్లో 53 కిలోల విభాగంలో స్వర్ణపతకం గెలుచుకున్న సంజిత నుంచి 2017లో అమెరికాలో జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్‌కు ముందు శాంపిల్స్‌ను సేకరించారు. నిషేధిత డ్రగ్స్ వాడినట్లు తేలడంతో నిరుడు మే 15 నుంచి ఆమెపై నిషేధం విధించారు.

అరెరె సెరెనా..



సెమీస్‌లో ఎవరితో ఎవరు

పురుషుల సింగిల్స్

సిట్సిపాస్ X నడాల్

జొకోవిచ్ X పౌలీ

మహిళల సింగిల్స్

క్విటోవా X కొలిన్స్


ప్లిస్కోవా X ఒసాక

- ప్లిస్కోవా చేతిలో విలియమ్స్ అనూహ్య ఓటమి
- క్వార్టర్స్‌లోనే ముగిసిన పోరాటం
- సెమీస్‌లో ఒసాక, జొకోవిచ్, పౌలీ

మెల్‌బోర్న్ : అమెరికన్ టెన్నిస్ గ్రేట్ సెరెనా విలియమ్స్ కల చెదిరింది. 24వ గ్రాండ్‌స్లామ్ సాధించడమే లక్ష్యంగా ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో దూసుకెళ్తున్న సెరెనా జోరుకు అనూహ్యంగా బ్రేకులు పడ్డాయి. క్వార్టర్‌ఫైనల్లో ఏడో సీడ్ కరోలినా ప్లిస్కోవా చేతిలో ఓడిన సెరెనా కన్నీళ్లతో టోర్నీ నుంచి నిష్క్రమించింది. మరో క్వార్టర్‌ఫైనల్‌లో స్వితొలినాపై గెలిచిన జపాన్ సంచలనం నవోమి ఒసాక సెమీస్ చేరింది. పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ నొవాక్ జొకోవిచ్‌తో పాటు ఫ్రెంచ్ ప్లేయర్ లూకస్ పౌలీ సెమీఫైనల్ చేరాడు. బుధవారం హోరాహోరీగా సాగిన మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో అంచనాలకు మించి ఆడిన ప్లిస్కోవా (చెక్) 6-4, 4-6, 7-5తో సెరెనాను ఓడించింది. మూడో సెట్‌లో 5-1తో ఆధిక్యంలో నిలిచి సులభంగా మ్యాచ్ నెగ్గేలా కనిపించిన సెరెనా అనవసర తప్పిదాలు చేసి చేజేతులా ఓటమి కొనితెచ్చుకుంది. ఆఖరి సెట్‌లో విలియమ్స్ తొలి మ్యాచ్ పాయింట్ కోసం సర్వ్ చేయగా, దానిని అంపైర్ ఫుట్ ఫాల్ట్ ప్రకటించడం వివాదాస్పదమైంది. ఆ తర్వాత సెరెనా ఆట పూర్తి గాడి తప్పించింది. వరుసగా ఆరు గేమ్‌లు కోల్పోయిన అమెరికా గ్రేట్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. కీలక సమయంలో నాలుగు మ్యాచ్ పాయింట్లు కాచుకున్న 26 ఏళ్ల ప్లిస్కోవా ఈ మెగా టోర్నీలో రెండేళ్ల తర్వాత సెమీస్‌కు చేరుకుంది. మరో మ్యాచ్‌లో నాలుగో సీడ్ ఒసాక(జపాన్) 6-4, 6-1తో ఆరో సీడ్ ఎలినా స్వితోలినా(ఉక్రెయిన్)ను ఓడించింది. ఈ మ్యాచ్‌లో స్వితోలినా గాయపడడం ఒసాకకు కలిసొచ్చింది.


జొకో ఏడో సారి

వరల్డ్ నంబర్‌వన్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా) కెరీర్‌లో ఏడో సారి ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీఫైనల్ చేరాడు. పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో నొవాక్ 6-1, 4-1 ఆధిక్యంలో ఉన్న దశలో జపాన్ సంచలనం కి నిషికోరి రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. ఈ టోర్నీలో ఇప్పటికే మూడు ఐదు సెట్ల మ్యాచ్‌లాడిన నిషికోరి ప్రారంభం నుంచే కోర్టులో అసౌకర్యంగా కనిపించాడు. తొడ కండరాలు పట్టేయడంతో ఇబ్బంది పడ్డాడు. రెండో సెట్‌కు ముందు వైద్య సాయం తీసుకున్న జపాన్ ప్లేయర్ చివరి వరకు పోరాడలేకపోయాడు. మరో మ్యాచ్‌లో 28వ సీడ్ లుకాస్ పౌలీ(ఫ్రాన్స్) 7-6(7/4), 6-3, 6-7(2/7), 6-4తో కెనడా ప్లేయర్ మిలోస్ రోనిచ్‌ను ఓడించి తొలిసారి సెమీఫైనల్ చేరాడు. లాస్ట్-4లో జొకోవిచ్‌తో అమీతుమీకి సిద్ధమయ్యాడు.



సివంగుల ఆకలి ఆరాటం.. జిరాఫీ ప్రాణ పోరాటం

ఆరు సివంగులు.. ఒక జిరాఫీ.. నాలుగు గంటల పోరాటం. సివంగులది ఆకలి ఆరాటమైతే.. జిరాఫీది ప్రాణం కోసం పోరాటం. అయినా చివరికి గెలిచింది జిరాఫీ పోరాటమే. వేటలో సివంగులకు మిగిలింది పరాభవమే. దక్షిణాఫ్రికాలోని క్లాసెరీ ప్రైవేట్ నేచర్ రిజర్వ్‌లో జరిగిందీ ఘటన. ఆకలితో చెట్ల ఆకులను మేస్తున్న జిరాఫీని చూసి సివంగులకూ ఆకలేసినట్టుంది. వెంటనే ఓ సివంగి జిరాఫీ వీపు మీదకు దూకేసింది. ఇంకోటి కడుపును పట్టేసింది. మిగతావి కాళ్లను టార్గెట్ చేశాయి. అయినా కూడా ఆ జిరాఫీని అవి ఏమీ చేయలేకపోయాయి. బహుశా జిరాఫీ ఆకారమే దానికి కలిసొచ్చి ఉంటుంది. అందుకే కాలు రక్తమోడుతున్నా సివంగులను కాళ్లతో జాడించి తంతూ ఫైట్ చేసింది. పోరాడితే పోయేదేముంది అన్న నానుడి గట్టిదంటూ నిరూపించింది. ఈ ఘటననంతా ఎమిలీ వైటింగ్ అనే సఫారీ గైడ్ రికార్డ్ చేసింది.





పాలనురగల నయాగారా గడ్డకట్టింది

ప్రపంచంలో అందమైన జలపాతం నయాగారా. అంతెత్తు నుంచి అది కిందకు దూకుతుంటే పాల నురగలు పొంగుతున్నట్టు అనిపించదూ! మరి, ఆ పాలనురగలు ఇప్పుడు ఆగిపోయాయి. దానర్థం ఎండిపోయిందనికాదు. అమెరికాలో ఉష్ణోగ్రతలు పడిపోయి అతి శీతల పరిస్థితులు ఏర్పడడంతో జలపాతం నీళ్లు పాక్షికంగా గడ్డకట్టాయి. దీంతో జల దూకట్లేదు. ఆ మంచు అంచుల నుంచి జస్ట్ కారుతోందంతే. అమెరికాలోని న్యూయార్క్, కెనడాలోని ఒంటారియో నగరాల మధ్య ఉంటుంది నయాగారా. ఇప్పుడు గడ్డకట్టిన భాగం అమెరికా వైపు. అమెరికాలో ఇప్పుడు మైనస్ 25 డిగ్రీల చల్లటి వాతావరణం ఉంది.

ప్లాస్టిక్ పరేషాన్

దేశంలో రోజూ 26 వేల టన్నుల ప్లాస్టిక్ వేస్ట్

న్యూఢిల్లీ: ప్లాసిక్ వాడకం పర్యావరణానికి ముప్పని తెలిసినా ఇంకా దాన్ని వాడేస్తూనే ఉన్నాం. కూరగాయలు తెచ్చుకోవడానికో.. కొత్త బట్టలు తెచ్చుకోవడానికో.. ఇలా దేనికో ఒక దానికి నిత్యం ప్లాసిక్ కవర్లు, ప్లాస్టిక్ బాటిళ్లను ఉపయోగిస్తున్నాం. రోజూ 25,940 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు మన దేశంలో పోగుపడిపోతున్నాయట. ఇందులో 60 ప్రధాన నగరాల నుంచి బయటకు వచ్చే ప్లాస్టిక్ వ్యర్థాలు 4,059 టన్నులు. ఈ 60 నగరాల్లో ఢిల్లీ, చెన్నై, కోల్‌కతా, ముంబై, బెంగళూరు నగరాలు ఉత్పత్తి చేసే ప్లాస్టిక్ వేస్ట్ 50 శాతం కన్నా ఎక్కువ. ఈ ఐదునగరాల్లో ఒక్క రోజు తయారయ్యే ప్లాస్టిక్ వ్యర్థాలు.. 2264 టన్నులు. ఈ చేదు వాస్తవం సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (సీపీసీబీ) ఇటీవల చేపట్టిన అధ్యయనంలో తేలింది. ఈ మొత్తంలో 40శాతం అంటే 10,376 టన్నుల ప్లాస్టిక్ సేకరణకు నోచుకోవడం లేదు. మిగతా 60శాతం అంటే 15,564 టన్నుల ప్లాస్టిక్‌ను వివిధ పద్ధతుల ద్వారా సేకరిస్తున్నారు. దీన్ని రీసైకిల్ చేయడం ద్వారా కొద్దిలో కొద్దిగా పర్యావరణానికి ముప్పువాటిల్లకుండా చూస్తున్నారు. అయితే సేకరించని ఆ 40శాతం ప్లాస్టిక్ పర్యావరణానికి పెను సవాల్‌గా మారుతోందని సీపీసీబీ తన అధ్యయనంలో పేర్కొంది. ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కువగా ఉత్పత్తయ్యే నగరాల్లో ఢిల్లీ మొదటి స్థానంలో ఉండగా.. చెన్నై రెండోస్థానంలో నిలిచింది. మన హైదరాబాద్ ఏడో స్థానంలో నిలిచింది. హైదరాబాద్‌లో రోజూ బయటికి వచ్చే ప్లాస్టిక్ వ్యర్థాలు 199 టన్నులు.

94 శాతం బాటిల్ వేస్టే

మునిసిపాలిటీల్లో పోగవుతున్న ఘన వ్యర్థాల్లో ప్లాస్టిక్ వేస్ట్ సగటున 6.92 శాతమని సీపీసీబీ సర్వేలో వెల్లడైంది. తక్కువగా చండీగఢ్‌లో 3.1 శాతం, ఎక్కువగా సూరత్‌లో 12.4 శాతం ప్లాస్టిక్ వ్యర్థాలు పోగవుతున్నాయి. ఢిల్లీలో 10 శాతం, చెన్నైలో 9 శాతం, ముంబైలో 6 శాతం చొప్పున ఘన వ్యర్థాల్లో ప్లాస్టిక్ వేస్ట్ ఉత్పత్తవుతోంది. మొత్తం ప్లాస్టిక్ వ్యర్థాల్లో రీసైకిల్ చేయగల 94 శాతం వాటా పెట్ (కూల్ డ్రింక్ బాటిల్), పీవీసీ (పాలీవినైల్ క్లోరైడ్.. ప్లాస్టిక్ పైపులు) వంటి 'థెర్మోప్లాస్టిక్' అని సర్వేలో తేలింది. మిగతా 6 శాతం రీసైకిల్ చేయలేని థెర్మోకోల్, ఫైబర్ కలిగిన ప్లాస్టిక్ వంటి థెర్మోసెట్‌కు చెందిన ప్లాస్టిక్ వ్యర్థాలున్నట్టు సీపీసీబీ సర్వేలో తేలింది.

2022 నాటికి

2022 నాటికి యూజ్ అండ్ త్రో (సింగిల్ యూజ్) ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు కేంద్రం పెట్టుకున్న లక్ష్యాలను చేరుకునేలా చర్యలు తీసుకోవాల్సిందిగా సోమవారం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్ర పర్యావరణ శాఖ కార్యదర్శి సీకే మిశ్రా ఆదేశాలిచ్చారు. అవసరమైతే లీగల్ చర్యలూ తీసుకోవాలని సూచించారు. ఒకరకంగా ఇది మంచి నిర్ణయమే అయినా మరిన్ని కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉందని టాక్సిక్ వాచ్ అలయన్స్ (టీడబ్ల్యూఏ) ప్రతినిధి గోపాల్ కృష్ణ అన్నారు. అందులో భాగంగా ముందు ప్లాస్టిక్ వ్యర్థాల దిగుమతిని నిషేధించాలని సూచించారు. చైనా, మలేసియా లాంటి దేశాలు చేస్తుండగా లేనిది ఇండియా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. 2015లో పెట్ బాటిళ్ల దిగుమతిని నిషేధించినా.. 2016 నుంచి స్పెషల్ ఎకనామిక్ జోన్ (సెజ్)లో వాటిని దిగుమతి చేసుకోవచ్చని చెబుతూ చేసిన సవరణ వల్ల విదేశీ, దేశీ ప్లాస్టిక్ వ్యర్థాల వ్యాపారులకు మేలు చేస్తోందన్నారు.



- సగానికిపైన ఢిల్లీ, చెన్నై, కోల్‌కతా, ముంబై, బెంగళూరు నుంచే
- 40 శాతం చెత్తను తీయనే తీయట్లే.. సీపీసీబీ అధ్యయనంలో వెల్లడి

టాప్ 10 సిటీలు (రోజువారీగా ప్లాస్టిక్ వ్యర్థాలు టన్నుల్లో..)

ఢిల్లీ	689
చెన్నై	429
కోల్‌కతా	425
ముంబై	408
బెంగళూరు	313
అహ్మదాబాద్	241
హైదరాబాద్	199
సూరత్	149
కాన్పూర్	106
పుణె	101



సీల్‌కు ప్లాస్టిక్ ఉరి

ప్లాస్టిక్ భూతం జంతువులు, జలచరాలను ఎలా పట్టిపీడిస్తోందో చెప్పేందుకు ఈ ఫొటోనే నిదర్శనం. బ్రిటన్‌లోని నార్ఫోక్ బీచ్‌లో సీల్ మెడకు ప్లాస్టిక్ వల ఉరి బిగించేసింది. గొంతును కోసి రక్తం చిందేలా చేసింది. పాపం ఆ వలను ఎలా తీసుకోవాలో తెలియక ఆ సీల్ ఉక్కిరిబిక్కిరి అయింది. దాని బాధ ఎలాంటిదో దాని కళ్లను చూసి చెప్పేయొచ్చు. నార్విచ్‌కు చెందిన పాల్ మార్క్రో అనే ఫొటోగ్రాఫర్ దాని పరిస్థితి చూసి ఇలా కెమెరాతో క్లిక్‌మనిపించాడు. వలంటీర్లకు ఫోన్ చేసి సీల్ పరిస్థితిని వివరించాడు. అయితే, వాళ్లు తామేం చేయలేమంటూ చేతులెత్తేశారు.

కరెంట్ బిల్లు రూ.23 కోట్లు!



మధ్యతరగతి జీవితమంటేనే బతుకు బండి లాగడం కనాకష్టమవుతుంది. కరెంట్ బిల్లు 500 దాటితే లబోదిబోమనే పరిస్థితి. అట్లాంటిది రూ.23 కోట్లు వచ్చిందంటే.. గొంతులో ఒక్క క్షణం ఊపిరి ఆగినట్టు ఉంటుంది. జీవితాంతం కష్టపడినా కట్టలేని మొత్తం చూసి ముద్ద దిగని పరిస్థితి వస్తుంది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని కనౌజ్‌కు చెందిన అబ్దుల్ బాసిత్‌కూ అదే పరిస్థితి ఎదురైంది. అతడి ఇంట్లో 178 యూనిట్ల కరెంట్ కాలితే.. కరెంటోళ్లు ఇచ్చిన బిల్లు రూ.23,67,71,524.. అక్షరాలా 23కోట్ల 67లక్షల 71వేల 524 రూపాయలు! అది చూసిన బాసిత్‌కు గుండె ఆగినంత పనైంది. వెంటనే ఉరుకులుపరుగులు పెట్టాడు. కరెంట్ అధికారులను కలిశాడు. బాబూ.. ఇదేంటి ఇంత వచ్చింది అని అడిగాడు. తన జీవితాంతం కష్టపడి సంపాదించినా అంత బిల్లు కట్టలేనని మొరపెట్టుకున్నాడు. ఆ బిల్లు చూసి అధికారులూ కంగుతిన్నారు. సమస్యేంటో తెలిశాకే బిల్లు కడుదువుగానీ అని భరోసా ఇచ్చారు. బిల్లులు కొట్టేటప్పుడు మీటర్ రీడింగుల్లో తలెత్తే లోపాల వల్ల ఇలా జరిగి ఉంటుందని, ఆ బిల్లును మారుస్తామని, మళ్లీ మీటర్ రీడింగ్ తీసుకుని కొత్త బిల్లు ఇస్తామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షాదాబ్ అహ్మద్ చెప్పారు.

సిమ్ లేని సిత్రమైన ఫోన్

బటన్లు, రంధ్రాలు లేకుండా కొత్త ఒరవడితో దూసుకొస్తున్న నయా ఫోన్

మనం మాట్లాడేది అవతలి వాళ్లకు వినిపించేందుకు స్పీకర్ ఉంటుంది. మన మాట ఆ స్పీకర్ వరకు చేరేందుకు కింద చిన్న చిన్న రంధ్రాలుంటాయి! చార్జింగ్ పెట్టేందుకు పోర్ట్.. అదీ ఓ రంధ్రమే! పాటలు వినడానికి, ఫోన్ మాట్లాడడానికి.. హెడ్‌ఫోన్స్ పెట్టుకునేలా ఓ పోర్ట్.. అది ఇంకో రంధ్రం! ఫోన్ ఆన్‌ఆఫ్ బటన్ ఒకటి.. సౌండ్ కోసం ఇంకో రెండు బటన్లు! ఇలా ప్రతి ఫోన్లోనూ కనిపించే ఫీచర్లవి. అవేవీ లేకుండా.. అసలు ఫోన్ మాట్లాడడానికి కావాల్సిన సిమ్‌లే లేకుండా ఫోన్ వస్తే..? ఇప్పుడు అదే మోడల్‌లో ఓ కొత్త ఫోనొస్తోంది.

ఎలా పనిచేస్తుంది?

- డిజైన్‌లో చిన్న గీత గానీ, రంధ్రంగానీ లేని, కేవలం గ్లాస్, మెటల్‌తో తయారు చేసిన ఈ ఫోన్ వైర్‌లెస్ టెక్నాలజీ ఆధారంగా పనిచేస్తుంది.
- దీంట్లో సిమ్ వేసుకోవడానికి లేదు. ఈ-సిమ్ టెక్నాలజీతో ఇది పనిచేస్తుంది. కాబట్టి ఈ-సిమ్ కనెక్టివిటీ ఉన్న ఆపరేటర్లయితేనే ఈ ఫోన్ పనిచేస్తుంది.
- వాల్యూమ్, పవర్ బటన్‌లు లేవు కదా. కాబట్టి అది కెపాసిటివ్ సెన్సర్లతో పనిచేస్తుంది. హెచ్‌టీసీ యూ 12+ మోడల్‌లో ఫోన్ అంచుకు కెపాసిటివ్ సెన్సర్లను పెట్టినట్టే దీనికీ పెట్టారు. ఆ సెన్సర్లే పవర్, వాల్యూమ్ బటన్లుగా పనిచేస్తాయి.
- స్పీకర్లు, గ్రిల్స్‌కు బదులు పీజోఎలక్ట్రిక్ ట్రాన్స్‌డ్యూసర్స్ సాయంతో మాటను అవతలి వారికి చేరవేస్తాయి. మనకు వినపడేలా చూస్తాయి. అందుకు స్క్రీన్‌నే అవి వాడుకుంటాయి. ఇయర్ రిసీవర్‌గా పనిచేయాలన్నా, లౌడ్‌స్పీకర్ కావాలన్నా స్క్రీన్ వైబ్రేట్ అవుతుంది.
- వైర్‌లెస్ చార్జర్‌తోనే ఫోన్ బ్యాటరీ ఫుల్ అవుతుంది. 18 వాట్ల ఫాస్ట్ వైర్‌లెస్ చార్జింగ్ దీని సొంతం.
- మిగతా ఫీచర్లు దాదాపు అన్ని ఫోన్లలాంటివే. 20 మెగా పిక్సెల్ సెల్ఫీ కెమెరా సహా సోనీ ఐఎంఎక్స్380+ఐఎంఎక్స్350 రెండుకెమెరాలున్నాయి.
- వాటర్, డస్ట్ రెసిస్టెంట్. స్నాప్‌డ్రాగన్ 845 చిప్‌తో పనిచేసే ఈ ఫోన్ 4జీబీ ర్యామ్‌తో వస్తుంది. 5.99 అంగుళాల ఓఎల్ఈడీ డిస్‌ప్లే మరో ఆకర్షణ.
- ధర, ఎప్పుడు రిలీజ్ చేసేది మాత్రం కంపెనీ వెల్లడించలేదు. జస్ట్ దాని ఫీచర్లను చూపిస్తూ టీజర్‌ను రిలీజ్ చేసిందంతే.



ఇంతకీ ఆ ఫోన్ ఏంటంటే... చైనాకు చెందిన 'మైజు జీరో'



నోట్ల మీద నోట్లు.. 300 కోట్లు

ఈ ఫొటో చూశారా? సుమారు రూ.313 కోట్లు డబ్బును కొండలా పేర్చారు. ఎందుకో తెలుసా? ఉద్యోగులకు బోనస్ ఇచ్చేందుకు. చైనాలో త్వరలో కొత్త ఏడాది (స్ప్రింగ్ ఫెస్టివల్) వస్తుండటంతో అక్కడి జియాంగ్జీ ప్రావిన్స్‌లోని ఓ స్టీల్ కంపెనీ ఇంత భారీ మొత్తంలో ఇయర్ ఎండ్ బోనస్ ప్రకటించింది. కంపెనీలోని 5 వేల మంది ఉద్యోగులకు ఆ డబ్బు కొండను పంచేసింది. అంటే ఒక్కో ఉద్యోగికి రూ. 6.27లక్షల బోనస్ అన్నమాట. కొత్త ఏడాదికి ముందు ఉద్యోగులకు ఇలా బోనస్ ఇస్తే ఆ కొత్త ఏడాదిలో ఉద్యోగులు మరింత సంతోషంతో, ఉత్సాహంతో పని చేస్తారట. అందుకే ఇదంతా!

చంద్రుడిని తవ్వుతరట

2025 నాటికి పని మొదలు.. ఈఎస్ఏ సన్నాహాలు

చీకటి చంద్రుడిపై దిగుతానని చెప్పిన చైనా.. చేసి చూపించింది. పత్తి పండిస్తానన్న మాట నిలబెట్టుకుంది. చంద్రయాన్ 2 ప్రయోగం చేసేందుకు ఇస్రో కంకణం కట్టుకుంది. ఇలా చంద్రుడిపై చాలా దేశాలు కన్నేస్తున్నాయి. తాజాగా యూరప్ కూడా చందమామపై దృష్టి పెట్టింది. తవ్వేస్తానంటోంది. చంద్రుడిపై ఖనిజా నిక్షేపాలను తవ్వి తీస్తుందట. చంద్రుడిపై బేస్ ఏర్పాటు చేసేందుకు రాకెట్లను తయారు చేసే ఏరియన్ గ్రూప్‌తో ఒప్పందం చేసుకున్నామని యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఈఎస్ఏ) వెల్లడించింది. 2025 నాటికి జాబిల్లిపైకి వెళ్లి పని మొదలుపెడతామని తెలిపింది. చంద్రుడిపై ఉండే వనరులను ఉపయోగించుకుంటామని చెప్పింది. "చంద్రుడిపై మనిషిని పంపడమొక్కటే కాదు. అక్కడ దొరికే వనరులను ఎలా ఉపయోగించుకోవాలో కూడా పరిశోధనలు చేస్తాం. అందుకే చందమామ ఉపరితలంపై ఉండే మట్టి (రీగోలిత్) పొరలను తవ్వుతాం"అని ఈఎస్ఏ చెప్పింది. అంతరిక్షంలో దొరికే ప్రతి వనరునూ భూమిపైనా వాడుకోవచ్చని అంటోంది. రీగోలిత్ నుంచి నీళ్లు, ఆక్సిజన్‌ను వెలికి తీసేందుకు అవకాశం ఉంటుందని చెబుతోంది. వాటితోనే అంతరిక్షంలో మరింత దూరం వెళ్లేందుకు ఇంధనాన్ని తయారు చేసే వీలు చిక్కుతుందని అంటోంది. ఈ ఏడాది చివర్లో జరిగే స్పేస్19+ సదస్సులో దీనిపై నిర్ణయాన్ని ఖరారు చేస్తామని ఈఎస్ఏ హ్యూమన్ అండ్ రోబోటిక్ డైరెక్టర్ డాక్టర్ డేవిడ్ పార్కర్ తెలిపారు. ఈఎస్ఏ ప్రయోగంలో భాగంగా అక్కడికి పరికరాలను తీసుకెళ్లేందుకుగానూ ఏరియన్ 6 రాకెట్ వెర్షన్ అయిన 4 బూస్టర్ల ఏరియన్ 64 రాకెట్‌ను వాడాలని ఏరియన్ యోచిస్తోంది. జర్మనీకి చెందిన స్టార్టప్ కంపెనీ పీటీసైంటిస్ట్స్‌తో కలిసి పనిచేస్తోంది. పీటీసైంటిస్ట్స్ లూనార్ ల్యాండర్‌ను తయారు చేయనుంది. గ్రౌండ్ కంట్రోల్, సమాచార వసతులను బెల్జియంకు చెందిన ఎస్ఎంఈ, స్పేస్ అప్లికేషన్స్ సర్వీస్ అందించనుంది.

జర్మనీలో సిమ్యులేషన్

ఈ ప్రయోగానికి సన్నాహకంగా చంద్రుడి వాతావరణాన్ని సిమ్యులేషన్ (కృత్రిమంగా సృష్టించడం) చేయనుంది ఈఎస్ఏ. భూమిపై చంద్రుడి వాతావరణం ఉండేలా జర్మనీ కొలోన్‌లోని ఈఎస్ఏ ఆస్ట్రోనాట్ సెంటర్‌లో కొత్త ఫెసిలిటీని నిర్మిస్తోంది. లూనా అని పిలుస్తున్న ఆ ఫెసిలిటీలో చంద్రుడిపై ఉండే మూడొంతుల వాతావరణాన్ని సృష్టించనుంది. 4.5 కోట్ల ఏళ్ల క్రితం ఐఫిల్ అగ్నిపర్వత ప్రభావిత ప్లేస్‌లోని మట్టిని తీసుకొచ్చి చంద్రుడి వాతావరణాన్ని క్రియేట్ చేస్తున్నారు. సూర్యుడి నుంచి వచ్చే శక్తినే ఫొటోవోల్టాయిక్ పానెళ్ల ద్వారా వాడుకుంటామని, దానినే నీటిని హైడ్రోజన్, ఆక్సిజన్‌గా మార్చేందుకూ వాడతామని ఈఎస్ఏ తెలిపింది. వాటిని ఫ్యుయెల్ సెల్‌లో విడివిడిగా స్టోర్ చేస్తామని తెలిపింది.



నెట్ కట్.. ఫేస్‌బుక్ బ్యాన్

- టోంగా దేశంలో నిలిచిన ఇంటర్నెట్ సేవలు
- సముద్రంలో కేబుల్ వైర్లు తెగిపోవడంతో..

నుకులలోఫా (టోంగా): ఇప్పుడంతా ఇంటర్నెట్ కాలం.. చదువు, వ్యాపారం, సమాచారం ఇలా ప్రతి పనికీ నెట్‌పైనే ఆధారపడుతున్నాం. అలాంటిది నెట్ సేవలన్నీ ఆగిపోతే. ఫేస్‌బుక్, యూట్యూబ్, ఈ కామర్స్ లాంటి సైట్లన్నీ పని చేయకపోతే. పసిఫిక్ మహా సముద్రంలోని టోంగా దేశానికి ఇదే పరిస్థితి ఎదురైంది. ఇంటర్నెట్ సేవలు ఆగడంతో ఆ దేశం అల్లాడిపోతోంది. నెట్‌కు సంబంధించి సముద్రంలోని కేబుల్ వైర్లు తెగిపోవడంతో సెల్‌ఫోన్లు, కంప్యూటర్లన్నీ మూగబోయాయి. టోంగా పర్యాటకంపై ఆధారపడిన దేశం. ప్రభుత్వ పనులు, వ్యాపారాలకూ ఇంటర్నెట్టే ఆధారం. దీంతో నెట్‌ను పునరుద్ధరించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. బాకప్‌గా ఓ చిన్న శాటిలైట్‌ను వాడుతున్నారు. దేశంలో 80 శాతం ఇంటర్నెట్ ట్రాఫిక్ సోషల్ మీడియాదే. దీంతో ఎక్కువగా అవసరం లేని, బ్యాండ్‌విడ్త్ ఎక్కువగా వాడుకునే ఫేస్‌బుక్, యూట్యూబ్ లాంటి సైట్లను ప్రస్తుతానికి బ్యాన్ చేశారు. ఇలా పరిమిత యాక్సెస్‌తో సమస్యలొస్తున్నాయని, మనీ ట్రాన్స్‌ఫర్‌కు ఇబ్బంది ఎదురవుతోందని టోంగా ప్రజలంటున్నారు. ఫిజీ నుంచి టోంగాకు 827 కిలోమీటర్ల ఇంటర్నెట్ కేబుల్ వైర్లున్నాయి.



Printed and Published by Ankam Ravi on behalf of VIL MEDIA Pvt. Ltd., and Printed at Venkateshwara Publishers, Survey No. 8/A2, Raikunta Village, Pedda Golconda, Shamshabad Mandal, Ranga Reddy District - 500008. and Published from VIL MEDIA Pvt. Ltd., Plot No. 13/A/B/C, Road No. 12, MLA's Extension Colony, Banjara Hills, Hyderabad-500034, Telangana. Editor: Ankam Ravi, Phone: 040-23606681, RNI: TELTEL/2015/64779.